16-05Pg1exHNWMJQE.qxd:16-05Pg1exHNWMJQE.qxd 1/1/02 6:59 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 105 పేజీలు: 16 వెల: 6.50

రక్షణ రంగానికి కేంద్రం
బాబా జన్మభూమి: మంత్రి లోకేష్

1700 కోట్ల నకిలీ బిల్లుల స్కాం నిందితుడు అరెస్టు

2లో




## భగ్గుమన్న పెట్రోలు, డీజిల్

### లీటరుకు రూ. 3, సిఎన్‌జి రూ. 2 పెంపు

**న్యూఢిల్లీ:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం, ప్రపంచ ముడిచమురు ధరలలో భారీ పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఒఎంసిలు) పెరుగుతున్న నష్టాలతో సతమతమవుతున్నందున, శుక్రవారం దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.3కుపైగా పెంచాయి. ఇరాన్, అమెరి కాల మధ్య ఉద్రిక్తతల కారణంగా సరఫరాకు దీర్ఘకాలం అంతరాయం కలుగుతుందనే భయాలతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 >>2

| | పెట్రోలు | డీజిల్ |
|---|---|---|
| విజయవాడ | రూ.113.03 | <? .98.96 |
| హైదరాబాద్ | రూ.110.89 | రూ.100.71 |
| ఢిల్లీ | రూ.97.77 | <? .90.67 |
| కోల్‌కతా | రూ.108.74 | <? .95.13 |
| ముంబై | రూ.106.68 | <? .93.14 |
| చెన్నై | రూ.103.67 | <? .95.25 |

## హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు

### పొదుపు చర్యల్లో భాగంగా టిడిపి కీలక నిర్ణయం

**విజయవాడ,మే 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ మహానాడును పొదుపు చర్యల్లో భాగంగా హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యల్లో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సీఎం స్పష్టం చేసారు. నెల్లూరులో మూడురోజుల పాటు జరగనున్న మహానాడు స్థానంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో 27,28 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1848 క్లస్టర్లలో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి, ఎన్టీఆర్ భవన్‌నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫిజికల్‌గా, అదే విధంగా జిల్లాల నుంచి వర్చ్యువల్ విధానంలో >>2

# భక్తికి, భద్రతకు కేంద్రం పుట్టపర్తి

23 నెలల్లో 23లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం..
సీమను డ్రాట్ జోన్ నుంచి గ్రోత్ జోన్‌గా మారుస్తున్నాం
ఆత్మనిర్భర్ భారత్‌లో ఎపి ముఖ్యపాత్ర
యుద్ధ విమాన ప్రాజెక్టు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు



శుక్రవారం పుట్టపర్తిలో ఆధునిక యుద్ధ విమాన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిఎం చంద్రబాబు

**శ్రీ సత్యసాయి జిల్లా, మే 15, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తిని కేవలం భక్తి కే కాదు దేశభద్రత కూడా కేంద్రంగా చూడబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలసి పుట్టపర్తి లోని బ్రాహ్మణపల్లి వద్ద ఏర్పాటుచేసిన సభా వేదికలో వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్‌ఎఫ్ సీఎల్ ప్రాజెక్టులకు చెందిన శిలాఫలకాలను కూడా వర్చువల్ గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడ్డాయన్నారు. ఇక్కడ అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకం అని, దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందన్నారు. ఏఎంసిఏ ప్రాజెక్టుతో ఆత్మనిర్బర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారనీ, ఆధునికతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఈ ప్రాజెక్టు ఏర్పాటు అవుతోందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందన్నారు. ఆపరేష్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, పరీక్షించారని, ఏఎంసిఏ లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించ బడనున్నాయన్నారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందన్నారు. రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామనీ, జెట్ స్పీడ్ తో అనుమతులిచ్చామన్నారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ప్రాజెక్టుతో మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తాయనీ, భారత్‌ఫోర్జ్, హెచ్‌ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ లకు శంకుస్థాపన చేశామన్నారు. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయనీ, >>2

## స్వదేశీ యుద్ధ విమానాలు కీలకం



### త్వరలో రూ.1.75 లక్షల కోట్ల ఆయుధాల ఉత్పత్తి

### దేశానికి ఎపి రోల్ మోడల్: రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**శ్రీ సత్యసాయి జిల్లా, మే 15, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ రక్షణలో పుట్టపర్తిలో తయారయ్యే యుద్ధ విమానాలు కీలకంగా మారనున్నాయని కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మీడియం కాంపాక్ట్ కాంబాక్ట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్ట్ తోపాటు వాటి అనుబంధ ప్రాజెక్టుల శిలాఫలకాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ ఏఎంసిఏ ప్రాజెక్టు దేశ చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని, స్వదేశీ తయా రీతో రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. అంతర్జాతీయంగా >>2



## నల్లని మబ్బులు బారులు.. బారులు

### 26నే కేరళకు నైరుతి పవనాలు

**ముందేవస్తున్నా ఈసారి సాధారణ వర్షపాతమే!**

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు భారత వాతావరణశాఖ (ఐఎండి) చల్లని కబురు చెప్పింది. ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం ప్రారంభమవుతుంది. >>2

## జూన్21న నీట్ రీఎగ్జామ్

### వచ్చే యేడాది నుంచి ఆన్‌లైన్, ప్రశ్నాపత్రం లీక్ నిందితులను వదలం: కేంద్ర మంతి ధర్మేంద్ర ప్రధాన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 15:** ఈ నెల 3న జరిగిన నీట్ పరీక్షను రద్దుచేసిన నేపథ్యంలో తిరిగి పరీక్షను జూన్ 21న నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. అలాగే ఇకపై నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కాకుండా ఉండటం కోసం వచ్చే ఏడాది నుంచి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. నీట్ పరీక్ష రద్దు అనంతరం పరిణామాల నేపథ్యంలో కేంద్ర మంత్రి గురువారం ఉన్నతస్థాయి సమావేశాన్ని తన నివాసంలో నిర్వహించారు. సమావేశంలో తిరిగి పరీక్షను నిర్వహించడంపై సుదీర్ఘంగా చర్చించి జూన్ 21న తిరిగి నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విషయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం మీడియాకు తెలిపారు. వచ్చే ఏడాది 2027-28 నుంచి ఆన్‌లైన్ (సీబీటీ విధానం)లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్ వెల్లడించారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడటమే తమ ధ్యేయమని చెప్పారు. జూన్ 21 నుంచి నీట్ పరీక్షను తిరిగి నిర్వహిస్తుండగా, జూన్ 14 నుంచి అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్




వార్తలు రాగానే వెంటనే విచారణకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులు ఎవరూ నష్టపోకూడదనే పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే తమ ప్రధాన కర్తవ్యమని, విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనేది తమ మొదటి ప్రాధాన్యమన్నారు. పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించబోమని, పేపర్ ఎలా లీక్ అయింది? ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందనేది పూర్తి వివరాలు బహిర్గతమవుతాయన్నారు. సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సి న అవసరం లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు చూసి భయపడొద్దని, అడ్మిట్‌కు సంబంధించి ఇంకా మెరుగుపడాల్సి న అవసరం ఉందన్నారు. పరీక్ష ఫీజు లేకుండా విద్యార్థులకు ప్రయోజనం కల్పిస్తున్నామని, ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని వదిలిపెట్టేది లేదని, సీబీఐ అదే పనిలో ఉందన్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ-2026 పరీక్షను జూన్ 21న(ఆదివారం) నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్టు >>2



## సిఎస్ సాయి ప్రసాద్ పదవి నవంబరు 30 దాకా పొడిగింపు

**విజయవాడ,మే 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం జూన్ 1నుండి నవంబరు 30 వరకు పొడిగించింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆల్ ఇండియా సర్వీసెస్(AIS) రూల్ 16(1)(DCRB)రూల్స్ 1958కు అనుగుణంగా సిఎస్ సాయిప్రసాద్ పదవీ కాలాన్ని ఆరుమాసాలకు పొడిగిస్తూ కేంద్ర డిపార్టుమెంట్‌ఆఫ్ పెర్సనల్‌అండ్ ట్రైనింగ్(డిఓపిటి) >>2

## పెట్రోలులో ఇథనాల్ మిశ్రమం పెంచండి

### కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

**విజయవాడ, మే 15, ప్రభాతవార్తప్రతినిధి:** చమురు దిగుమతులపై భారం తగ్గేలా ఇథనాల్ మిశ్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు కేంద్రంతో మాట్లాడారు. ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పురితో ముఖ్యమంత్రి శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం అమలులో ఉన్న 20శాతం ఇథనాల్ మిశ్రమాన్ని 40 శాతానికి పెంచేలా చూడాలని కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రిని కోరారు. బ్రెజిల్ లాంటిదేశాల్లో ఇథనాల్ మిశ్రమం అత్యధిక స్థాయిలో ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇథనాల్ మిశ్రమం పెరిగితే భారతదేశం పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటం తగ్గి విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని సీఎం వివరించారు. ఇప్పటికే దీనిపై కేంద్రానికి ఓలేఖ రాసినట్టు సీఎం తెలిపారు. ఇథనాల్ మిశ్రమం పెంపు నిర్ణయాన్ని వేగంగా అమలు చేయాలని సీఎం కోరారు. కేంద్రం చేపట్టే ఈ చర్యల వల్ల చమురు దిగుమతులు తగ్గి దేశ ఇంధన భద్రత పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే ఇథనాల్ మిశ్రమం వల్ల రూ.1.1లక్షల కోట్ల మేర విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యిందని వివరించారు. అలాగే 500లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గాయని స్పష్టం చేశారు. ఇథనాల్ తయారీ వల్ల చెరకు, మొక్క జొన్న రైతులకు అదనపు ఆదాయం కూడా చేకూరుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియచేశారు. ఇప్పటికే రైతులకు రూ.87,558 కోట్ల ఆదాయం వచ్చిం దని స్పష్టం చేశారు. ఏపీలో పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవుతున్న మొక్క జొన్న పంటకు కేంద్రం తీసుకునే నిర్ణయం >>2



## 500 కోట్ల డాలర్ల యుఎఇ పెట్టుబడులు

### భారత్ అభివృద్ధికి అరబ్ ఎమిరేట్స్ సాయం

### ప్రధాని మోడీ సమక్షంలో ఒప్పందాలు

### సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఎమిరేట్స్ అధ్యక్షునితో మోడీ భేటీ

**అబూదాబి, మే 15:** భారత్ అభివృద్ధి పథంలో ఎమిరేట్స్ దీర్ఘకాలిక వాణిజ్యబంధంతో కొనసాగుతోందని ప్రధానిమోడీ అన్నారు. విభిన్న రంగాల్లో ప్రధానిమోడీ సమక్షంలోనే ఎమిరేట్స్ 500 కోట్ల డాలర్ల పెట్టుబడులకు ముందుకువచ్చింది. ఎమిరేట్స్ ఎన్బీడీ మూడుబిలియన్ డాలర్లు ఆర్‌బిఎల్ బ్యాంకులో పెట్టుబడులు పెడుతోంది. అబూదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ బిలియన్ డాలర్లు భారత్‌లోని నీఫ్‌లో పెట్టుబడులకు ముందుకువచ్చింది. కీలక మౌలికవనరుల ప్రాజెక్టులపై ఈ నిధులు వ్యయంచేస్తారు. అలాగే ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ మరో బిలియన్ డాలర్లు సమ్మాన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. అలాగే భారత్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కూడా పెంపొందిందని ఇరువురునేతలు అంగీకరించారు. ఈ విభాగంలో భారత్ యుఎఇలు రక్షణరంగ పారిశ్రామిక హకారం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. డిఫెన్స్ టెక్నాలజీ, శిక్షణ, సంయుక్త కసరత్తుల్లో పరస్పర సహకారంతోపాటు సైబర్ డిఫెన్స్, మారిటైమ్ సెక్యూరిటీ విభాగాల్లో పరస్పర సహకారం ఉంటుందని ప్రకటించారు. వీటితోపాటే ఇంధనరంగం, రక్షణరంగం, టెక్నాలజీ, ఈ షిప్‌బిల్డింగ్ విభాగాలతోపాటు వాణిజ్యంలో కూడా మరింత ముందుకు వెళ్లేదిశగా సమగ్ర చర్చలు జరిగినట్లు ప్రధానిమోడీ ప్రకటించారు.




## విద్యుత్ సర్వీసులకు ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లు

### జూన్1 నుంచి అమలులోకి

**తిరుపతి,మే 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఆ సంస్థ కృషి చేస్తోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల బకాయిల ఉపశమనంతోపాటు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు సామర్థంపై ఒత్తిడిని అధిగమించేందుకు ప్రీపెయిడ్ మీటర్లను తప్పనిసరిగా అమర్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా సంస్థ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రీపెయిడ్ మీటరింగ్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిం >>2

**పొదుపు మంత్రం**



## సుప్రీం 2 రోజులు ఆన్‌లైన్

### 50% రిజిస్ట్రీ సిబ్బంది వర్క్ ఫ్రం హోం, జడ్జిల కార్‌పూలింగ్ చర్యలు

**న్యూఢిల్లీ, మే 15:** ఇంధనాన్ని ఆదా చేయడం, అనవసర ప్రయాణాలను తగ్గించడంపై కేంద్రం ఇటీవల చేసిన సిఫార్సులకు అనుగుణంగా, న్యాయమూర్తుల కోసం వర్క్ ఫ్రమ్ హోమ్ ఏర్పాట్లు, వర్చువల్ విచారణలు, కార్ పూలింగ్ వంటి పలు చర్యలను సుప్రీంకోర్టు ప్రకటించింది. కొత్త ఆదేశాలప్రకారం, సోమవారాలు, శుక్రవారాలు, ప్రత్యేకంగా ప్రకటించిన ఇతర రోజుల్లో >>2



ఢిల్లీలో సైకిల్‌పై వెళుతున్న మంత్రి తోకన్ సాహు



అమరావతిలో సైకిల్‌పై మంత్రి కొల్లు రవీంద్ర

2లో



శుక్రవారం పుట్టపర్తిలో సాయిబాబా సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న సిఎం చంద్రబాబు, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# భగ్గుమన్న పెట్రోలు, డీజిల్

>> దాలర్ల మార్కుకు పైన కొనసాగుతున్న తరుణంలో, జలైలో నెలల్లో రిటైల్ ఇంధన ధరలలో ఇది అత్యంత భారీ పెరుగుదలలో ఒకటిగా నిలిచింది. ఇంధన మార్కెట్ ఒత్తిడి నేపథ్యంలో సిఎన్జి ధరలు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్జి) ధరలు కూడా పెరిగాయి. సిఎన్జి ధరలను కిలో గ్రాముకు రూ.2 మేర పెంచాయి. పెరిగిన ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ సవరణ తర్వాత, ఢిల్లీలో సిఎన్జి ధర ఇప్పుడు కిలోగ్రాముకు రూ.79.09గా ఉంది. సిఎన్జి ధర పెరుగుదల వల్ల, తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ ఇంధనంగా గ్యాస్ ఆధారిత వాహనాలపై ఆధారపడే ప్రజా రవాణా నిర్వాహకులు, వాణిజ్య వాహన యజమానులు, రోజువారీ ప్రయాణికులపై ప్రభావం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు ముడి చమురును గణనీయంగా అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఆ భారాన్ని పూర్తిగా వినియోగదారులపై మోపలేకపోతున్నాయని, ఫలితంగా ఆర్థిక నష్టాలు పెరిగిపోతున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ వివరించారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం గతంలో ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం వల్ల, నెలకు దాదాపు రూ.14 వేల కోట్ల ఆదాయ నష్టం వాటిల్లినట్లు శర్మ పేర్కొన్నారు.

**నిత్యావసరాల ధరలకు రెక్కలు?**

పెట్రోల్, డీజిల్‌ధరలు పెరిగిన నేపథ్యంలో ఆ ప్రభావం రవాణా రంగంపై పెనుప్రభావం పడనుంది. తద్వారా నిత్యావసర ధరలు అమాంతం పెరిగే అవకాశముందని పరిశీలకులు అంచనా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయిలో నమోదవుతుండటం, ఇదే తరుణంలో చమురు ధరలు పెంపుతో దేశీయంగా సామాన్యుల జేబులకు చిల్లుపడే అవకాశం ఎక్కువగా ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సుప్రీం 2 రోజులు ఆన్‌లైన్

>> కొత్తగా విచారణకు వచ్చే కేసుల విచారణలు పూర్తిగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారానే జరుగుతాయి. సుప్రీంకోర్టు వేసవి విరామ సమయంలో వెకేషన్ బెంచ్ ముందు జరిగే అన్ని విచారణలు కూడా వర్చువల్‌గా జరుగుతాయని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ భరత్ పరాశర్ పేర్కొన్నారు. "న్యాయస్థానానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, వీడియో కాన్ఫరెన్సింగ్ కోసం లింక్‌లను సకాలంలో పంపడం, స్థిరమైన వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యాలను నిర్వహించడం, సకాలంలో సాంకేతిక సహాయం అందించడం వంటివి రిజిస్ట్రీ నిర్ధారించుకోవాలి" అని ఆ మెమోలో ఉంది. "ఇంధనాన్ని గరిష్ఠంగా వినియోగించుకునేలా చూసేందుకు" తమ న్యాయమూర్తుల తరఫున తాము కార్‌పూలింగ్ ఏర్పాట్లను ప్రోత్సహించాలని "ఏకగ్రీవంగా తీర్మానించారని" సుప్రీంకోర్టు తెలిపింది. మరో ముఖ్యమైన చర్యగా, రిజిస్ట్రీలోని ప్రతి శాఖ లేదా విభాగంలో 50 శాతం వరకు సిబ్బందిని వారానికి రెండు రోజుల వరకు ఇంటి నుండి పని చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. కోర్టు పరిపాలన నిరంతరాయంగా సాగేలా చూసేందుకు మిగిలిన సిబ్బంది కార్యాలయంలోనే భౌతికంగా హాజరు కావాల్సి ఉంటుందని సర్క్యులర్ స్పష్టం చేసింది. "సంబంధిత రిజిస్ట్రార్ వారం ప్రారంభానికి ముందే వారపు రోస్టర్‌ను సిద్ధం చేయాలి" అని సర్క్యులర్ పేర్కొంది. ఇంటి నుండి పని చేయడానికి అనుమతించబడిన అధికారులు టెలిఫోన్‌లో అందుబాటులో ఉండాలని, అవసరమైనప్పుడు కార్యాలయానికి హాజరయ్యేందుకు సిద్ధంగా ఉండాలని కూడా అది ఆదేశించింది. పని స్వభావం కారణంగా భౌతిక హాజరు అవసరమైన శాఖలలో రోస్టర్ ప్రభావవంతంగా లేదని తేలిన చోట, ఇంటి నుండి పని చేసే (డబ్ల్యుఎఫ్‌హెచ్) ఏర్పాటును పరిమితం చేయడానికి లేదా సవరించడానికి సంబంధిత రిజిస్ట్రార్లకు ఈ సర్క్యులర్ అధికారం కల్పించింది. పశ్చిమ ఆసియాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా తలెత్తిన ఆర్థిక ఒత్తిళ్ల దృష్ట్యా, ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని, అనవసర ఖర్చులను నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పౌరులకు, సంస్థలకు విజ్ఞప్తి చేసిన కొద్ది రోజులకే ఈ చర్యలు వెలువడ్డాయి. ఇప్పటికే ఢిల్లీ ప్రభుత్వంతో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు, వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యుఎఫ్‌హెచ్) ఏర్పాట్లు, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, అధికారిక ప్రయాణాలపై ఆంక్షలు వంటి ఇంధన పొదుపు చర్యలను ప్రకటించాయి.

# నల్లని మబ్బులు బారులు.. బారులు

>> రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. గతేడాది రుతుపవనాలు మే 24న కేరళలోకి ప్రవేశించినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. రానున్న 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా తెలిపింది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొంది. ఈ యేడాది రుతుపవనాలు ముందుగానే పలకరించినా.. దేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడటమే ఇందుకు కారణం కావొచ్చని అభిప్రాయపడింది. ఈ యేడాది జూన్ సెప్టెంబర్‌లో నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలిపింది. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఫలితంగా దేశంలోని వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పింది. రుతుపవన కాలంలో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971-2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది.

# ఇంధన పొదుపులో భాగంగానే నో వెహికిల్ డే..

## ప్రధాని, ముఖ్యమంత్రి సూచనల మేరకు సైకిల్‌పై పార్టీ కార్యాలయానికి చేరుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, మే 15. ప్రభాతవార్తప్రతినిధి:** మన దేశం కోసం, మన ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఏర్పడిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నో వెహికిల్ డే కార్యక్రమంలో భాగంగా ఇంటి నుండి మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి సైకిల్‌పై చేరుకున్నారు. అనంతరం ఎలక్ట్రిక్ సైకిల్‌పై ఆర్ అండ్ బీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ "ఇరాన్, అమెరికా యుద్ధం కారణంగా ప్రపంచంలో పెద్ద ఎత్తున ఆయిల్ కొరత నెలకొంది. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు హైదరాబాద్ పర్యటనలో ప్రతి ఒక్కరూ ఖర్చులు తగ్గించుకోవాలని, పెట్రోల్, డీజిల్, వంటనూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అదే సమయంలో బంగారం కొనుగోలు, విదేశీ పర్యటనలను కూడా వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి సూచనల మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కాన్వాయ్ తగ్గించుకున్నారు. దేశ సౌభాగ్యం కోసం పొదుపు అవసరమని సూచించారు. అవసరమైన మేరకు మాత్రమే వాహనాలు వాడాలని, ప్రత్యామ్నాయంగా సైకిల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని సూచించారు. ప్రతి శుక్రవారం నో వెహికిల్ డే పాటించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఆ మనిర్ణయం మేరకు ఈ రోజు ఇంటి నుండి సైకిల్‌పై పార్టీ కార్యాలయానికి చేరుకున్నామన్నారు. వంట నూనెలను కూడా పొదుపుగా వాడుకోవాలి. సోలార్ వినియోగం పెంచాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుండి చెబుతూనే ఉన్నామని. సోలార్ వినియోగం ద్వారా ఇంధనం ఖర్చు భారీగా తగ్గనుందని అన్నారు.

# జూన్21న నీట్ రీఎగ్జామ్

>> తెలిపింది. దేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే3న నిర్వహించిన నీట్‌యూజీ పరీక్షను దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. నీట్ ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షలమంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రీఎగ్జామినేషన్‌కు అభ్యర్థులు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరంగానీ లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐదర్యాప్తు కొనసాగుతోంది, ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడిన విషయం తెలిసిందే. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు, అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది.

# భక్తికి, భద్రతకు కేంద్రం పుట్టపర్తి

>> వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్షశక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికే అండగా నిలుస్తుందన్నారు. కరవుసీమై న రాయలసీమను డ్రాట్‌జోన్ నుండి గ్రోత్ జోన్ గా మారుస్తామన్నారు. లక్ష కోట్ల రూపాయలతో సీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నామన్నారు. కడప స్టీల్ ప్లాంటును జూన్‌లో ప్రారంభించి 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుందనీ, కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్ గా మారుతుందన్నారు. తిరుపతిలో రాయల్ ఎన్ ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరికోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కియా పరిశ్రమ 18 లక్షల కార్లు తయారు చేస్తోందని. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయన్నారు. గతంలో గోల్డ్ అంటే కర్ణాటక లోని కే జి ఎఫ్ ఉండేదని, ఇప్పుడు గోల్డ్ అంటే బంగారు ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందన్నారు. కర్నూలులోనీ జేజీఎఫ్ (జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్) ద్వారా ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుందనీ, రెండో ఏడాది 1500 కిలోల బంగారం తయారవుతుందన్నారు. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం, వేగంగా అనుమతులిస్తామన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందనీ, ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారకనిల్వలు తరిగి పోతున్నాయన్నారు. ప్రధాని ప్రతిపాదించిన వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి 7అంశాలను మనం కూడా ఆచరిద్దామన్నారు. ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయనీ, మనం కూడా బాధ్యతతో పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ సంఖ్యను తగ్గించామన్నారు. ప్రతీ భారతీయుడు సవాళ్లను అధిగమించేలా చర్యలు తీసుకోవాలనీ, ప్రతీ సవాలును మనం ఓ అవకాశంగా మలచుకుందామన్నారు.

# స్వదేశీ యుద్ధ విమానాలు కీలకం

>> విభిన్న పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దేశభద్రత విషయంలో ఇతర దేశాలపై ఆధారపడలేమనీ అందుకే ఆత్మనిర్భరత అనేది ఓ కీలకమైన అంశంగా మారిందన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో టెక్నాలజీ, అభివృద్ధి గురించి ఆలోచించే దార్శనిక నేత చంద్రబాబు నాయుడు అని, ఇలాంటి నేతను ఎక్కడా చూడలేదని కొనియాడారు. క్వాంటం సహా ఆధునిక టెక్నాలజీలను ఏపీకి తీసుకువచ్చారనీ, గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలు ఏపీని ఎంచుకున్నాయన్నారు. ఏపీ అంటే అడ్వాన్స్డ్ ప్రదేశ్ అనీ, దేశానికి ఓ రోల్ మోడల్ గా ఏపీ మారిందన్నారు. వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టులో నాలుగు డిఫెన్సు కంపెనీలకు కూడా శంకుస్థాపన జరిగాయనీ కర్నూలు డ్రోన్ సిటీలో 8 కంపెనీలకు కూడా శంకుస్థాపన చేశామన్నారు. డిఆర్డిఓ ఇప్పుడు 5వ తరం స్టెల్త్ యుద్ధ విమానం తయారు చేసేందుకు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్‌ను తయారు చేస్తోందన్నారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్‌తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని, గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయన్నారు. బీడీఎల్ తయారు చేసిన టార్పెడో, హెచ్ఎఫ్ సీఎల్ నుంచి తయారయ్యే ఎలక్ట్రిక్ ఫ్యూజ్ కూడా ఈ నేల నుంచే పరీక్షిస్తామన్నారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. రూ.1500 కోట్ల పెట్టుబడితో భవిష్యత్ లో యుద్ధానికి అవసరమైన ఆధునిక వ్యవస్థలు తయారు అవుతాయన్నారు. హెచ్ఎఫ్ఎసీఎల్ రూ.1294 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ ఫ్యూజ్‌లు తయారు చేస్తుందనీ, 8 డ్రోన్ కంపెనీలు ఓ డ్రోన్ సిటీని ఏర్పాటు చేస్తున్నాయన్నారు. సూరత్ డైమండ్ సిటీగా, బెంగుళూరు భారత సిలికాన్ వ్యాలీగా పేరు పొందాయి. ఇక కర్నూలు కూడా ప్రపంచ డ్రోన్ హబ్ గా ప్రసిద్ధి చెందుతుందన్నారు. గతంలో భారత్ అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా కేవలం రూ.46 వేల కోట్ల విలువైన ఆయుధాలు మాత్రమే తయారయ్యేవనీ, ఇవాళ రూ. 1.54 లక్షల కోట్ల ఆయుధ ఉత్పత్తి జరుగుతుండగా, మరికొన్ని రోజుల్లో ఇది రూ.1.75 లక్షల కోట్ల ఉత్పత్తికి చేరుతామన్నారు. ఆయుధ ఎగుమతులు కూడా కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఉండేది. ఇవాళ రూ.40వేల కోట్ల ఎగుమతులు చేయగలుగుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన సీఎం చంద్రబాబు ఆయన బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, బి జె పి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, టీజీ.భరత్, ఎస్.సవితమ్మ,సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం, అనంతపురం ఎంపీలు బికే.పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్.రాజు, కందికుంట వెంకట ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, ఎం ఎల్ సి రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎం ఎల్ సి గుండుమల తిప్పేస్వామి, బి జె పి నేత విష్ణువర్ధన్ రెడ్డి, సామకోటి ఆది, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జె సి మౌర్య భరద్వాజ్, ఏ ఎస్ అంకిత, అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

# ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు

>> చుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లును ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుంది. అంతేకాకుండా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది. ఈ యేడాది జూన్ 1వతేదీ నుంచి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను అమలులోకి తీసుకువచ్చేందుకు సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంటోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు/ మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితరసర్వీసులకు సంబంధించి నెల్లూరు జిల్లాలో 17,067, తిరుపతి 19,545, చిత్తూరు 14,622, అన్నమయ్య 14,346, కడప 16,261,అనంతపురం 8,422, శ్రీ సత్యసాయి 7,002,కర్నూలు 10,603, నంద్యాల జిల్లాలో 9,945, సర్వీసులు ఈ ప్రీపెయిడ్ విధానంలోకి మారుతున్నాయి. ఈ మొత్తం 1.17 లక్షల సర్వీసుల్లో సింగిల్ ఫేజ్ సర్వీసులు 91,306, త్రీఫేజ్ సర్వీసులు 26,507 వున్నాయి. ఈ సర్వీసులన్నింటినీ కొన్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి,ఈవాలెట్ ద్వారా రీచార్జ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించడం జరుగుతోంది. ఆయా విభాగాలు బిల్లింగ్ సైకిల్ కు సంబంధించిన విద్యుత్ చార్జీలు, స్థిర చార్జీల అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుంది. ప్రతినెలా 5వతేదీలోగా ఆయా సంస్థలు చెల్లించాల్సిన అడ్వాన్స్ మొత్తం వివరాలను విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్థిక శాఖకుతెలియజేయాల్సి వుంటుంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపిఇఆర్సి) ఆమోదించిన యూనిట్ ధరల ప్రకారం ప్రీపెయిడ్ విధానం ద్వారా రోజువారీ విద్యుత్ వినియోగ చార్జీలను బ్యాలెన్స్ నుంచి మినహాయించడం, ఆ బ్యాలెన్స్ నిర్దిష్ట కనిష్ట పరిమితి దిగువకు చేరిన వెంటనే సంబంధిత అధికారులకు ఈమెయిల్/ఎస్ఎంఎస్ రూపంలో సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుంది. బ్యాలెన్స్ సున్నాకు చేరినపుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

# రక్షణ రంగానికి కేంద్రం బాబా జన్మభూమి: మంత్రి లోకేష్

**పుట్టపర్తి, మే 15, ప్రభాతవార్త:** దేశ రక్షణ రంగానికి నయా కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లా మారబోతుందని రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.శుక్రవారం ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజన్సీ ఏడీఏ ఆధ్వర్యంలో ఏఎంసీఏ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ కు ఏడాది పూర్తి అయ్యిందనీ, శత్రువుకు భారత రక్షణ దళాల శక్తి ఏమిటో ప్రధాని చూపించారన్నారు. దేశానికి గర్వపడే ప్రధాని మోడీ, ఐరన్ మ్యాన్‌గా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారనీ కొనియాడారు. కూటమికి మద్దతు ఇచ్చిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికే ఈప్రాజెక్టు తీసుకువచ్చామన్నారు. కరవు నేలపై మొన్నటి వరకు కియాకార్లు రాగా, నేడు ఫైటర్ జెట్ రక్షణ ప్రాజెక్టులు వచ్చాయన్నారు. ఏ ఎం సి ఏ ప్రాజెక్ట్ తో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలువస్తున్నాయనీ, బాబా స్ఫూర్తితో పుట్టపర్తికి కూటమి ప్రభుత్వం డిఫెన్సు ప్రాజెక్టు తెచ్చిందన్నారు. ఏపీని ఇన్వెస్ట్మెంట్ డెస్టినీగా మార్చామని,డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ ఏపీలో ఉందనీ, నమో అంటే నాయుడు జీ, మోడీజీ జోడీ అన్నారు. మోడీజి, చంద్రబాబుజి, రాజ్‌నాథ్ సింగ్ జీ 75 ఏళ్ల కుర్రవాళ్లు అని, వారి స్పీడ్ ఇప్పటికీ ఎవరూ అందుకోలేరనీ వ్యాఖ్యానించారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి లక్షల కోట్ల ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయనీ, జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్సు వచ్చిందనీ, త్వరలో కర్నూలులోనూ హైకోర్టు బెంచ్ ఏర్పాటు కాబోతోందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌విధానంలో అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టును సాకారం చేసామన్నారు. ఏఎంసిఏ కథ 2025 డిసెంబరులో ఢిల్లీలో మొదలైందనీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి ఈ ప్రాజెక్టు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.ఇది కేవలం డిఫెన్సు ప్రాజెక్టు మాత్రమే కాదు రాయలసీమకు కొత్త దిశను కల్పించే అత్యుత్తమ ప్రాజెక్టు గా పేర్కొన్నారు. ఇంత మంచి పెద్ద ప్రాజెక్టును ఏపీకి ఇచ్చినందుకు ప్రధాని మోదీకి, రక్షణ మంత్రికి రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదాలు తెలియజేశారు.



శుక్రవారం పుట్టపర్తిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

# అత్యాధునిక కేన్సర్ కేర్‌సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

**పుట్టపర్తి రూరల్ మే 15 ప్రభాతవార్త:** డయాలసిస్ సేవలు గ్రామీణ పేదలకు ఉచితంగా అందించడం ఆదర్శమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని శ్రీ సత్య సాయి ప్యాలీయేటివ్ కేర్ అండ్ క్యాన్సర్ సెంటర్లో సుమారు 7.4 కోట్లతో బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక డయాలసిస్ సెంటర్ ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఖరీదైన వైద్యం వారం కాకుండా సేవా భావంతో ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్య సేవలో అందరికీ చేరేలా ప్రభుత్వం మరియు సేవా సంస్థలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, హాస్పటల్ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.



శుక్రవారం సత్యసాయిబాబా సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచిన మంత్రి లోకేష్

# సత్యసాయిబాబా సమాధిని సందర్శించిన మంత్రి లోకేష్

**అనంతపురం, మే 15,ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రెండో రోజు పర్యటన కొనసాగింది. శుక్రవారం రోజు ఉదయం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లో భగవాన్ సత్యసాయిబాబా సమాధిని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో మంత్రి లోకేష్‌కు సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వాగతంపలికి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.మంత్రి నారా లోకేష్‌ని పట్టు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి స్టేట్ మీడియా కోఆర్డినేట్ మరియు రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సుస్వాగతం పలికిన బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి



**పుట్టపర్తి రూరల్ మే 15 ప్రభాతవార్త:** రాయలసీమలో ఏ ఎం సి ఏ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. భారత్ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించే ప్రయాణంలో ఒక మైలురాయిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని భవిష్యత్తు వైమానిక ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఉండటం గర్వకారణం అని ఆయన మంత్రతో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకోవడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి మోడీ గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పొడిగింపు

>> మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరి రాజేశ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్)ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలియ జేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న సాయి ప్రసాద్ వాస్తవానికి ఈనెలాఖరున పదవీ విరమణ చేయాల్సి ఉండగా ఆయన సేవలను మరికొంత కాలం వినియోగించుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సిఎస్ పదవీ కాలాన్ని పొడిగించాల్సిందిగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా ఆమేరకు కేంద్ర ప్రభుత్వం సాయి ప్రసాద్ పదవీ కాలాన్ని ఆరు మాసాలు అనగా జూన్ 1 నుండి నవంబరు 30వ తేదీ వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు

>> మహానాడుకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయనున్నారు. అంతేకాకుండా తీర్మానాలు సహా ఇతర అన్ని అంశాల్లోను మహానాడు కార్యక్రమంలో ఏ విధానాలనైతే పాటిస్తారో వాటినే హైబ్రిడ్ మోడల్ లోనూ మహానాడు నిర్వహణకు నిర్ణయించారు.పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ సంక్షోభ పరిస్థితుల ప్రభావం దేశవ్యాప్తంగా కనిపిస్తున్న వేళ, ప్రధాని ఇచ్చిన పొదుపు పిలుపు నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణపై పార్టీ అంతర్గతంగా ఈరోజు ఉదయం మంత్రి లోకేశ్ అధ్యక్షతన కీలక చర్చ జరిగింది.ఈ క్రమంలో మహానాడును హైబ్రీడ్ పద్దతిలో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించినట్లు సమాచారం.

# పెట్రోలులో ఇథనాల్ మిశ్రమం పెంచండి

>> వల్ల మేలు జరుగుతుందని అన్నారు. మొక్క జొన్న ఇథనాల్ ఉత్పత్తిలో ముఖ్యమైన ముడి వనరు కావటంతో డిమాండ్ కూడా గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు.

# 1700కోట్ల నకిలీ బిల్లుల స్కాం నిందితుడు అరెస్టు

**విశాఖపట్నం, మే 15 ప్రభాతవార్త:** బిల్లులతో భారీ జీఎస్టీ మోసం చేసిన వ్యక్తులను విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. పలు రాష్ట్రాలకు విస్తరించిన నకిలీ ఇన్‌వాయిస్‌ల సిండికేట్ ద్వారాసుమారు రూ.1700 కోట్ల మేర బోగస్ లావాదేవీలు జరిగినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆదిరెడ్డి అలియాస్ అంజిరెడ్డిని అధికారులు అరెస్టు చేశారు. కొంతకాలంగా పరారీలో ఉన్న అతని కదలికలను నిఘా ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.దర్యాప్తులో భాగంగా అంజిరెడ్డి సుమారు 92నకిలీ కంపెనీలను సృష్టించి,వాటి ద్వారా మోసపూరిత జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు అధికారులు వెల్లడించారు. అమాయకుల ఆధార్,పాన్ కార్డులను ఉపయోగించి బోగస్ సంస్థలను నమోదు చేసినట్లు గుర్తించారు.అంతేకాకుండా నకిలీ అద్దె ఒప్పందాలు, మార్పులు చేసిన మొబైల్ నంబర్లు,ఈమెయిల్ ఐడీలతో కంపెనీలను నిర్వహిస్తూ భారీ మోసానికి పాల్పడినట్లు తేలింది. ఈ స్కామ్‌కు సంబంధించి పలు రాష్ట్రాల్లో మరిన్ని లావాదేవీలు,అనుబంధ నిందితులపై విచారణ కొనసాగుతోందని జీఎస్టీ నిఘా విభాగం వెల్లడించింది.

## వారం - వర్జ్యం

16-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
అమావాస్య రా. 1.29
భరణి సా. 5.28
వర్జ్యం : తె.4.00-తె.5.24
దు.తె.5.36-ఉ.7.16
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** వ్యాపారాలు లాభాలు దిశగా సాగుతాయి. ఉద్యోగులకు బదిలీల సూచన. స్పెక్యులేషన్ లాభిస్తుంది. వస్త్రలాభం.

**వృషభం:** సినీ, కళా సాహిత్యరంగంలోని వారు తాత్కాలిక వ్యాపారాలు చేసే వారు జాగ్రత్తగా మెలగవలసి వస్తుంది.

**మిథునం:** మీ ఆలోచనలకు ఆకృతి కల్పించటానికి నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. చాకచక్యంగా వ్యవహరించి వ్యవహారాలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**సింహం:** ఆహ్లాద భరితమైన వాతావరణంలో కాలాన్ని గడుపుతారు. ఆదాయ, వ్యయాలు సరి సమానంగా ఉంటాయి. వాహన సౌఖ్యం.

**కన్య :** మీపై వచ్చిన కొన్ని అపనిందలను రూపుమాపుకో గలుగుతారు. ఆలోచనలలో స్థిరత్వం ఏర్పడుతుంది. వస్త్రలాభం.

**తుల :** స్పెక్యులేషన్ వైపుకు మొగ్గు చూపేకన్నా స్థిరాస్తుల కొనుగోళ్ళపైన పెట్టుబడిని మదుపుచేయుట మంచిది.

**వృశ్చికం:** ఉద్యోగంపరంగా బాధ్యతలు పెరుగుతాయి. బ్యాంకింగ్ రంగంలోని వారికి ఫైనాన్స్ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంది.

**ధనుస్సు:** మీ పరపతి పెంపొందుతుంది. నరదృష్టి అధికంగా ఉంటుంది. మిత్ర బృందాలలోనికి కొత్త వారిని చేరుస్తారు.

**మకరం :** వెన్ను నొప్పి బాధిస్తుంది. ఈ రోజు సానుకూల ఫలితాలు ఎక్కువగా అందుకోగలరు. ఋణాలు తీరుతాయి.

**కుంభం:** గతంలో ఆగిపోయిన వ్యవహారాలను తిరిగి ప్రారంభించడానికి చేసే యత్నాలు ఫలితాలు. వస్త్రాలను కొనుగోలు చేస్తారు.

**మీనం:** అలంకరణకు ప్రాముఖ్యత నిస్తారు. దూరప్రాంత ప్రయాణాలు సానుకూల పడతాయి. రాజకీయ పరిచయాలు ఉపకరిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

16-5Pg3exHMNWJQER.qxd:16-5Pg3exHMNWJQER.qxd 1/1/02 7:11 AM Page 1



## తిరుమల సమాచారం



### ఏపికి మంచి రోజులు వచ్చాయి

● అభివృద్ధి దిశగా ముందుకు: మంత్రి పార్థసారధి

**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, అనేక పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నారని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఈ రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చిన మంత్రి పార్థసారథి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తన మనవరాలికి తలనీలాలు సమర్పించిన అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి రూ.300లు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ ద్వారా సామాన్య భక్తుడిలా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం బహుకరించారు.



### టిటిడికి ఇన్నోవా కారు విరాళం

**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి దాతలు తమవంతుగా భక్తివిశ్వాసాలతో విరాళాలందిస్తున్నారు. శుక్రవారం తమిళనాడు చెన్నైకు చెందిన పోసన ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండి మగేష్ సుందర్ రూ.40 లక్షలు విలువైన ఇన్నోవా హైక్రాస్ వి.జెడ్ మోడల్ కారును విరాళంగా అందించారు. దాత శ్రీవారి ఆలయం ముందు కారుకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనం తాళాలను, రికార్డులను ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు అందజేశారు. టిటిడి డిఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

### బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.10 లక్షలు



**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు భారీగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా కావలికి చెందిన తిరుమలశెట్టి భవిష్ కృష్ణ టిటిడి బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10,00,116 లక్షలు విరాళమిచ్చారు. దాత టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడి అందజేశారు.

### 18న గోవిందరాజస్వామివారి ఆలయంలో

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 23 నుండి 31వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభను మరింత పెంపొందించే ఈ విశిష్ట కార్యక్రమం వైష్ణవ సంప్రదాయంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.



### గోమాతల పరిరక్షణలో దాతల సహకారం ప్రశంసనీయం: టిటిడి జెఇఒ డాక్టర్ శరత్

**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఎస్వీ గోశాలకు భక్తులు, దాతలు విరాళంగా అందించిన 180 లారీల ఎండుగడ్డిని అకాల వర్షాల నుండి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. గోమాతల సేవలో భాగంగా ఎండుగడ్డి దానాన్ని అందించిన టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, నెహ్రూ ఫౌండేషన్ ,శ్రీనివాస సేవా ట్రస్ట్ ఛైర్మన్ టి. సత్యనారాయణలను జెఇఒ ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం అధికారులతో కలిసి ఎస్వీ గోశాలను పరిశీలించిన ఆయన గోవుల సంరక్షణ, ఎండుగడ్డి నిల్వలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. గోవులకు ఎటువంటి ఆహార కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"లో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డాక్టర్ శరత్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీఎన్ శివకుమార్, డిఇ దామోదర్, మేనేజర్లు మృదుల, గౌరీ, అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరిన సిఎం చంద్రబాబు హామీ

● కిడ్నీ బాధిత కుటుంబానికి నాలుగు నెలల్లో త్రిబుల్ బెడ్ రూమ్ ఇల్లు

● రూ.12.50 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి ● ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామన్న కుటుంబం



**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), మే 15 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కిడ్నీ బాధిత కుటుంబానికి నాలుగు నెలలో త్రిబుల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తి చేసి ఇచ్చింది కూటమి ప్రభుత్వం. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో గత ఏడాది అక్టోబర్ 1 ఎన్టీఆర్ సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమం నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి చెప్పిన వివరాలతో గ్రామంలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న పొట్నూరు అప్పలరాజు ఇంటికి వెళ్లిన చంద్రబాబు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అప్పలరాజు కుటుంబ పరిస్థితిపై ఆరా తీసిన ముఖ్యమంత్రికి గత టిడిపి ప్రభుత్వంలో చేసిన సాయంతోనే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఇందుకోసం తనకున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమి కూడా అమ్మడంతో పాటు మరికొంత అప్పులు కూడా చేశానని తన తల్లి రమణమ్మ కిడ్నీ డొనేట్ చేయడంతో ఆమె కూడా పేషెంట్‌గానే ఉన్నారని చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తనకి ఉండడానికి సొంతిల్లు లేదని బాధితులు అప్పలరాజు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. అప్పలరాజు పరిస్థితి చూసి చలించిన ముఖ్యమంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని పిలిపించి మూడు నెలల వ్యవధిలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. ఇద్దరు ఆడపిల్లలకు రెండు గదులు తల్లికి మరొక గదితో మొత్తంగా ట్రిపుల్ బెడ్ రూమ్ ఇంటిని నిర్మించి ఇవ్వాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అప్పలరాజుకు 120 రోజుల్లోనే మూడు సెంట్లు స్థలం కూడా ప్రభుత్వమే సమకూర్చి 12.50 లక్షలతో ట్రిపుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇచ్చింది శుక్రవారం రాష్ట్ర సూక్ష్మ జన్మదిన ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అప్పలరాజు ప్రభుత్వం నిర్మించిన ట్రిపుల్ బెడ్ రూమ్ ఇంటిని ప్రారంభించారు. ముఖ్యమంత్రి మాటిచ్చి నాలుగు నెలలోనే త్రిబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వడం మంత్రి కొండపల్లి ప్రత్యేకంగా చర్య తీసుకోవడంతో పాటు స్వయంగా తమ గృహప్రవేశానికి రావడం తమకు జీవితాంతం భరోసా లభించినట్లయితే కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామని కుటుంబసభ్యులు తెలిపారు.

### మేము సైతం... అనంత టిడిపి నేతలు సైకిల్‌పై కార్యక్రమాలకు హాజరు



**అనంతపురము, మే 15 ప్రభాతవార్త బ్యూరో:** పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించి ఇంధన పొదుపు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్ కాన్వాయ్ వాహనాలను సంఖ్యను తగ్గించుకొని పొదుపు మంత్రం పాటించేందుకు శ్రీకారం చుట్టారు. వారిని ఆదర్శంగా తీసుకున్న అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి శుక్రవారం సైకిల్ పై ప్రభుత్వ ఆసుపత్రి వరకు వెళ్లి సూపరింటెండెంట్‌తో ఆసుపత్రిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల మురళి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సాకే వీరాంజనేయులు, మైనార్టీ నాయకులు నౌసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరులో రోడ్ల విస్తరణ

● మాస్టర్‌ప్లాన్‌తో భక్తుల సౌకర్యార్థం టిటిడి ప్రణాళికలు



**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల ఆలయం పరిసరాల తరహాలో సిరులతల్లి పద్మావతిఅమ్మవారు కొలువైన తిరుచానూరులో కూడా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మాస్టర్‌ప్లాన్ అమలుచేసి రోడ్లు విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు టిటిడి అధికారులు ముందుకురాగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందించనుంది. తిరుచానూరు రోడ్డు విస్తరణ, పార్కింగ్‌కు సంబంధించిన పనులపై శుక్రవారం సాయంత్రం టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివి ఎస్ఒ కెవి మురళీకృష్ణతో కలిసి తుడా, టిటిడి తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సమీక్షించారు. తిరుచానూరులో ప్రధానంగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు, సాధారణ రోజుల్లో కూడా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఎక్కువగానే భక్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు ఆలయ పరిసరాలలో రద్దీని తగ్గించేందుకు భక్తులకు మెరుగైన దర్శన అనుభూతి కలిగించేలా రోడ్డు నిర్మాణం, పార్కింగ్ పనులను చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. టిటిడి జెఇఒ, తుడా సిపిఒ రోడ్డు నిర్మాణం, పార్కింగ్‌కు సంబంధించి సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ప్లాన్ గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అదనపు ఎస్పీ రవి మనోహరచారి, తిరుపతి ఆర్‌డిఒ రామ్మోహన్, ఎడి సర్వేయర్ అరుణ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాం సుందర్, రోడ్లుభవనాల శాఖ ఎస్ఇ సుధాకర్ నాయక్, తుడా ఎస్ఇ రవీంద్ర, తుడా సిపిఒ దేవి, టిటిడి ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




### భూమన సైకిల్‌పై సవారీ

**తిరుపతి, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలు పొదుపు పాటించాలని, వాహనాల వినియోగమేగాక విద్యుత్ ఆదా చేయాలని ప్రధాని మోడీ పిలుపుతో తిరుపతిలో టిటిడి మాజీ ఛైర్మన్ వైసిపి ఉభయజిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి వినూత్నంగా కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం ఆయన వాహనాలను వదలి, మంది మార్బలాన్ని పక్కనపెట్టి స్వయంగా తిరుపతిలో సైకిల్ తొక్కుతూ ప్రజలకు పొదుపు గురించి వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ భారం తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని, యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన పరిణామాలు, ఆర్థిక విపత్తు ఎదుర్కొనేందుకు ఇంధనం, విద్యుత్ పొదుపు పాటించాలని కోరారు. ప్రధాని మోడీని ఆదర్శంగా తీసుకోవాలని పది కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం తిరుపతిలో వైసిపి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా తిరుపతివాసుల్లో ఒక ప్రత్యేక చర్చ మొదలైంది.

### వాహనానికి కర్ర కట్టి మోసుకెళ్తూ... సైకిల్ తొక్కుతూ

## పెట్రోల్ ధరల పెంపుపై వినూత్న నిరసన



**తిరుపతి, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్రంపెంచిన పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఎం తిరుపతి నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. సిపిఎం కార్యాలయం నుండి సుందరయ్యనగర్ కూడలి వరకు వినూత్న నిరసన ప్రదర్శన చేపట్టారు. పెరుగుతున్న ఇంధన ధరలతో ఇక వాహానానికి పెట్రోలు కొనలేని పరిస్థితి వచ్చిందని, సామాన్యుడు బండి నడపడం భారంగా మారిందని తెలియజేస్తూ వాహానానికి కర్ర కట్టి మోసుకెళ్తూ, మరోవైపు సైకిల్ తొక్కుతూ నిరసన తెలిపారు. "పెట్రోలు కొనలేం.. బండి నడపలేం", "ఇక మాకు సైకిలే దిక్కు", "ధరలు తగ్గించాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా ప్రజలపై భారాలు పెంచుతోందని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. ప్రజల పరిస్థితిని కేంద్రం గుర్తించి వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు నియంత్రణలోకి రావాలంటే వాటిని వెంటనే జీఎస్టీ పరిధిలోకి తీసుకు రావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి కే.వేణుగోపాల్, ఎస్.జై చంద్ర, ఆర్.లక్ష్మీ, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఆర్.మల్లి కార్జునరావు, రామకృష్ణ, శ్రీనివాసులు, మోహన్ రావు, కేశవులు, సుజాతమ్మ పాల్గొన్నారు.

### విజయవాడలో సిపిఎం ఆందోళన

**విజయవాడ, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను రద్దు చేయాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గేంత వరకు దేశమంతా సిపిఎం పోరాటం కొనసాగిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్ అన్నారు. శుక్రవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న పెట్రోల్ బంకు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పెట్రోల్ బంకు వద్ద పెద్దఎత్తున ప్రజలతో కలిసి నినాదాలతో నిరసన తెలుపుతూ రిక్షా బండికి మోటార్ సైకిల్‌ను కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీ నాథ్ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతాయన్నారు. రైతాంగం దెబ్బతింటుందని, రవాణా రంగం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 12 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వానికే రూ.30 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, ఆ డబ్బు ఖర్చు చేయాలని కోరారు. ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బు ఖర్చు చేయకుండా ప్రజలపై భారం ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా నాయకులు ఎన్.సి.హెచ్ శ్రీనివాస్, కోట కళ్యాణ్, సుప్రజ, కమల నగర కార్యదర్శులు సత్యబాబు, బి.రమణారావు, పి.కృష్ణ, నేతలు కే.దుర్గారావు, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీకి 18 నుంచి ఐదు రోజులు సరకు రవాణా నిలిపివేత

**విజయవాడ, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీతోపాటు దేశ రాజధాని ప్రాంతానికి ఈ నెల 18 నుంచి ఐదు రోజులు సరకు రవాణా నిలిపివేయాలని లారీ నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఢిల్లీలో ట్రక్ చక్కా జామ్ (బంద్) పేరిట ఈ నెల 21 నుంచి మూడు రోజులు లారీ యజమానులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారికి మన రాష్ట్రం నుంచి లారీ యజమానులు మద్దతుగా నిలవాలని లారీ యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెప్పారు. నుంచి ఐదు రోజులపాటు ఏపీ నుంచి ఢిల్లీకు లారీలను నడవద్దని ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం ద్వారా లారీ నిర్వాహకులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే ఈరోజు నుంచి పెట్రోల్, డీజిల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం పెంచింది, ఇది చాలా అన్యాయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై మరోసారి ఆలోచించి పెంచిన రేట్లను తగ్గించాలని కోరుతున్నామన్నారు.

### రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో

## ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రం



**విజయవాడ, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుండటం అద్భుతమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్, పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది" అంటూ ఎక్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

### జవాబుదారీతనం పెంచేందుకే

## ప్రిపెయిడ్ మీటర్లు: సిఎండి



**తిరుపతి, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని 9 జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం పట్ల జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీలు/ కార్పొరేషన్లు, వాటర్ వర్క్స్ తదితర ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల నుండి రూ.9,507 కోట్ల బకాయిలను ఎస్‌పిడిసిఎల్‌కు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బకాయిల చెల్లింపు, భవిష్యత్తులో విద్యుత్తు వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం, విద్యుత్ బిల్లు ఆదా చేయడంతోపాటు విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకునేందుకు ప్రిపెయిడ్ మీటర్లు ఉపయోగపడుతాయి. మొబైల్ రీచార్జ్ తరహాలోనే ఈవాలెట్ ద్వారా ప్రిపెయిడ్ మీటర్లను రీచార్జ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.

### స్టీల్ వంతెన గడ్డర్ల అమరికపై అదంతా దుష్ప్రచారమే: ఎడిసిఎల్

**విజయవాడ, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మిస్తున్న ఈ స్టీల్ వంతెన ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకుంటోందని ఎడిసిఎల్ స్పష్టం చేసింది. దీని నిర్మాణంలో నాణ్యత, భద్రత అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎడిసిఎల్ పేర్కొంది. ఒకవేళ గడ్డర్లు సరైన స్ట్రైట్ లైన్‌లో కూర్చోని పరిస్థితుల్లో, జాయింట్లను విడదీసి మళ్లీ సరిచేయడం సాధారణ సాంకేతిక ప్రక్రియేనని వివరించింది. వంతెన నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేవని, నిర్మాణ భాగాలను తొలగించాల్సిన అవసరం కూడా రాలేదని ఎడిసిఎల్ తెలిపింది. దీని గడ్డర్లు ఒరిగినట్లు జరుగుతున్న ప్రచారం నిజం కాదన్నారు. గడ్డర్ల అమరికలో ఇంజినీరింగ్ ప్రమాణాల ప్రకారం చిన్న సవరణలు మాత్రమే చేపట్టినట్లు తెలిపింది. స్టీల్ బ్రిడ్జి నిర్మాణం అత్యంత భద్రతా ప్రమాణాలతో కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. ఎడిసిఎల్ విడుదల చేసిన వివరణలో, స్టీల్ బ్రిడ్జిల నిర్మాణంలో అత్యంత పొడవైన గడ్డర్లను ప్రత్యేక సాంకేతిక విధానాలతో తయారుచేసి జాయింట్ చేస్తారని తెలిపింది. ఈ ప్రక్రియలో గడ్డర్లు మిల్లీమీటర్ల స్థాయిలో ఖచ్చితత్వంతో బేరింగ్‌లపై అమర్చాల్సి ఉంటుందని పేర్కొంది.

### ఉమ్మడి ఏపి మాజీ సిఎస్ రామారావు మృతి



**విజయవాడ, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి బీ.రామారావు తుదిశ్వాస విడిచారు. దివంగత సిఎం ఎన్టీఆర్ హయాంలో సిఎస్‌గా పనిచేసిన ఆయన, పరిపాలనను గాడిలో పెట్టడంలో కీలక పాత్ర పోషించారు. 1958 బ్యాచ్‌కు చెందిన రామారావు, కఠినమైన క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు, అధికారులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. పదవి విరమణ అనంతరం ఆయన బెంగుళూరులో స్థిరపడ్డారు. గత రాత్రి ఆయన వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో మరణించారు. ఆయన అంత్యక్రియలు బెంగళూరులోనే జరగనున్నాయి. బి.వి. రామారావు తన సుదీర్ఘ ప్రస్థానంలో విద్యాశాఖ కార్యదర్శిగా, ఎపిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్‌గా, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. తదనంతరం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పదవీ విరమణ చేశారు. అంతేకాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన సేవలందించారు. ప్రభుత్వ సేవ నుంచి రిటైర్ అయిన తర్వాత కూడా ఆయన విశ్రమించలేదు. విద్య వ్యాపార రంగాలపై ఉన్న మక్కువతో ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్‌గా బాధ్యతలు చేపట్టి, భావి తరాలకు దిశానిర్దేశం చేశారు. నిబద్ధత గల అధికారిగా, విద్యావేత్తగా ఆయన పేరు గడించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్‌తో సహాపలువురు ఐఏఎస్ అధికారులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటించారు.

### సర్ ఆర్థర్ కాటన్‌కు వైఎస్ జగన్ నివాళి

**విజయవాడ, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా వైసిపి అధినేత వైఎస్ జగన్ ఆయనకు నివాళి అర్పించారు. ఈ క్రమంలో వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. "గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు. వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేం" అని వైఎస్ జగన్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

### ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

**తిరుపతి, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ జె.కులశేఖర్ పర్యవేక్షణలో కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 2019 కేసులో తమిళనాడు వేలూరు జిల్లా ఆర్కాట్ తాలూకా ముద్దాయిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు.

16-5pg4.qxd:16-5pg4.qxd 1/1/02 6:21 AM Page 1



వార్త

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.

న- అరిస్టాటిల్

# మరుగుతున్న చమురు!

లేదు లేదంటూనే, కాదు కాదంటూనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ఇంధన వినియోగదారులపై కేంద్రం భారం మోపింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదంటూ వినియోగదారున్ని మభ్యపెట్టిన కేంద్రం మధ్యలో కొంతకాలం పెట్రోల్ బంక్‌ల దగ్గర హడావుడి సృష్టించింది. ఇప్పటికే ఇంధన వినియోగంలోనూపొదుపు నియంత్రణ అవసరమంటూ ప్రధాని నరేంద్రమోడీ వినియోగదారులకు దిశానిర్దేశం చేశారు. ఇంధన విషయంలో ఇప్పటికే ఇంధన తయారీ సంస్థలు అటు వినియోగదారులను ఇటు పెట్రో బంకుల యాజమానులను గందరగోళ పరచి రోడ్డెకించిన విషయం విదితమే. ప్రధానంగా ఈ నూతన పరిణామాల కారణంగా డీజిల్ ఆధారంగా పని చేసే యంత్రాలతో సాగుచేసే వ్యవసాయదారులపై సాగు ఖర్చులు పెరిగాయి. దానికితోడు ఉత్పత్తుల పెట్రోలు, రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమౌతోంది. సరకు రవాణా చేసే ట్రక్కులు పెట్రోల్, డీజిల్‌ల కోసం ఎన్నో రోజులుగా రోడ్ పక్కన నిచిలి ఉన్న ట్రక్కు డ్రైవర్లు తాము గమ్యస్థానాలకు ఎప్పుడు చేరతామోనని కంగారు పడుతున్నారు. సామాన్య వాహన వినియోగదారులకు పెట్రోలు, డీజిల్ సరఫరాపై ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ ముడి చమురుపై ధరలు బాగా పెంచేసినా వీటి వినియోగంపై రోజూ వెయ్యి కోట్లు నష్టం వాటిల్లుతోందని ప్రధాని ఇప్పటికే ప్రకటించారు. ప్రభుత్వరంగ సంస్థలతో పోలిస్తే దేశంలోని ప్రయివేట్ గ్యాస్ స్టేషన్ ఆపరేటర్లు నయారా ఎనర్జీ లిమిటెడ్, షెల్ పిఎల్‌సి వంటి కొన్ని సంస్థలు కొన్ని రోజుల క్రితమే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సరఫరా పరిమితులను విధించింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు నేటి ఇంధన ధరల పెంపుతో కాస్తంత ఊరట లభించినట్లయింది. అవి కొంతకాలంగా పారిశ్రామిక అవసరాలపై డీజిల్ ధరలను లీటరుకు అర్ధరూపాయి వరకు పెంచింది. జెట్ ఫ్యూయల్ ధరలుపెరిగిన కారణంగా పలు అంతర్జాతీయ రూట్లలో తమ విమాన సర్వీసులను ఎయిర్ ఇండియా రద్దు చేసింది. తాజాగా లీటరు పెట్రోలు, డీజిల్‌పై 3.04పైసలు పెంచగా, సిఎన్‌జి లీటర్‌పై రూ.2 మేరకు కేంద్రం పెంచింది. ఇదంతా సాధారణ వినియోగదారలు తట్టుకోలేని భారమే. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న తరుణంలో రిటైల్ పెట్రోలు, డీజిల్ ధరలను పెంచక తప్పదని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ముందుగానే హెచ్చరించారు. ప్రస్తుతం దేశంలో 76రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయి. మరో ప్రత్యామ్నాయ ఇంధన అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

ప్రభుత్వరంగ చమురు సంస్థల నష్టాలు తగ్గించడం కోసమైనా ఇంధన ధరల పెంపు అనివార్యం. గత కొద్దికాలంగా పెట్రోసంస్థల విన్యాసాలతో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి కూడా. ఇక పెట్రోలు, డీజిల్‌లను చూస్తామోలేమోనన్న భయంతో వాహనదారులు పెట్రోలు బంకుల వద్ద బారులు తీరడం,ఆనక కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌కు కొరతేమీ లేదని ప్రకటించడం జరిగిపోయాయి. ఏదో 'మాట వరసకలా' అన్నట్లు కేంద్రం విశ్లేషించుకుంది తప్ప పెట్రోల్ బంక్‌ల వ్యవహారాన్ని చక్క పరచలేకపోయింది. అడపాదడపా కొన్ని ప్రాంతాల్లో ఇదే సీను. రిటైల్ అవుట్‌లెట్లలో నిరంతరాయంగా పెట్రోలు, డీజిల్ సరఫరా ఉండాలని సంకల్పించి మరికొన్ని విధాన నిర్ణయాలు తీసుకొంది. గతంలో గ్యాస్ సరఫరా విషయంలోనూ గృహ వినియోగదారులకు నిత్యం గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంచాలనే తలంపుతో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల పంపిణీపై ఆంక్షలు విధించి లేనిపోని తలనొప్పులు తెచ్చుకుంది. ఆనాటి నిర్ణయంతో నిషేధాలు సాధారణ మానవుల నెత్తిన భారం పడింది. ఇకవాటి భారం నుంచి తప్పించగల వారెవరూ లేరు. రోజువారీ కూలిలు, అసంఘటిత కార్మికులు, బయట తినుబండారాలు ఆహారం మీద బతుకు వెళ్లేదీస్తే సామాన్య ప్రజానీకం మీద కోలుకోలేని బండపడింది. కొరత నిజంగా ఉందో లేదోతెలియని 'కమర్షియల్ గ్యాస్'బండలపై ఆంక్షలపేరిట సామాన్యుని నోటికాడ ముద్దకు ధరలు పెరిగిపోయాయి. తర్వాత అదేం లేదని చెప్పి నాలుక్కరచుకున్నారు. అయినా ఇక తగ్గవుకాక తగ్గవు. ఇంధన సంక్షోభం ఓ కొలిక్కి వచ్చినా ఆహార తినుబండారాలపై పెరిగిన చార్జీలకుజనం అలవాటుపడిపోతారు. వ్యాపారస్థులకు వీధి వ్యాపారులకు వాటి ధరలుతగ్గించే పరిస్థితిలేదు. తాజాగా పెట్రోలు, డీజిల్ బల్క్ అమ్మకాలపై ఆంక్షలు విధించి 'గ్యాస్' విషయంలో చేసిన తప్పేచేస్తోంది. కేంద్రం పెట్రో సంస్థల యాజమాన్యం పెట్రోల్ బంక్‌లకు రుణ ఆధారిత సరఫరా వ్యవస్థలను ఉపసంహరించుకుని ముందస్తుచెల్లింపు నిబంధనలను ప్రవేశపెట్టడం వలన ఇంధన సర ఫరాలో గందరగోళం ఏర్పడింది. పెట్రోలు,డీజిల్ పంపిణీని స్థిరీకరించే ప్రయత్నంలో భాగంగా వినియోగదారులకు 200 లీటర్ల డీజిల్ పరిమితం చేసింది. ఒక్కో వాహనదారునికి రూ.5వేల రూపాయల సరఫరా పరిమితి వలన కూడా సమస్యలు ఏర్పడే అవకాశంఉంది. సరిగ్గా ఇదే సమయంలో పెట్రోలు,డీజిల్ ధరను కేంద్రం పెంచడం వినియోగదారు మరో కొత్తరకం సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. భారత్ తనచమురు అవసరాల్లో 80శాతం కన్నాఎక్కువ దిగుమతులపై ఆధారపడుతోంది. కనుక పశ్చిమాసియా సెగను తట్టుకోవల్సిందే. ఇలాంటి సమస్యలను క్రోడీకరించుకుని సామాన్యులకు ఇబ్బంది లేకుండా చూసే యంత్రాంగాన్ని కేంద్రం తక్షణమే ఏర్పాటు చేసుకోవాలి.

క్రమశిక్షణ నుంచే జీవితం తన విలువను పొందుతుంది. కాబట్టి జీవితపు క్రమశిక్షణ అన్నది జీవితం కంటే చాలా అమూల్యమైనది.



తిరుక్కురళ్

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి.జాన్సన్

## ప్రజావాక్కు

### కఠిన చర్యలు తీసుకోవాలి

నీట్ పరీక్షాపత్రాల లీకేజీఉదంతం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. ఎంతో కష్టపడి చదివిన అభ్యర్థులకు ఈ ఘటన తీవ్ర నిరాశను, మానసిక వేదనను కలిగించింది. పరీక్షా పత్రం లీక్ కావడంవల్ల పరీక్ష రద్దుకావడం అనేది విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ఇదికేవలం ఒక పరీక్షకు సంబంధించిన అంశం కాదు, దేశంలోని వైద్య విద్య ప్రమాణాలను, నైతికతనుప్రశ్నిస్తోంది. దోషులను పట్టుకోవడానికి, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి. మొదటగా, ఈకుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించడానికి ఉన్నత స్థాయి దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలి. దోషులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన కఠిన శిక్షలు అమలు చేయాలి, తద్వారా ఇతరులకు ఇది ఒక హెచ్చరికగా మారుతుంది. సాంకేతికపరంగా, పరీక్షాపత్రాల రవాణా నిల్వలో అత్యాధునిక ఎన్క్రిప్షన్ పద్ధతులను వాడాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తం

నేడుగ్రామలలో ఐస్‌క్రీమ్ అమ్మేవాళ్ళు,చిన్నపిల్లల బట్టలు అమ్మేవాళ్ళు,రిపేర్‌లు చేస్తాం అనిఉదయం నుండి మధ్యాహ్నం వరకు తరచూ గ్రామాలలో తిరుగుతూ అనువైన వ్యక్తులను, ఇండ్లను పరిశీలిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు.ఇలాంటి వ్యక్తులను గ్రామాల్లోకి రాకుండా నిషేధించినప్పుడే గ్రామాలు సురక్షితంగా ఉంటాయి.ఎక్కడ ఇలాంటి వారు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలి. అందరూ అప్రమత్తంగా ఉండాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పిల్లల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచాలి

ఉభయరాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చాయి. ఈ సమయాన్ని రాబోయే తరగతిలో వారికి ఏదైనా అంశాలు అవగాహన లేని వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా గణితం,తెలుగువ్యాకరణం, ఆంగ్ల వ్యాకరణం తృప్తిగా అర్థమయ్యే విధంగా తల్లితండ్రులు, లేదా మిత్రుల సహకారంతో పునాది వేసుకోవాలి. విజ్ఞాన శాస్త్రం పాఠంలోసందేహాలు,నివృత్తిచేసుకోవాలి.అదనంగా పత్రిక పఠనం,నీతికథలు,చిత్రలేఖనం,దస్తూరి మెరుగుపరచడం తప్పక చేయాలి. సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాలి.

-కె.నారాయణ, నల్గొండ

### మూఢనమ్మకాలతో వ్యాధులు నయం కావు

వృద్ధులు మినహా నలభైఏళ్లలోపు యువకులు కూడా ఊహించని వ్యాధులకు గురవుతున్నారు. డబ్బులేక వైద్యం కోసం వ్యాధులకు సరైన సమయంలో చికిత్సపొందని వారు కొంత వరకు ఆరోగ్యశ్రీతో లబ్ధిపొంది శస్త్రచికిత్సలు చేసుకొని కుటుంబ పోషణ కొనసాగిస్తున్నారు. ఏరోగలక్షణమైన కనీసం అర్హత గల వైద్యున్ని మొదట సంప్రదించడం మన విధి. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఇతరుల సలహాతో ఆకుల పసరు వగైరా శరీరంలోకి తీసుకొని కోరి దుష్ప్రభావాన్ని ,కొన్ని చోట్ల కొత్త రోగాన్ని తెచ్చుకుని కుటుంబానికి ఆపద తెస్తున్నారు. ఈ విధంగా అశాస్త్రీయ, మూఢ నమ్మకాలతో వ్యాధులు తగ్గవని రాష్ట్ర వైద్యశాఖజిల్లాల్లో వినూత్నైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. ఇది రాష్ట్ర వైద్య శాఖకు ఒక తలమానికం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### ఫిర్యాదులు స్వీకరించాలి

ప్రభుత్వం పేద ప్రజలకు ఎస్సి,ఎస్టీ, వికలాంగులకు పంచిన ఇండ్ల స్థలంలో కొందరు భూమి కబ్జాలు చేస్తున్నారు. ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన స్థలంలో అక్రమ నిర్మాణం చేసి యజమానులపై దాడులు, దౌర్జన్యం చేస్తున్నారు. తహసీల్దార్, పోలీస్ స్టేషన్, జిల్లా కలెక్టర్ మానవ హక్కుల కమిషన్, ఎస్సి,ఎస్టీ కమిషన్,వికలాంగుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసిన కూడా న్యాయం జరగడంలేదు. రెవిన్యూ అధి కారులు, పోలీస్ అధికారుల సమక్షంలో భూమి కబ్జాల పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### వేగంగా ఎదుగుతున్న రాష్ట్రం

సేవల రంగంలో తెలంగాణ ఇతరరాష్ట్రాలను అధిగమించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఒకమైలురాయిగా నిలిచింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంవేగంగా పట్టణీకరణ దిశగా పయనించడంతో సేవలరంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం,ఐటీ, ఫైనాన్స్, విద్య, ఆరోగ్యం, రియల్ ఎస్టేట్ వంటి విభాగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి దేశంలోనే ఆదర్శప్రాయమని చెప్పవచ్చు. ప్రభుత్వం చేపట్టిన మౌలికసదుపాయాల విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహక విధానాలు,డిజిటల్ ఇన్నోవేషన్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఈ అభివృద్ధికి ప్రధాన బలాలుగా నిలిచాయి. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాజెక్టులు తెలంగాణను గ్లోబల్ సేవల రంగంలో కీలక స్థానంలో నిలబెట్టాయి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'నీట్'గా పరీక్షలు జరపలేమా?

**ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడి విద్యార్థుల నుంచి నిరసనలు ఎదురైనప్పుడు సంబంధిత మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో ఒకసారి ఇంటర్మీడియేట్ ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి విద్యాశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమ్మనాయుడు రాజీనామా చేయగా పదోతరగతి ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి మంత్రి రాంచంద్రరావును పదవి నుంచి తప్పించారు. కానీ ఈ పరీక్షల నిర్వహణలో కీలకపాత్ర వహిస్తున్న అధికారులకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు. ప్రస్తుతం లీక్‌కు కారణమైన అధికార, అనధికార అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టి ప్రాసిక్యూట్ చేయాలి. వారి ఫొటోలను పత్రికల్లోనూ, టీవీల్లోనూ వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియచేయాలి. పాలకులు ఇంత కఠినంగా వ్యవహరించకపోతే డబ్బులతో ర్యాంకులు కొనుక్కోవాలనే ఆశపడేవారికి ప్రశ్నపత్రాలతో వ్యాపారం చేసేవారికి భయభక్తులు ఉండవు.**

దామెర్ల సాయిబాబ

ఆశయం జీవితానికి విలువ నేర్పుతుంది. ఆశ జీవితాన్ని ఆటపట్టిస్తుంది. కానీ ఆ ఆశే అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే అరాచకానికి, అక్రమాలకు అంతే ఉండదు. నీతి, నియమాలకు, నైతిక విలువలకు తావే ఉండదు. ఇతర రంగాల సంగతి ఏమోకానీ విద్యారంగంపై ఈ ప్రభావం తీవ్రంగా చూపుతున్నది. కష్టపడకుండా తెల్లవారేసరికి లక్ష్మీపుత్రులై కోట్లకు పడగెత్తాలనే కొందరి దురాశ విద్యారంగంలో పెచ్చురిల్లుతుండడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. పాలకులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతున్నా మరెంతగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రశ్నపత్రాలు ఏ పరిస్థితుల్లో లీక్‌కాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక రూపంలో ఏదో రకంగా లీక్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఆయా రాష్ట్రాల పరిధిలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ తర్వాత ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలు అన్నీఇన్నీ కావు. పేపర్లు లీక్‌కావడం, మరొకచోట వాల్యూయేషన్‌లో కొందరు అధ్యాపకులే చేతివాటం ప్రదర్శించడంతో ఎన్నోసార్లు ఏకంగా పరీక్షలే రద్దు చేసి మళ్లీ పెట్టిన సంఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా మెడికల్ విద్యకు జరిగే ప్రవేశపరీక్ష ప్రశ్నపత్రాల విషయంలో ప్రభుత్వ చర్యలేవీ లీక్‌లను ఆపలేకపోయాయి. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో వైద్యవిద్య కోర్సుల ప్రవేశాలకు జాతీయ స్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు'నేషనల్ ఎల్జిబులిటీ అండ్ ఎంట్రన్స్ టెస్ట్' (నీట్)ను ప్రవేశపెట్టారు. 2013 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షల్లో మొదట్లో కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సిబిఎస్‌ఇ) నిర్వహించేది. 2017 నుంచి కేంద్ర విద్యాశాఖ పరిధిలోని జాతీయ పరీక్షా సంస్థ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్‌టిఏ) నిర్వహిస్తుంది. పకడ్బందీగా లీక్ ప్రూఫ్‌గా ఈ పరీక్షలు నిర్వహించాలనితద్వారా ప్రజల్లో,ముఖ్యంగా విద్యార్థుల్లో అనుమానాలకు తావులేకుండా నమ్మకం, విశ్వాసం కలిగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా ఎన్‌టిఏ వ్యవహరించలేక చతికిలపడుతున్నది. తాజాగా ఈ నెల మూడవ తేదీన నిర్వహించిన నీట్ పరీక్షలు లీక్ కారణంగా పరీక్షలు రద్దు చేశారు. ఈ పరీక్షల ప్రశ్నపత్రాలు రాజస్థాన్‌లో లీక్ అయినట్లు వార్తలు రాగానే ఎలాంటి లీక్‌లు లేవని ఎంతో పకడ్బందీగా నిర్వహించినట్లు ప్రకటించిన ఇరవై నాలుగు గంటలు గడవక ముందే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ పరీక్షలు రాసిన దాదాపు 23లక్షల మంది విద్యార్థులే కాదు వారి తల్లితండ్రులు హతాశులయ్యారు. పరీక్షలకు మూడు, నాలుగు రోజుల ముందే గెస్ పేపర్ రూపంలో అందులోని ప్రశ్నలు వాట్సాప్‌లో ప్రత్యక్షం కావడం. కేంద్ర దర్యాప్తుసంస్థ ఆగమేఘాలపై జరిపిన ప్రాథమిక దర్యాప్తులో లీక్ జరిగినట్లు తేలడంతో రద్దు చేయక తప్పలేదు. నీట్ పరీక్షలు రద్దుకావడం ఇది మొదటిసారి కాదు. 2024లో కూడా ఇలాంటి ఆరోపణలే వెలుగెత్తాయి. ప్రజలనుండి నిరసనలు వెలువెత్తడంతో దర్యాప్తులో వెలుగు చూసిన నిజాలు విస్తుగొల్పాయి. 30 మందినిపైగా అరెస్టు చేశారు. మరోపక్క పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నిర్వహించేందుకు 2024 ఫిబ్రవరిలోనే పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. కానీ మళ్లీ లీక్ పునరావృతం అయింది.

## ఒక్క మాట

ఈ లీక్‌లు అనేది కొత్తగా వచ్చిందికాదు. చివరిది కూడా కాకపోవచ్చు. ఎంసెట్ ఆరంభం నుంచి ప్రశ్నపత్రాల్లో తప్పులు, లీక్‌లు మామూలుగా మారిపోయాయి. బయటపడినప్పుడు తప్పని పరిస్థితుల్లో పరీక్షలు రద్దు చేయడం, తిరిగి పరీక్షలు పెట్టడం నిందితులపై కేసులు పెట్టడం, ఆ తర్వాత మరచిపోవడం, కేసులను అటకెక్కించడం సర్వసాధారణమైపోయింది. ఇంజినీరింగ్‌కు కొంత డిమాండ్ తగ్గినా మెడికల్ సీట్లకు రానురాను డిమాండ్ పెరుగుతూనే ఉంది. వైద్య విద్య అనేది పేదలకే కాదు, మధ్యతరగతి వారికి అందని ద్రాక్షపండులా తయారు అయింది. మెడికల్ సీటు మేనేజ్‌మెంట్ కోటాలో అరవై లక్షల నుంచి కోటి రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఎనిమిదో తరగతి నుండే శిక్షణ ఇప్పించే తల్లిదండ్రులు ఉన్నారు. అప్పటి నుండి పిల్లలు కూడా పండుగలు, పబ్బాలు, శుభకార్యాలే కాదు కుటుంబ సభ్యులు మరణించినా రాలేని, చివరి చూపులకు కూడా నోచుకోకుండా సర్వం మెడికల్ విద్యపైనే దృష్టి పెట్టి చదువుతున్న విద్యార్థులు లక్షల సంఖ్యలో ఉన్నారు. మరొకపక్క మెడికల్‌పై ఉన్న మోజు సొమ్ము చేసుకునేందుకు కొన్ని ముఠాలు ఏనాటి నుంచో ఒక వ్యూహం ప్రకారం ప్రశ్నపత్రాలు సంపాదించడం, సొమ్ము చేసుకోవడం జరుగుతూనే ఉంది. ఈ లీక్ వీరులకు పోలీసులన్నా, చట్టాలన్నా భయభక్తులు లేకుండా పోతున్నాయి. ఏదిఏమైనా ప్రస్తుతం రద్దు చేసిన పరీక్షలు వచ్చేనెల 21వ తేదీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈసారి ఏ పరిస్థితుల్లోను లీక్, అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్ పాతపాటే పాడారు. పరీక్షలు రద్దు చేసి మళ్లీ పెడితే ఆ విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఎంతటి మానసిక వేదనకు, ఒత్తిడికి గురవుతారో మనసుపెట్టి ఆలోచించాలి. మళ్లీ కోచింగ్ సెంటర్లలలో ఎన్ని కోట్ల వ్యాపారం జరుగుతుందో చెప్పక్కరలేదు. ఇక ప్రశ్నపత్రాలు లీక్ బయటపడకుండా ఉంటే అవి కొన్నవారు, చేజిక్కించుకున్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాలు లీక్ అయినట్లు స్పష్టంగా బయటపడిన సందర్భాల్లో కూడా పాలకులు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. అధికారంలో ఎవరు ఉన్నా, ఈ పరీక్షల నిర్వహణలో మాత్రం అవకతవకలను నిరోధించలేకపోతున్నారు. గతంలో కూడా బయటపడిన సందర్భాల్లో విధిలేని పరిస్థితుల్లో రద్దు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారే తప్ప కారకులైనవారిపై పటిష్టమైన చర్యలు తీసుకొని మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా చేయలేకపోతున్నారు. ఏదిఏమైనా ఈ పరీక్షల నిర్వహణ ఎంత పతనావస్థకు దిగజారుతున్నదో మళ్లీ మళ్లీ లీక్ అవుతున్న నీట్ పరీక్షలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇందుకు కోచింగ్ సెంటర్ల యజమాన్యాలనో, దళారులనో నిందించి ప్రయోజనం లేదు. విద్యను వ్యాపార వస్తువుగా మార్చి, స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించిన పాలకులనే నిందించాలి, తప్పు పట్టాలి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా తమ చర్యలద్వారా మెప్పించగల నైపుణ్యం,సామర్థ్యం కొందరి అధికారుల్లో ఉంది. దీని వెనుక కొందరు విద్యా వ్యాపారవేత్తల అండదండలు కూడా ఉన్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడి విద్యార్థుల నుంచి నిరసనలు ఎదురైనప్పుడు సంబంధిత మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో ఒకసారి ఇంటర్మీడియేట్ ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి విద్యాశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమ్మనాయుడు రాజీనామా చేయగా పదోతరగతి ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి మంత్రి రాంచంద్రరావును పదవి నుంచి తప్పించారు. కానీ ఈ పరీక్షల నిర్వహణలో కీలకపాత్ర వహిస్తున్న అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలు ఉండడం లేదు. ప్రస్తుతం లీక్‌కు కారణమైన అధికార, అనధికార అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టి ప్రాసిక్యూట్ చేయాలి. వారి ఫొటోలను పత్రికల్లోనూ, టీవీల్లోనూ వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియచేయాలి. పాలకులు ఇంత కఠినంగా వ్యవహరించ కపోతే డబ్బులతో ర్యాంకులు కొనుక్కోవాలనే ఆశపడేవారికి ప్రశ్నపత్రాలతో వ్యాపారం చేసేవారికి భయభక్తులు ఉండవు. ఈ వ్యాపారం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటూ నిరాటంకంగా జరిగిపోతూనే ఉంటుంది. మరొకపక్క ప్రశ్నపత్రాల వ్యాపారంలో కోట్లాది రూపాయలు ఈ దళారులు దోచుకుంటూనే ఉంటారు.

# మద్యం అమ్మకాలను నియంత్రించలేరా?

బుగ్గన మధుసూదనరెడ్డి

మత్తుకు బానిస అయినవారు మందుమత్తులో తెల్లార్లు జోగాడటం,మందు వ్యసనపరుల నైజంగా మార్చుకోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత దురదృష్టకరం. అందుకే వీరి బలహీనతే మందు దుకాణాల (చీప్ లిక్కర్ యజమానుల వారికి) కాసుల వర్షం కురిపిస్తున్నది. ఆ మధ్యకాలంలో లాక్‌డౌన్‌లో వుంటూ కళ్ళకు గంతలు కట్టుకొని మరీ,కహోర పక్షుల్లాగ మందు కోసం వేచిచూసారు ముందుకు బానిస అయిన మందు బాబులు. ఈమధ్యే కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టి లాక్‌డౌన్ సడలించడంతో, వారికి కాస్త సందు, అవకాశం దొరికి చీప్ లిక్కర్ కోసం మళ్ళీబారులు తీరుతున్నారు. అర్రులు చాస్తున్నారు, ఉన్న ఫలంగా రెక్కలు కట్టుకొని చీప్ లిక్కర్ షాప్‌లా ముందు స్వేచ్ఛ లభించిన జీవులలాగా వాలిపోతున్నారు. అయితే ఒకానొక దశలో కరోనా ఊడలమర్రిలా విస్తరించడంతో చీప్ లిక్కర్ దొరికే దారి లేక తమ ఆరోగ్యాన్ని కొంత కాలం కాపాడుకున్నారు. ఇక గత కొంతకాలంగా ఆ లాక్‌డౌన్ సడలింపులు,నిబంధనలు ముగిసిపోవడంతో వారి ఆరోగ్యం గుల్ల చేసుకునే చెడు కాలం రానే వచ్చింది. ఇక వారిని ఆపేవారెవరు,ఇక వారికి ఎదురే లేదు,తాగిన మత్తులో చిందులు వేస్తూ ఇటు ఈ సమాజాన్ని అటువారి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేయడమే,భ్రష్టుపట్టించడమే పనిగా పెట్టుకున్నారు ఈ చీప్‌లిక్కర్ వ్యసనపరులు. తద్వారా ఈ చెడువ్యసనం బారినపడి ఇటు ప్రభుత్వాలకు,అటు మందు దుకాణాల వారికి కోట్లాది రూపాయలు ఆర్జించిపెడుతున్నారు. ఇక వారు మాత్రం ఈ మందు మత్తులో చిక్కుకుపోయి బికారులు అవుతూ, జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. ఏమిచేస్తాం అంతా వారి కర్మ అని మనమంతా మిన్నకుండి పోవాల్సిందే.ఎందుకంటే మందు జోలికి వెళ్ళవద్దు, మీ జీవితాలు సర్వనాశనం అవుతాయి అని వారి మంచికోరి చెవిటోడి ముందు శంఖం ఉదినట్లు ఎన్నిమార్లు వారికి విన్నవించిన ఆ మందు మత్తులో నుంచి వారు బయటపడలేని దయనీయ స్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు అనే మాట అక్షర సత్యం. ఏదిఏమైనా మత్తు మందుకు,చీప్ లిక్కర్ సేవనానికి బానిసఅయిన వారి జీవితాలు నిరంతరం అల్లకల్లోల మయమే. అయితే మత్తు మందుకు ఆమడదూరంలో ఉండేవారు,దాని ఛాయలకు కూడా వెళ్ళనివారు,కనీసం దాని వాసన కూడా పడని వారు ఈ కాలానికి సంబంధించి అత్యంత అదృష్టవంతులు. ఏమైనా మనదేశంలో జరిగే దాదాపు 60 నేరాలు, ఘోరాలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దోపిడీలు అన్నింటికీ మూలం ఈ చీప్ లిక్కర్ మత్తు మందే. పరిస్థితి ఇంత కడు దయనీయంగా, రాక్షసత్వంగా వుంటే ఇక మన జాతి పిత మహాత్మాగాంధీజీ కలలు గన్న సంపూర్ణ మద్యపాన నిషేధానికి తావెక్కడిది? అలాగే ఈ పాపాన్ని సైతంఎవరికీ అప్పనంగా అంటగంటలేని దుస్థితి. కాబట్టి తలాపాపం తిలా పిడికెడు అంటారే ఆ విధంగా ఈ పాపకార్యంలో పాలకులు, ప్రభుత్వాలు, ప్రజలు ఇలా అందరూ దోషులే. చీప్ లిక్కర్ వ్యసనానికి చెక్ పెడదాం,మన ఆరోగ్యాన్ని మరో పది కాలాల పాటు కాపాడుకుందాం.

# ప్రభుత్వ సంస్థల బలోపేతంతోనే అభివృద్ధి సాధ్యం

తరిగోపుల నారాయణస్వామి

దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారి 'పొదుపు' అనే మాట ప్రజల ముందుకు వస్తుంది. విద్యుత్‌ను ఆదా చేయండి, ఇంధన వినియోగాన్ని తగ్గించండి, అవసరం లేని ఖర్చులను వాయిదా వేయండి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించండి, బంగారు కొనుగోళ్లు తగ్గించండి, వర్క్ ఫ్రం హోం విధానాలను ప్రోత్సహించండి అని ప్రభుత్వాలు సూచనలు చేస్తుంటాయి. యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతలు, ఇంధన ధరల పెరుగుదల, ప్రపంచ మార్కెట్ ఒడిదుడుకులు వంటి కారణాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడినప్పుడు ప్రజల సహకారం అవసరమని చెప్పడం సహజమే. ప్రజలు కూడా దేశ ప్రయోజనం కోసం ఎన్నో త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉంటారు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న సమాజం మొత్తం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు పొదుపు గురించి చెప్పే పాలకులు,ప్రజలు ఆధారపడే ప్రభుత్వ మౌలిక వ్యవస్థలను ఎంతవరకు బలోపేతంచేస్తున్నారు? ప్రజా రవాణా ఉపయోగించండి అని చెప్పడం మాత్రమే సరిపోదు, ఆ రవాణా వ్యవస్థ సౌకర్యవంతంగా, సమయపాలనతో, అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తీర్చిదిద్దాలనే బాధ్యత కూడా ఉంది. ఒక సాధారణ ఉద్యోగి లేదా విద్యార్థి బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సివస్తే, రైళ్లు కిక్కిరిసి ప్రయాణం ప్రమాదకరంగా మారితే, ప్రజలు స్వచ్ఛందంగా ప్రజా రవాణాను ఎందుకు ఆశ్రయిస్తారు? ప్రజా రవాణా బలపడితేనే పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గుతుంది. కుటుంబాల ఖర్చులు తగ్గుతాయి. కాలుష్యం తగ్గుతుంది. నగరాలలో ట్రాఫిక్ సమస్యలు కూడా నియంత్రణలోకి వస్తాయి. కాబట్టి ప్రజలకు సూచనలు చేయడమే కాకుండా ప్రభుత్వాలు ముందుగా సేవల నాణ్యతను పెంచాలి. ప్రజలకు పొదుపు బోధించే ముందు ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే వ్యవస్థలను నిర్మించాలి. ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ విద్యను అందిస్తే,ప్రభుత్వ ఆసుపత్రులు విశ్వసనీయ వైద్య సేవలను అందిస్తే, ప్రజలు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేటు రంగం వైపు ఎందుకు పరుగులు తీస్తారు? గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రభుత్వసేవలు బలహీనపడినప్పుడు ప్రజలు అప్పులు చేసి అయినా ప్రైవేటురంగాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది వ్యక్తిగత ఖర్చులను పెంచడమే కాక సమాజంలో ఆర్థిక అసమానతలను మరింత పెంచుతోంది. ఒక కుటుంబం పిల్లల చదువు కోసం అప్పులు చేస్తోంది. మరో కుటుంబం వైద్య చికిత్స కోసం ఆస్తులు అమ్ముకుంటోంది. ఇవన్నీప్రజల పొదుపులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. ప్రజలు పొదుపు చేయాలంటే ముందువారి జీవితవ్యయాలు తగ్గాలి. ఆ బాధ్యతను ప్రభుత్వాలు మర్చిపోవద్దు. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలపడితే దేశ భవిష్యత్తు బలపడుతుంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలపడితే ప్రజల ఆరోగ్యం బలపడుతుంది. ఆరోగ్యవంతమైన సమాజమే ఆర్థికంగా బలమైన దేశానికి పునాది అవుతుంది. ఉద్యోగ కల్పన విషయంలో కూడా ఇదే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిరుద్యోగ యువతకు 'స్వయం ఉపాధి' అనే ఒకే మాట చెప్పడం సరిపోదు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసి, కొత్త పరిశ్రమలను ప్రోత్సహించి,



ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలను పెంచితేనే దేశ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం వస్తుంది. ఒకవైపు యువత నిరుద్యోగంతో బాధపడుతుంటే, మరోవైపు ఖాళీగా ఉన్నప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా సంవత్సరాల తరబడివాయిదా వేయడం సమంజసంకాదు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు సమాజ నిర్మాణంలో కీలకమైన శక్తులు. వారికిసకాలంలో వేతనాలు, కరవు భత్యాలు, వేతన సవరణలు అందించకపోతే ఆర్థిక వ్యవస్థలో వినియోగ శక్తి తగ్గిపోతుంది. వినియోగ శక్తి తగ్గితే మార్కెట్ మందగిస్తుంది. మార్కెట్ మందగిస్తే దేశ అభివృద్ధి కూడా మందగిస్తుంది. కాబట్టి ఉద్యోగులకు సముచిత గౌరవం ఇవ్వడం కేవలం సంక్షేమం కాదు, అది దేశ ఆర్థిక చక్రాన్ని ముందుకు నడిపించే ప్రధాన ఆధారం. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం చూపడం అంటే ప్రజా సేవల పట్ల నిర్లక్ష్యం చూపడమే. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు బలంగా ఉంటే విద్యా వ్యవస్థ బలపడుతుంది. ఒక వైద్యుడు గౌరవంగా పనిచేస్తే వైద్య వ్యవస్థ బలపడుతుంది. ఒక ఉద్యోగి నమ్మకంతో పనిచేస్తే పరిపాలన బలపడుతుంది.ఈ రోజు ప్రజలకు పొదుపు చెప్పే నాయకులు తమ కాన్వాయ్‌లను తగ్గించు కోవడం, ప్రభుత్వ ఖర్చులను నియంత్రించడం వంటి చర్యలు చేపట్టడం స్వాగతించదగ్గ విషయం. నాయకత్వం ముందు ఆదర్శంగా నిలిస్తే ప్రజలు కూడా సహకరిస్తారు. కానీ అది ఒక్కటే సరిపోదు. దేశాన్ని బలపరచేది కేవలం పొదుపు కాదు, ప్రజలకు అందుబాటులో ఉండే బలమైన ప్రభుత్వ వ్యవస్థలు. ఒక దేశం నిజంగా శక్తివంతం కావా లంటే ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యం, ప్రజా రవాణా, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రభుత్వ రంగ ఉపాధి వంటి రంగాలు అత్యున్నత స్థాయిలో ఉండాలి. అప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ వ్యవస్థలనే ఆశ్రయిస్తారు. అప్పుడు ఇంధన వినియోగం తగ్గుతుంది, కుటుంబాలపై ఆర్థికభారం తగ్గుతుంది. దేశ సంపద దేశంలోనే నిలుస్తుంది. నేడు అభివృద్ధి పేరుతో అనేక ప్రాజెక్టులు వస్తున్నాయి. కానీ ప్రజల దైనందిన జీవితాన్ని సులభతరం చేసే రంగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది. భారీ భవనాలు కట్టడం కంటే బలమైన ప్రభుత్వ పాఠశాల నిర్మించడం గొప్పది. విలాసవంతమైన కార్యాలయాల కంటే గ్రామీణ ఆసుపత్రులను ఆధునీకరించడం అవసరం. ప్రజా ప్రయోజనాలకే ప్రభుత్వ ధనం ఎక్కువగా వినియోగించాలి. దేశాభివృద్ధి అంటే కేవలం గణాంకాలు కాదు, సామాన్య ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు. ఒక రైతు తన పిల్లలను నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలో చదివించగలగాలి. ఒక కార్మికుడు ప్రభుత్వ ఆసుపత్రిలో గౌరవప్రదమైన వైద్యం పొందగలగాలి. ఒక యువకుడు ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి నిరాశతో తిరగకూడదు. ఒక ఉద్యోగి తన కష్టానికి తగినవేతనం కోసం నిరసనలుచేయాల్సిన పరిస్థితి రాకూడదు. ప్రజలకు ఈ భరోసా కలిగినప్పుడే దేశం నిజమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది. పొదుపు అనే మాట ప్రజలపై భారం మోపే నినాదంగా కాకుండా, సమగ్ర ప్రజా సంక్షేమంతో కూడిన జాతీయ బాధ్యతగా మారాలి. దేశం అంటే కేవలం భూభాగం కాదు, దేశప్రజల జీవన ప్రమాణాలే నిజమైన దేశ బలం. ప్రజల కష్టాలు తగ్గితేనే దేశం బలపడుతుంది. ప్రజల ఆదాయం పెరిగితేనే మార్కెట్ బలపడుతుంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. కాబట్టి ప్రజలసంక్షేమం దేశాభివృద్ధి పరస్పర విరుద్ధాలు కావు. అవి ఒకదానికొకటి ఆధారాలు. కాబట్టి ఈ కాలం మనందరికీ ఒక గొప్ప పాఠం చెబుతోంది. ప్రజలకు సూచనలు చేయడం సులభం, కానీ ప్రజలు గౌరవంగా జీవించే వ్యవస్థలను నిర్మించడం పాలకుల అసలు బాధ్యత. ప్రజా ధనం ప్రజలకే ఉపయోగపడే విధంగా ప్రభుత్వాలు పనిచేస్తేనే దేశం బలపడుతుంది. ప్రజలపై భారాలు మోపకుండా, ప్రజల జీవిత వ్యయాలను

16-5Pg5.qxd:16-5Pg5.qxd 1/1/02 6:23 AM Page 1





# ప్రధాని మోడీ ప్రత్యేకమైన వ్యక్తి

## కెనడా ప్రధాని మార్క్‌కార్నీ ప్రశంసలు

**సిడ్నీ, మే 15:** ప్రధాని నరేంద్ర మోడీపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ ప్రశంసల వర్షం కురిపించారు. మోడీచాలా ప్రత్యేకమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ లోవీ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెనడా ప్రధాని మాట్లాడుతూ భారత పర్యటన సందర్భంగా ప్రధాని మోడీతో జరిగిన సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నిబద్ధత ఎంతో ప్రత్యేకమైనదని కార్నీ ప్రశంసలు కురిపించారు. గత 25 ఏళ్లల్లో ఒక్క రోజు కూడా మోడీ సెలవు తీసుకోలేదన్నారు. ప్రతి వారాంతంలో ఆయన ప్రజలకు చేరువయ్యేందుకు ప్రత్యేక శ్రద్ధ పెడతారన్నారు. ప్రధాని మోడీకి తన పనిపై ఉన్న నిష్ట గొప్పదని కూడా అన్నారు. గ్రామీణ ప్రజానీకానికి సేవ చేయడంపై ప్రధాని మోడీ ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. యూపీఐపై కూడా ప్రశంసలు కురిపించారు. నేరుగా నగదు లబ్ధిదారులకు బదిలీ చేయడం ఈ వ్యవస్థతో సాధ్యమైందని అన్నారు. దీంతో, అనేక మంది ప్రధాన ఆర్థికవ్యవస్థలో భాగం కాగలిగారని అన్నారు. ఈ విషయంపై ప్రధాని ప్రత్యేక దృష్టి పెట్టారని కామెంట్ చేశారు. ట్రూడో హయాంలో కెనడాతో భారత్ సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రధాని కార్నీ ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల భారత్‌లో కూడా పర్యటించారు. భారత దేశ ఇంధన అవసరాలు తీర్చేందుకు కెనడా తన వంతు ప్రయత్నం చేస్తుందని పర్యటన సందర్భంగా ఆయన చెప్పారు. భారత్‌కు యురేనియం సరఫరా కోసం కెనడా సంస్థ కామికో దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుందన్నారు. కెనడా, భారత దేశాల ప్రజల మధ్య సంబంధాలు బలమైనవని వ్యాఖ్యానించారు. రెండు మిలియన్‌ల మంది కెనడా పౌరులకు భారతీయ మూలాలు ఉన్నాయని గుర్తు చేశారు. రక్షణ రంగంలో సహాకారాన్ని కూడా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత్, కెనడాలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు.

## తైవాన్‌కు సహాకరిస్తే భవిష్యత్తులో యుద్ధమే

### ట్రంప్ ముఖంమీదే స్పష్టత ఇచ్చిన జిన్‌పింగ్



**బీజింగ్, మే 15:** తైవాన్‌కు అమెరికా సైనిక సహాకారం అందించటంపై గుర్రుగా ఉన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అగ్రరాజ్యాధినేతకు నేరుగా హెచ్చరికలు జారీచేశారు. తైవాన్ విషయంలో ఏమాత్రం తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా ఘర్షణ తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖంమీదే తేల్చిచెప్పేశారు. రెండురోజుల చైనా పర్యటనలో ఉన్న ట్రంప్ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో రెండు గంటలపాటు ఏకాంతంగా జరిగిన చర్చల్లో తైవాన్ వివాదంతోపాటు పశ్చిమాసియా యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన సంక్షోభం, అమెరికాచైనాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం తదితర అంశాలపై చర్చలు జరిపారు. చర్చల వివరాలను అధికారికంగా వెల్లడించనప్పటికీ చైనా అధికారిక మీడియా సంస్థ జిన్‌హువా పలు వివరాలు బయటపెట్టింది. తైవాన్ విషయంలో ట్రంప్‌కు జిన్‌పింగ్ తన వైఖరిని స్పష్టంగా చెప్పారని పేర్కొంది. తైవాన్ విషయంలో అమెరికా సరైన పద్ధతిలో వ్యవహారిస్తే మన రెండు దేశాల మధ్య సంబంధాలు ఉన్నతంగా స్థిరంగా కొనసాగుతాయి అని జిన్‌పింగ్ తెలిపినట్లుప్రస్తావించింది. వాణిజ్య యుద్ధం వల్ల ఎవరికీ ప్రయోజనం కలగదని, నష్టమే మిగులుతుందని ట్రంప్‌తో జిన్‌పింగ్ అన్నారు. వాణిజ్యం విషయంలో ప్రత్యర్థుల్లా కాకుండా మిత్రులుగా ఉందాం. పరస్పర సహాకారంతో పనిచేద్దాం అని జిన్‌పింగ్ సూచించినట్లు పేర్కొంది. మరోవైపు చైనాతో తమకు ఉన్న వాణిజ్య లోటును పూడ్చటమే ముఖ్యమైన అంశమని ట్రంప్ స్పష్టంచేసినట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. చైనాకు సమీపంలో దక్షిణ చైనా సముద్రంలో ఉన్న తైవాన్ తనదేనని చైనా ఎప్పటి నుంచో వాదిస్తోంది. ఆ ద్వీపంతో ఏ దేశమూ నేరుగా సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరిస్తూ వస్తోంది. తైవాన్ మాత్రం తాము సర్వస్వతం త్రులమని చెప్పుకుంటోంది. తైవాన్‌తో అనధికారి సంబంధాలు కొనసాగి స్తున్న అమెరికా ఆ దేశానికి ఆయుధాలు, ఇతర సాంకేతికతలను అంది స్తోంది. జిన్‌పింగ్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో కీలక వ్యాఖ్యలు చేశారు. తైవాన్ విషయంలో అమెరికా విధా నంలో ఏమార్పు ఉండదని స్పష్టంచేశారు. చైనాతో తైవాన్ స్వచ్ఛందంగా కలిసిపోయేందుకు ముందుకొస్తే తమకు అభ్యంతరం లేదని, బలవంతంగా ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం చైనా పెద్ద తప్పు చేసినట్లే అవుతుందని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిని స్వేచ్ఛాయుత నౌకారవాణా కోసం తెరిచి ఉంచాల్సిందేనని ట్రంప్, జిపింగ్ నొక్కి చెప్పారు. ఈ జలసంధిపై ఎవరి నియంత్రణ ఉండరాదని ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండరాదన్న అమెరికా వాదనకు జిన్‌పింగ్ సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు తెలిపింది.

# ప్రధానిమోడీకి ఎమిరేట్స్ యుద్ధవిమానాల ఎస్కార్ట్!



**అబుదాబి, మే 15:** యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోడీకి అక్కడ అరుదైన స్వాగతం లభించింది. దేశ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ స్వయంగా అబుదాబి ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి సాదర స్వాగతం పలికారు. అంతకు ముందు ప్రధాని ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా విమానం యూఏఈ గగనతలంలోకి ప్రవేశించగానే ఆయనకు రక్షణగా యూఏఈ తన ఎఫ్16 బ్లాక్ 60 డెజర్ట్ ఫాల్కన్ ఫైటర్ జెట్లను పంపించింది. విమానం ఎయిర్‌పోర్టులో దిగేంతవరకూ ఈ యుద్ధవిమానాలు మోడీ విమానానికి రక్షణగా వచ్చాయి. ఎయిర్‌పోర్టులో యూఏఈ అధ్యక్షుడు ప్రధాని మోడీకి స్వయంగా స్వాగతం పలికారు. ప్రధాని యూఏఈ సైనిక బృందం గౌరవ వందనాన్ని స్వీకరించారు. గల్ఫ్ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభానికి దారి తీస్తున్న తరుణంలో ప్రధాని మోడీ యూఏఈ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు పలు అంశాలకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. యూఏఈపై జరిగిన దాడులను కూడా ప్రధాని మోడీ ఖండించారు. భారత్ ఎల్లప్పుడూ యూఏఈకి అండగా ఉంటుందని అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో యూఏఈలోని భారతీయులకు అక్కడి ప్రభుత్వం సొంత కుటుంబసభ్యుల్లా రక్షణ కల్పించినందుకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఏ సమస్యకైనా చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే పరిష్కారాన్ని అన్వేషించాలనేదే భారత్ అభిమతమని కూడా ప్రధాని మోడీ స్పష్టం చేశారు. యూఏఈలో కొన్ని గంటల పాటే ఉండనున్న ప్రధాని ఆ తరువాత నెదర్‌లాండ్స్, స్వీడెన్, నార్వే, ఇటలీ దేశాల పర్యటనకు వెళతారు.

# భోజ్‌శాల మసీదు హిందూ దేవాలయమే!

## హైకోర్టు ఇండోర్ బెంచ్ గుర్తింపు



**ఇండోర్, మే 15:** భోజ్‌శాల కమాల్ మోలా మసీదు కాంప్లెక్స్ వివాదంలో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన ఉత్తర్వులు వెలువరించింది. ఆ వివాదాస్పద ప్రాంతాన్ని హిందూ ఆలయమేనని న్యాయస్థానం గుర్తించింది. ఈ ప్రదేశంలో హిందూ ఆరాధన కొనసాగింపు ఎన్నడూ నిలిచిపోలేదని మేం గమనించాం పర్మార్ వంశానికి చెందిన రాజా భోజుడితో సంబంధం ఉన్న సంస్కృత విద్యా కేంద్రంగా ఈ వివాదాస్పద ప్రాంతం భోజ్‌శాల ఉండేదని చారిత్రక ఆధారాలు చెబుతున్నట్టు మా పరిశీలనలో తేలిందని మధ్యప్రదేశ్ హైకోర్ట్ ఇండోర్ బెంచ్ పేర్కొంది. భోజ్‌శాలను వాగ్దేవి (సరస్వతీ దేవి)కి అంకితం చేసిన ఆలయంగా హిందువులు పరిగణిస్తుండగా, ముస్లిం వర్గం ఈ కట్టడాన్ని కమల్ మోలా మసీదుగా గుర్తిస్తోంది. జైన సమాజానికి చెందిన ఒక పిటిషనర్ ఈ సముదాయం మధ్యయుగానికి చెందిన జైన ఆలయం, గురుకులమని వాదించారు. 2003 ఏఎస్ఐ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎఎస్ఐ) ఒప్పందం ప్రకారం భోజ్‌శాలలో హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు చేస్తున్నారు. అయితే ఆ ప్రాంగణంలో పూజలు చేసుకునే ప్రత్యేక హక్కులు తమకే కావాలని కోరుతూ హిందూ పక్షం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇది హిందూ ఆలయమేనని గుర్తించింది. విచారణ సమయంలో భారత పురావస్తు విభాగం సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపింది. ఇది ఒకప్పుడు హిందూ ఆలయాల సముదాయమని పేర్కొంది. అంతేకాదు, వాటి శిథిలాలతోనే మసీదు నిర్మాణం జరిగిందని తెలిపింది. రెండేళ్ల కిందట ఏఎస్ఐ 98 రోజులపాటు శాస్త్రీయ సర్వే జరిపి, 2 వేల పేజీలకుపైగా నివేదికను సమర్పించింది. మసీదు నిర్మాణం కంటే ముందే ఆ ప్రాంతంలో భారీ ఆలయం ఉన్నట్లు పలు శిల్పాలు, స్తంభాల శిథిలాలు, శాసనాలు తెలియజేస్తున్నాయని వివరించింది. అవి పర్మార్ రాజవంశం కాలానికి చెందినవని చెప్పింది. ఎఎస్ఐ తన శాస్త్రీయ సర్వేలో కనుగొన్న నాణేలు, శిల్పాలు, శాసనాలు ఈ సముదాయం వాస్తవానికి ఒక దేవాలయం అని నిరూపిస్తున్నాయని హిందూ పక్షం వాదిస్తోంది. ఆ సర్వే నివేదిక పక్షపాతంతో ఉందని, హిందూ పిటిషనర్ల వాదనలకు మద్దతు ఇచ్చేలా తయారు చేశారని ముస్లిం పక్షం కోర్టులో వాదించింది. కానీ హైకోర్టు మాత్రం అది హిందువులకు చెందిన ప్రాంతమేనని నిర్ధారణకు వచ్చింది. ఇక్కడ హిందువులు పూజలు చేయడానికి అనుమతి ఇచ్చిన న్యాయస్థానం, ముస్లింలు నమాజ్ చేయకూడదని ఆదేశించింది. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాతా విగ్రహాన్ని వెనక్కి రప్పించే విషయాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి న్యాయస్థానం సూచించింది. మసీదు ఏర్పాటు కోసం ముస్లింలు కోరితే, వారికి థార్‌లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. ఈ కేసులో వాదనలు పూర్తి కాగా మధ్యప్రదేశ్ హైకోర్టు తుది తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. కోర్టు సెలవులు ముగిసిన తర్వాత తుది తీర్పు వెలువడే అవకాశం ఉందని భోజ్ ఉత్సవ్ సమితి లాయర్ శిరీష్ దూబే అభిప్రాయపడ్డారు.

## చైనాలో పనిచేయని డొనాల్డ్ ట్రంప్ 'సీక్రెట్' కమాండ్



**బీజింగ్, మే 15:** సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఏ దేశానికైనా వెళ్తే.. ఆయన పర్యటించే ప్రాంతం మొత్తాన్ని అగ్రరాజ్య సీక్రెట్ ఏజెంట్లు తమ గుప్పిట్లో ఉంచుకుంటారు. ఆ చోట చీమ చిటుక్కుమనాలన్నా తమ అనుమతి ఉండాల్సిందే అన్న రీతిలో అమెరికా భద్రా సిబ్బంది వ్యవహరిస్తారు. కానీ, చైనాలో మాత్రం వీరి కమాండింగ్ పని చేయలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన వేళ బీజింగ్ భద్రతా సిబ్బంది వీరికి షాకిచ్చారు. ఈ క్రమంలో ఇరు దేశాల భద్రతా సిబ్బంది, జర్నలిస్టుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడం గమనార్హం. అసలేం జరిగిందంటే..

**వైట్‌హౌస్ సిబ్బందిని నెట్టేసి..**

రెండు రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్ వెళ్లిన ట్రంప్.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో గురువారం ద్వైపాక్షికంగా భేటీ అయ్యారు. అయితే, ఈ సమావేశ వేదిక వద్దకు చైనా మీడియా సిబ్బంది దూసుకొచ్చారు. వైట్‌హౌస్ సిబ్బందిని నెట్టుకుంటూ ప్రాంగణం లోపలికి వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనలో అమెరికా సిబ్బందిలో ఒకరు కిందపడటంతో స్వల్ప గాయాలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనిపై అగ్రరాజ్య అధికారులు చైనా వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**టెంపుల్‌లోకి నో ఎంట్రీ..**

ఇక, బీజింగ్‌లోని 'టెంపుల్ ఆఫ్ హెవెన్'ను ఇరు దేశాధినేతలు సందర్శించారు. ఆ సమయంలో యుఎస్ సీక్రెట్ సర్వీస్‌కు చెందిన ఓ ఏజెంట్ వద్ద తుపాకీ ఉందన్న కారణంతో చైనీస్ అధికారులు టెంపుల్ లోపలికి అనుమతించలేదు. ఆయుధాన్ని తమకు ఇచ్చిన తర్వాతే లోపలికి వెళ్లాలని సూచించారు.

ఇందుకు అమెరికా ప్రతినిధులు అంగీకరించకపోవడంతో ఇరువర్గాల మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి.

దాదాపు 30 నిమిషాల తర్వాత మరో సీక్రెట్ సర్వీస్ అధికారిని అనుమతించగా.. గన్‌తో ఉన్న ఆ ఏజెంట్ వెలుపలే ఉండిపోయారు.

# ఖైబర్ ఫక్తూన్‌ఖ్వాలో ఉగ్రదాడి.. 15 మంది సైనికులు మృతి



**పెషావర్, మే 15:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు వరుస షాక్‌లు ఎదురవుతున్నాయి. తాను తవ్వుకున్న గుంతలో తానే పడ్డట్టు అన్న చందంగా పాకిస్థాన్ పరిస్థితి తయారైంది. భారత్‌ను ఎలాగైనా నాశనం చేయాలని కంకణం కట్టుకున్న పాక్ ఉగ్రవాదులకు నిధులు వెచ్చించి మరి పోషిస్తోంది. ఇదే ఉగ్రవాదుల్లోని ఓ వర్గం మాత్రం దాయాదీ దేశానికి చుక్కలు చూపిస్తోంది. వరుస దాడులతో కంటి నిండా నిద్ర లేకుండా చేస్తోంది. తాజాగా పాకిస్థాన్‌లోని బాజౌర్‌లో ఉన్న మిలిటరీ క్యాంపుపై జరిగిన భారీ ఆత్మాహుతి దాడి ఆ దేశ సైన్యాన్ని వణికించింది. ఈ పక్కా ప్లాన్డ్ అటాక్‌లో ప్రాథమిక సమాచారం ప్రకారం కనీసం 15 మంది సైనికులు మరణించారు. ఉగ్రవాదులు ముందుగా సైనిక స్థావరం వద్ద భారీ పేలుడుకు పాల్పడి, ఆ గందరగోళం మధ్యలో ఆయుధాలతో క్యాంపులోకి చొరబడ్డారు. ఈ క్రమంలో సైనికులకు, ఉగ్రవాదులకు మధ్య కొద్దిసేపు భీకర కాల్పులు జరిగాయి.

నిషేధిత ఉగ్రవాద సంస్థ తహ్రీక్‌ఏతాలిబాన్ పాకిస్థాన్ టిటిపి ఈ దాడికి బాధ్యత వహించింది. తమ స్పెషల్ ఇస్తిషాదీ ఫోర్సెస్ ద్వారా ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రకటించింది. 2025 అక్టోబర్‌లో క్వెట్టాలో జరిగిన దాడి తర్వాత, టీటీపీ అధికారికంగా బాధ్యత వహించిన ప్రధాన ఆత్మాహుతి దాడి ఇదే కావడం గమనార్హం. ఖైబర్ పఖ్తున్ఖ్వా ప్రాంత్నంలో కేవలం వారం వ్యవధిలో ఇలాంటి ఆత్మాహుతి దాడి జరగడం ఇది రెండోసారి. అంతకుముందు మంగళవారం లక్కీ మర్వత్ జిల్లాలోని నౌరంగ్ బజార్‌లో పేలుడు పదార్థాలతో నిండిన ఆటో రిక్షాతో జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు, ఒక మహిళ సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ పేలుడు ధాటికి సమీపంలోని దుకాణాలు, వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇక్కడే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మరో దాడిలో ఐదుగురు పోలీసులు, ఇద్దరు పౌరులు మరణించారు. వరుసగా జరుగుతున్న ఈ ఉగ్రదాడులతో బాజౌర్, సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించాయి.

# సుంకాలు రద్దుచేసి టెక్స్‌టైల్ పరిశ్రమను ఆదుకోండి..

## ప్రధానిమోడీకి తమిళనాడు సిఎం విజయ్ లేఖ



**చెన్నై, మే 15:** తమిళనాడులోని టెక్స్‌టైల్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందని, దానిని ఆదుకునేందుకు పత్తిపై ఉన్న 11 శాతం దిగుమతి సుంకాన్ని తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆయన ప్రధానికి శుక్రవారం ఒక లేఖ రాశారు. పత్తి, నూలు ధరలు విపరీతంగా పెరగడంతో రాష్ట్రంలోని టెక్స్‌టైల్ రంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు, దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్, దుస్తుల ఎగుమతి రాష్ట్రం. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది మహిళలు ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఇటీవల పత్తి, నూలు ధరలు పెరగడంతో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దేశీయంగా పత్తి ఉత్పత్తి కొరత, ట్రేడింగ్ కార్యకలాపాలు పెరగడమే ఇందుకు కారణమని విజయ్ తన లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదల వివరాలను ఆయన తన లేఖలో స్పష్టంగా తెలిపారు. గత రెండు నెలల్లోనే పత్తి ధర 25 శాతం పెరిగింది. ఒక క్యాండీ (సుమారు 356 కిలోలు) ధర రూ. 54,700 నుంచి రూ. 67,700కు చేరింది. అదే సమయంలో నూలు ధర కిలోకు రూ. 301 నుంచి రూ. 330కి పెరిగింది. ఈ పరిస్థితుల్లో ముడిసరుకు కోసం దిగుమతులే ఏకైక మార్గం. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం ఉండటం అవరోధంగా మారిందని విజయ్ వివరించారు. వ్యవసాయం తర్వాత రాష్ట్రంలో అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం టెక్స్‌టైల్ అని గుర్తుచేసిన విజయ్, ఈ పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దిగుమతి సుంకాన్ని పూర్తిగా తగ్గిస్తే, పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల పెరుగుతున్న ఎగుమతి ఆర్డర్లను అందుకోవడమే కాకుండా ప్రపంచ మార్కెట్లో మన పరిశ్రమ పోటీతత్వాన్ని నిలబెట్టుకోగలుగుతుంది. తద్వారా లక్షలాది ఉద్యోగాలను కాపాడవచ్చని ఆయన అభ్యర్థించారు. ఈ విషయంలో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు.

## అవును నిజమే.. అయితే నాపాలనలో కాదు!

### అమెరికా క్షీణిస్తోందన్న జిన్‌పింగ్ వ్యాఖ్యలపై ట్రంప్ కౌంటర్

**వాషింగ్టన్, మే 15:** డోనాల్డ్ ట్రంప్ తన చైనా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆదేశస్తుల్లో చర్చకు దారితీసాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాను క్షీణిస్తున్న దేశం"గా పేర్కొన్న విషయంపై స్పందించిన ట్రంప్ ఆ వ్యాఖ్య 100 సరైనదేనని అన్నారు. ఆ వ్యాఖ్యలు తన పాలనకు కాకుండా మాజీ అధ్యక్షుడు జో బిడెన్ హయాంలోని పరిస్థితులకు సంబంధించినవని స్పష్టం చేశారు. ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో ట్రంప్ బైడెన్ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో అమెరికా తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఓపెన్ బోర్డర్స్, అధిక పన్నులు, తప్పు వాణిజ్య ఒప్పందాలు, పెరుగుతున్న నేరాలు, విదేశీ విధానాలు వంటి అంశాలు దేశాన్ని బలహీనపరిచాయని ఆరోపించారు. తన పాలనలో అమెరికా మళ్లీ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదిగిందని ట్రంప్ పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయని, ఉద్యోగావకాశాలు భారీగా పెరిగాయని, విదేశీ పెట్టుబడులు ట్రిలియన్ల డాలర్లుగా అమెరికాలోకి వస్తున్నాయని తెలిపారు. సైనిక రంగంలోనూ అమెరికా బలంగా నిలిచిందని, ఇరాన్‌పై విజయం సాధించామని ఆయన వ్యాఖ్యానించారు. వెనిజులాతో సంబంధాలు మెరుగుపడ్డాయని కూడా ట్రంప్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం అమెరికా నిజంగానే క్షీణించిన దేశంగా ఉండేది. ఆ విషయంలో జిన్‌పింగ్‌తో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. కానీ ఇప్పుడు అమెరికా ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదిగిన దేశంగా మారిందని ట్రంప్ తెలిపారు. ఇక భవిష్యత్తులో అమెరికాచైనా సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంక్షిప్తంగా..

## అదృశ్య హంతకుల చేతిలో లష్కరే టాప్ కమాండర్ హతం

**క్వెట్టా, మే 15:** పాకిస్తాన్‌లో మరోసారి గుర్తుతెలియని వ్యక్తుల హల్చల్ చేశారు. ఉగ్రవాద నాయకుడిపై మరోసారి టార్గెటెడ్ అటాక్ జరిగింది. ఆ దేశంలోని బలూచిస్తాన్ ప్రావిన్సులో అజ్ఞాత వ్యక్తుల చేతిలో లష్కరే తోయిబా ఉగ్రసంస్థ సీనియర్ కమాండర్ మీర్ శుక్ర ఖాన్ రైసాని హతమయ్యాడు. ఇటీవల కాలంలో లష్కరేకు చెందిన పెద్ద తలకాయలను గుర్తుతెలియని వ్యక్తులు టార్గెట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఏ ప్రావిన్సులో ఉన్నా కూడా వెతికి మరి చంపుతున్నారు. తాజాగా జరిగిన సంఘటన బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాలో జరిగింది. ఒక లష్కరే తోయిబా కార్యక్రమంలో పాల్గొన్న కొద్దిసేపటికే రైసాని అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ దాడిపై పాకిస్తాన్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## అక్రమ వలసలు ప్రోత్సహించిన ఇండియన్‌పై అమెరికా విచారణ

**న్యూయార్కు, మే 15:** కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా మనుషులను తరలిస్తున్న స్మగ్లింగ్ రాకెట్‌లో తన ప్రమేయం ఉన్నట్లు 22 ఏళ్ల భారత యువకుడు అంగీకరించాడు. శివమ్ అనే ఈ యువకుడు, భారతీయులతో పాటు ఇతర దేశస్థులను అక్రమంగా యూఎస్‌కెనడా సరిహద్దు దాటించడంలో కీలక పాత్ర పోషించినట్లు అమెరికా న్యాయ విభాగం వెల్లడించింది. ఆర్థిక లబ్ధి కోసమే ఈ నేరానికి పాల్పడినట్లు అతను ఒప్పుకునాడు. కోర్టు పత్రాల ప్రకారం 2024 అక్టోబర్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో ఈ స్మగ్లింగ్ కార్యకలాపాలు సాగాయి. కెనడా సరిహద్దుల వద్దకు చేరుకున్న వలసదారులను పికప్ చేసుకుని, వారిని ఉత్తర న్యూయార్క్‌లోని రహస్య ప్రదేశాలకు (స్టాష్ హౌస్‌లు), ప్లాట్స్‌బర్గ్‌లోని హోటళ్లకు తరలించడం కోసం డ్రైవర్లను ఏర్పాటు చేయడమే శివమ్ పని. ఇలా ఒక్కో వ్యక్తిని తరలించినందుకు డ్రైవర్లకు అతను డబ్బు చెల్లించేవాడు. ఈ మొత్తం వ్యవహారంలో తన పాత్రకు గాను అతను కూడా పెద్ద మొత్తంలో డబ్బు ఆశించాడు.

## ప్రియుడితో వెళ్లిపోయేందుకు సొంత ఇంటికే కూతురు కన్నం

**మొరాదాబాద్, మే 15:** ప్రేమించిన వాడితో కలిసి కొత్త జీవితం ప్రారంభించేందుకు సొంత ఇంటికే కన్నం వేసిందో కూతురు. ప్రియుడు, అతడి స్నేహితులతో కలిసి సొంత ఇంట్లోనే కోటి రూపాయలకు పైగా దోపిడీకి పాల్పడింది. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జరిగిన ఈ ఘటనలో వ్యాపారి కూతురు, ఆమె ప్రియుడు సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొరాదాబాద్‌కు చెందిన ఇత్తడి వ్యాపారి మహమ్మద్ ఇమ్రాన్ ఇంట్లో మే 11న తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ దోపిడీ జరిగింది. సాయుధులైన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను తుపాకీతో బెదిరించి బందీలుగా చేశారు. అనంతరం ఇంట్లో ఉన్న సుమారు రూ.1.2 కోట్ల నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. వెళ్తూ వెళ్తూ ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌ను కూడా తమ వెంట తీసుకెళ్లారు.

## హిందువులకు కాదు హిందూత్వానికి వ్యతిరేకం:ఉదయనిధి



**చెన్నై, మే 15:** సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ గతంనుంచి చేసిన వ్యాఖ్యలపై తాజాగా గురువారం స్పష్టత ఇచ్చారు. సనాతన విధానాలను నిర్మూలించడం అంటే ప్రజలు గుడికి వెళ్లకూడదని కాదు అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఇవ్వాలని, ఆలయాల్లోనే కాదు, యావత్ సమాజంలో సమానత్వం పాటించాలన్నారు. అసెంబ్లీలో మాట్లాడిన తన ప్రసంగంపై వస్తున్న విమర్శలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. ప్రజలను విభజిస్తున్న సనాతన ధర్మాన్ని నాశనం చేయాలన్నది తన ఉద్దేశమన్నారు. అయితే తనపై వస్తున్న విమర్శలకు తలొగ్గేది లేదన్నారు. హిందువులకు కాదు, హిందుత్వకు వ్యతిరేకం అన్నారు.

## ఆర్జీకర్ హత్యాచారం కేసులో ముగ్గురు పోలీస్ అధికారులపై వేటు!

**కోల్‌కత్తా, మే 15:** పశ్చిమ బెంగాల్‌లోని ఆర్జీకర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మమత హయాంలో జరిగిన ఈ కేసు విచారణపై ఇప్పుడు బెంగాల్‌లోని బీజేపీ సర్కార్ దృష్టిపెట్టింది. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తప్పుదోవపట్టించడం వంటివి చేసినందుకు ముగ్గురు పోలీసు అధికారులపై సీఎం సువేందు అధికారి వేటు వేశారు. నబ్బానాలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సువేందు అధికారి ఈ విషయంపై ప్రకటన చేశారు. ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించారు. వినీత్ గోయల్ (కోల్‌కతా పోలీస్ కమిషనర్)తోపాటు అభిషేక్ గుప్తా, ఇందిరా ముఖోపాధ్యాయ్ అనే ముగ్గురిని సస్పెండ్ చేశారు.

# పాక్ మధ్యవర్తిత్వాన్ని అమెరికా విశ్వసించడంలేదు - భారత్ ముందుకు రావాలి: రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్

**న్యూఢిల్లీ, మే 15:** న్యూఢిల్లీ వేదికగా బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు సమావేశంలో రష్య విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలలో భారతదేశం ఒక ధీర్ఘకాలిక మధ్యవర్తి పాత్ర పోషించగలదని రష్యా విదేశాంగ మంత్రి అన్నారు. ప్రస్తుతం, ఇరాన్ యుద్ధంలో పాకిస్తాన్ మధ్యవర్తి పాత్ర పోషిస్తోంది. పాకిస్తాన్ చేసిన మధ్యవర్తిత్వం ఫలితాలను ఇవ్వలేదు. పాక్ అమెరికా ప్రతిపాదనల్ని తమ ముందు పెడుతోందని, తమ ప్రతిపాదనల్ని పట్టించుకోవడం లేదని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదన కీలకంగా మారింది. సమస్యలను పరిష్కరించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరిపేందుకు పాకిస్తాన్ ప్రస్తుతం సహాయం చేయవచ్చు. అయితే దీర్ఘకాలిక మధ్యవర్తి అవసరమైతే సుదీర్ఘ దౌత్య అనుభవం ఉన్న భారత్ ఆ పాత్ర పోషించగలద్దు అని రష్యా మంత్రి అన్నారు. అయితే, లావ్రోవ్ చేసిన ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్‌కు చికాకు తెప్పించవచ్చు. పాక్ మధ్యవర్తిత్వంపై ఇజ్రాయిల్, యూఏఈ, ఇరాన్ కూడా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇటీవల పాక్ మధ్యవర్తిత్వాన్ని తాము విశ్వసించడం లేదని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల నుంచి ఇరాన్ తన సైనిక విమానాలను రక్షించుకోవడానికి పాక్ సహాయం చేసిందని, పాకిస్తాన్‌లోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌లో ఇరాన్ విమానాలు ఉంచడానికి అనుమతించిందని అమెరికన్ మీడియా పేర్కొంది. ఇదే సమయంలో భారత్‌కు అటు అమెరికా, ఇటు ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతోనే రష్యా ఈ ప్రతిపాదన చేసి ఉంటుందన్న అంచనాలు వెల్లడి అయ్యాయి.



16-5Pg6exHMNWJQE.qxd:16-5Pg6exHMNWJQE.qxd 1/1/02 7:38 AM Page 1





## మంగంపేట బెరైటీస్‌ను సంరక్షించాలి

**తిరుపతి, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఖనిజం ప్రజల సంపద అని, దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని అఖిలపక్ష నేతలు పిలుపు నిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఖనిజ సంపద మంగంపేట బెరైటీస్‌ను కాపాడుకోవాలని జరుగుతున్న ఉద్యమంపై నిర్బంధాన్ని నిరసిస్తూ తిరుపతి యశోదా నగర్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు నేత ఎస్. జయచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంగంపేట బరైటీస్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కందారపు మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కాంగ్రెస్ నేత, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మాంగాటి గోపాలరెడ్డి, వైయస్సార్సీపి నాయకులు వాసూ యాదవ్, గోపాల్ రెడ్డి, పసుపులేటి సురేష్, స్థానిక హక్కుల పోరాట సమితి కన్వీనర్ డిఎంసి భాస్కర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శి కే గుణశేఖర్, టిటిడి కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్ధూ, ప్రభాకర్, ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు జి బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి ఇఎస్ కుమార్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్. లక్ష్మి స్విమ్స్ ఆసుపత్రి ఉద్యోగ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కే.వేణుగోపాల్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వాణిశ్రీ, తిరుపతి జిల్లా తోపుడుబండ్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి బుజ్జి, ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డి శ్రీనివాసులు, ఏపీ ఆటో అండ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థను పరిరక్షి ంచమని పోరాడుతున్న వారికి మద్దతు పలకాల్సింది పోయి ఖనిజాన్ని లూటీ చేస్తున్న వారికి అండగా నిలబడటం దారుణమని, పోరాడుతున్న వారిపై స్వయంగా ప్రభుత్వమే నిర్బంధానికి పాల్పడటంపై నేతలు తీవ్ర విమర్శలు చేశారు.

## తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యం

● శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి రూరల్, మే 15 ప్రభాతవార్త:** టిటిడిలో కరుణాకర్‌రెడ్డి హయాంలో జరిగిన పాపాలను ప్రక్షాళన చేస్తూ పవిత్రను కాపాడటమే కూటమి లక్ష్యంగా పని చేస్తున్నామని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఊరందూరు గ్రామం లోని తన స్వగృహంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిటిడి బోర్డు చైర్మన్‌గా ఉంటూ స్వామి వారి సన్నిధిని రాజకీయ పునరావాస కేంద్రంగా దోపిడి అడ్డాగా మార్చిన భూమన కరుణాకర్‌రెడ్డి నేడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడటం హాస్యాస్పందం అన్నారు. 2019 శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి కోట్లాది రూపాయలు భక్తుల సొమ్ములను ఎక్కడికక్కడ దారి మళ్ళించారో భూమన, సుబ్బారెడ్డి ముఠా సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేసారు. పవిత్రమైన వెంకటేశ్వరస్వామి దర్శన టిక్కెట్లును సినిమా బ్లాక్ టిక్కెట్లు లా అమ్ముకొని భక్తుల మనోభావాలతో ఆడుకున్న చరిత్ర వైసిపి నేతలదన్నారు. రూ.11వేలు వెచ్చించి శ్రీవాణి టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులనురూ.300 వైన్లలో పంపి అవమానించినపుడు మీ ఐటి పరిజ్ఞానం ఏమైందని సుదీర్‌రెడ్డి ప్రశ్నించారు. కేవలం టిక్కెట్లు కాదు చివరకు శ్రీవారి తులాభారంలోపే అవకతవకలకు పాల్పడిన స్వామి వారి సొమ్మును మేసిన ఘనత వైకాపా వారిది కాదా? ఇంత పాపం చేసి ఈ రోజు సిగ్గు లేకుండా ఆ నెపాన్ని కూటమి ప్రభుత్వంపై నెట్టాలని చూడటం వారి నైజం మారదా? అని ప్రశ్నించారు. టిటిడిలో జరిగిన ఆక్రమాలపై అధికార దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరుగుతుంటే వైసిపి ముఠా ఎందుకు ఉలిక్కి పడుతుందని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు.



## ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

**బొబ్బిలి (విజయనగరం జిల్లా), మే 15 ప్రభాతవార్త:** సువర్ణముఖీ నది నుంచి బొబ్బిలికి త్రాగునీటి పైపులైను పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయనకు పబ్లిక్ హెల్త్ మరియు మున్సిపల్ అధికారులు తెలిపారు. రూ.133.32 కోట్లతో పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా చేయనున్నారు. పట్టణ పరిధిలో నాలుగు నూతన రిజర్వాయర్లను నిర్మించి, నీటి సరఫరా చేయనున్నారు. బొబ్బిలి పట్టణ ప్రజలకు ఎప్పటినుంచో ఉన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికై శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణని కలిసి గతంలో మంజూరైన ప్రాజెక్టును గురించి వివరించి, బొబ్బిలి పట్టణంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సహకరించాలని కోరగా, వారు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి మరల ఆ ప్రాజెక్టును పునఃప్రారంభించి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందించడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూ.133.32 కోట్లతో ఈ త్రాగునీటి ప్రాజెక్టును మళ్లీ ప్రారంభించారు. యుఐడిఎఫ్ స్కీము (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద చేపట్టనున్న ఈ ప్రాజెక్టును ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ వారు త్వరలోనే ప్రారంభించనున్నారని, ప్రాజెక్టులో భాగంగా సువర్ణముఖీ నది నుంచి బొబ్బిలికి పైపులైన్లు వేసి, పట్టణ పరిధిలో నాలుగు నూతన రిజర్వాయర్లను నిర్మించి, ప్రతి ఇంటికి త్రాగు నీటిని అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పబ్లిక్ హెల్త్ ఈఈ ఎస్.జ్యోతి, మున్సిపల్ కమీషనర్ ఎల్.రామలక్ష్మి, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# సైబర్ నేరాలపై ఉక్కుపాదం!

● సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు ● సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ముందంజ

● "ఎపి సైబర్ గార్డ్" ఆపరేషనల్ ప్లాన్, సైబర్ క్రైమ్ నియంత్రణపై డిజిపి హరీష్‌కుమార్ గుప్తా సమీక్ష

**విజయవాడ, మే 15 ప్రభాతవార్తప్రతినిధి:** పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉద్ఘాటించారు. ఏపీ సైబర్ గార్డ్" ఆపరేషనల్ ప్లాన్‌తో పాటు సైబర్ క్రైమ్ నిర్వహణ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎప్పటికప్పుడు ముందంజలో ఉందన్నారు. అయితే ఇటీవలి కాలంలో సైబర్ నేరాల పరిమాణం, సాంకేతిక నైపుణ్యం, ఆర్థిక ప్రభావం పరంగా భారీగా పెరిగాయని పేర్కొన్నారు. దీంతో సైబర్ నేరాల నియంత్రణ వ్యవస్థను అత్యవసరంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. పోలీస్ శాఖ, ఐటీ శాఖ, ఇతర అనుబంధ సంస్థలతో విస్తృత చర్చల అనంతరం 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సైబర్ నేరాల నియంత్రణ బాధ్యత కేవలం ప్రత్యేక విభాగాలకే పరిమితం కాకూడదని, ప్రతి జిల్లా పోలీస్ యంత్రాంగం చురుకుగా పని చేయాలని డీజీపీ స్పష్టం చేశారు. సైబర్ మోసాల బాధితులకు తక్షణ సహాయం అందించడంలో "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని పేర్కొన్నారు. 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు వచ్చిన తొలి 30 నిమిషాల్లో చర్యలు చేపడితే నష్టపోయిన డబ్బు రికవరీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల సైబర్ వార్‌రూమ్ ఏర్పాటు,



1930 హెల్ప్‌లైన్‌ను బ్యాంకుల రియల్‌టైమ్ అలర్ట్ వ్యవస్థతో అనుసంధానం, ఏఐ ఆధారిత సైబర్ మానిటరింగ్ వ్యవస్థలు, తొలి దశలో 500 మంది అధికారులకు ప్రత్యేక శిక్షణ, జిల్లా స్థాయి యూనిట్లు–హబ్‌లతో మూడు స్థాయిల సైబర్ రెస్పాన్స్ వ్యవస్థ, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు వంటి ఆరు ప్రధాన అంశాలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని సీసీఎస్‌లు, పోలీస్ స్టేషన్ల ప్రస్తుత పనితీరును సమీక్షించి, ఆధునిక నేరాలు, శాంతిభద్రతల సవాళ్లకు అనుగుణంగా మార్పులు తీసుకురావాలని అన్ని యూనిట్, రేంజ్ అధికారులను డీజీపీ ఆదేశించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సంస్థలు, పాలనా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దూషణలు, అసభ్యకర ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్రవ్యాప్తంగా కఠిన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ సమావేశంలోనే ఆదేశించారు. ఇటీవలి కాలంలో కొందరు వ్యవస్థీకృతంగా నకిలీ ఖాతాలు, ట్రోల్స్ చేయడం ద్వారా అసత్య ప్రచారం, మార్ఫింగ్ చిత్రాలు, వ్యక్తిత్వ హననం, సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారని పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించింది. ఇవి సోషల్ మీడియా దుర్వినియోగం కాదని, ప్రజా శాంతి భద్రతలు, సంస్థల విశ్వసనీయత, ప్రజాస్వామ్య వ్యవస్థపై దుష్ప్రభావం చూపే చర్యలని డీజీపీ పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పాలుపంచుకుంటున్న వ్యక్తులను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు, సైబర్ సెల్స్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ సర్వైలెన్స్ బృందాలు, జిల్లా క్రైమ్ టీమ్స్‌ను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద ఖాతాలు, వ్యక్తులపై ఇంటెలిజెన్స్ మ్యాపింగ్ చేపట్టి, వారి క్రిమినల్ నేపథ్యం, రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లు, సైబర్ నేరాల రికార్డులు, అంతర్రాష్ట్ర నేర సంబంధాలను పరిశీలించాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం వ్యాప్తి, క్రిమినల్ బెదిరింపులు, ద్వేషపూరిత ప్రసంగాలు, అశ్లీల ప్రచారం, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం తదితర చట్టాల కింద కఠిన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, రేంజ్ అధికారులు, టెక్నికల్ సర్వీసెస్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ భక్తులకు మరిన్ని సదుపాయాలు

● ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె. శీనా నాయక్



**ఇంద్రకీలాద్రి, మే 15 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై భక్తుల సౌకర్యాలు పరిశుభ్రతపై ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె. శీనా నాయక్ సమీక్ష నిర్వహించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ సంయుక్తంగా నిర్వహించిన సమీక్షలో ఇంజినీరింగ్ శానిటేషన్, ప్రధాన విభాగాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు సూపరింటెండెంట్లను ఉద్దేశించి ఇఒ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి ముఖద్వారం అయిన దుర్గా ఘాట్ (స్నానాల రేవు) నుండి కనకదుర్గ నగర్, ఘాట్ రోడ్డు, మహా మండపం సహా ఆలయ ప్రాంగణమంతా అత్యంత శుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘాట్ రోడ్డు టోల్ గేట్ నుండి ఓం టర్నింగ్ వరకు రోడ్డు బలోపేత పనులు చేపట్టాలని, ఈ పనుల నిమిత్తం కొన్ని రోజుల పాటు ఘాట్ రోడ్డును మూసివేసే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కనకదుర్గ నగర్‌లో మౌలిక వసతులను మరింత పెంపొందించాలని సూచించారు. ప్రతి ఇంజినీరింగ్ అధికారి క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని ఈవో స్పష్టం చేశారు. భక్తులకు అందించే అన్నప్రసాదాల నాణ్యతను మరింత పెంచాలని, అత్యంత శుచిగా, రుచికరంగా భోజనం అందించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా అన్ని ప్రాంతాల్లో భక్తులకు నిరంతరం తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఇఒ శీనా నాయక్ ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**భక్తుల రద్దీ:** కనకదుర్గమ్మ దేవస్థానానికి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి కాలం దృష్ట్యా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో, ఉదయం నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు భక్తుల రద్దీ అత్యధికంగా కొనసాగింది. అయితే, మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత ఎండ తీవ్రత పెరగడంతో భక్తుల తాకిడి క్రమంగా తగ్గింది. ఉదయం 10:30 గంటలకు అంతరాలయ దర్శనాన్ని నిలిపివేసి తిరిగి మధ్యాహ్నం 1:40 గంటలకు పునఃప్రారంభించారు. ఇఒ స్వయంగా ఆలయ క్యూలైన్లను సందర్శించి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, దర్శనం సజావుగా సాగేలా చూడాలని సిబ్బందికి "పక్కా ఆదేశాలు జారీ చేశారు.

**నృత్య నీరాజనం:** ఇంద్రకీలాద్రిపై శుక్రవారం సాయంత్రం జరిగిన ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది. రామచంద్రాపురంకు చెందిన శ్రీ లలిత కూచిపూడి నాట్యాలయంకు చెందిన ఆచార్యులు వి లలిత నాయుడు ఆధ్వర్యంలో కళాకారులు అయిగిరి నందిని ప్రదర్శనలో అమ్మవారి ఉగ్రరూపాన్ని నవదుర్గలు ప్రదర్శనలో దేవి నవ రూపాలు, అష్టలక్ష్మి నృత్యం, నరసింహా కౌతంకు ప్రదర్శించిన కూచిపూడి మరియు భరతనాట్య ముద్రలు అలరించాయి. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను సత్కరించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడ గూఢవల్లికి చెందిన జి రామమోహనరావు దంపతులు కుటుంబ సభ్యుల అందరి తరపున రూ.1లక్ష విరాళాన్ని శుక్రవారం అందజేశారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనంతో పాటు ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



మ్యూజియం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

## అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవానికి ప్రత్యేక కార్యక్రమాలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

**విజయవాడ, మే 15 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా విజయవాడలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. రాజధాని అమరావతికి గేట్‌వేగా ఉన్న విజయవాడలో ఇటీవల పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 18వతేదీ అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా విజయవాడలోని బాపు మ్యూజియంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మ్యూజియం సందర్శనకు వచ్చే సందర్శకులను ఉచితంగా అనుమతిస్తామని కలెక్టర్ తెలిపారు. ఉదయం నుండి ప్రత్యేక చర్చలు, గైడెడ్ మ్యూజియం టూర్, విజయవాడ హెరిటేజ్ క్విజ్, దేశభక్తిని పెంపొందించేలా లేజర్‌షో, హెరిటేజ్ ఫోటోగ్రఫీ హంట్, పెయింటింగ్ పోటీలు నిర్వహించటంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం అధికారులతో సమీక్షా నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**ప్రజలకు చేరువగా పిజిఆర్ఎస్:** ప్రజల నుండి అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతి శుక్రవారం నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. శుక్రవారం మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జేసి ఇలక్కియాతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయికి శ్రీకాళహస్తి ఆలయం సారె సమర్పణ

**బుచ్చి (నెల్లూరు), మే 15, ప్రభాతవార్త:** బుచ్చి మే 15 ప్రభాతవార్త శ్రీవార్ల వార్షిక బ్రహ్మోత్సవ మహోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం దక్షణ కైలాసం, పంచభూత లింగ క్షేత్రాలలో ఒకటైన శ్రీ జ్ఞాన ప్రసూనంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్దానం నుండి జొన్నవాడ మల్లికార్జున స్వామి కామాక్షితాయికి (పట్టు వస్త్రాలు) సమర్పణ కార్యక్రమం లాంచనాలతో వైభవంగా నిర్వహించారు కాళహస్తి దేవస్దానం నుండి తీసుకొని వచ్చి పట్టు వస్త్రాలకు ఆలయ అధికారులు, అర్చకులు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. భక్తుల జైజై ద్వానాల మధ్య ప్రత్యేక ఉరేగింపుగా సారెను ఆలయానికి తీసుకొని వచ్చి స్వామి అమ్మవారికి సమర్పించారు. ఈకార్యక్రమంలో స్దానిక శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని సారెను తలపై పెట్టుకొని ఆలయంలోకి తీసుకొని వచ్చారు. అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్యభూమి శ్రీనివాసులు రెడ్డి, ట్రస్టు బోర్డు మెంబర్లు నక్కల శివకృష్ణ, తిరువాయి పాటి నందకుమార్, పెన్నత్తూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మి. పాలూరు చాముండేశ్వరీ, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూషా, ముంగ సుధాకర్, రామయాణం సుధారాణి, కొల్లపూడి శారద, వివిఎస్ జి.గంగాప్రసాద్ ఎక్స్ అఫీషియా సభ్యులు పర్యవేక్షించారు. శ్రీకాళహస్తి దేవస్దానం నుండి కార్యనిర్వహణాధికారి బి కె వెంకటేశ్వర్లు, ఉప కార్యనిర్వహణ అధికారి ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు అర్చకులు, వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీవారి దర్శనం పేరుతో మోసం... ఒకరి అరెస్టు

**తిరుమల, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్ ద్వారా టి.టి.డి ఉద్యోగిగా పరిచయం చేసుకుని భక్తులను దర్శనాల పేరుతో మోసం చేస్తున్న నిందితుడ్ని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదిదారుల నుండి రూ.65 వేలు తీసుకుని ఆ తరువాత దర్శనం టికెట్లు ఇవ్వకుండా మోసం చేశాడు. నిందితుడి వద్ద నుండి తిరుమల 2టౌన్ పోలీసులు రూ.45వేల నగదు, మొబైల్ ఫోన్, బ్యాంక్ పాస్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా పెద్దకూరపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన బొడపాటి నవీన్ చౌదరి (33) సామాజిక మాధ్యమం ద్వారా, ఫోన్ కాల్స్‌తో తనను టి.టి.డి ఉద్యోగిగా పరిచయం చేసుకుని, ఉద్యోగుల కోటాలో శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించాడు. ఇలా హైదరాబాద్‌కు చెందిన ఓ మీడియా సంస్థలో పనిచేస్తున్న సూర్యకళను నమ్మించాడు. ఈ సంవత్సరం మార్చి నెలలో ఆరుగురికి శ్రీవాణి దర్శనం టికెట్లు ఏర్పాటు చేస్తానని చెప్పి పలు దఫాలుగా డిజిటల్ విధానంలో రూ.47 వేలు నగదు, భక్తులు తిరుమలకు వచ్చిన తరువాత మళ్ళీ రూ.18వేలు నగదు తీసుకున్నాడు. డబ్బులు తీసుకున్నా ఎటువంటి దర్శనం టికెట్లు ఏర్పాటు చేయకుండా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితుడి వద్ద నుండి రూ.45 వేల నగదు, రెండు బ్యాంక్ పాస్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా దాదాపు రూ.10 లక్షలకు పైగా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నిందితుడిపై 2021 నుండి 2026 మధ్య గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలలో నాలుగు చీటింగ్ కేసులు నమోదై విచారణ ఎదుర్కొంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.



## గరుడ వారధి ఫ్లైఓవర్ నుంచి కిందపడి యువతి ఆత్మహత్య

**తిరుపతి, మే 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతినగరంలో యాత్రికుల సౌలభ్యంకోసం నిర్మితమైన గరుడవారధి పైనుండి క్రిందపడి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ప్రమాదవశాత్తు జరిగినట్లు తెలుస్తున్నా యువతి క్రిందపడటంతో తలకు బలమైన గాయాలై ప్రాణాలు కోల్పోయింది. తిరుపతిలో కరకంబాడి మారనగం వైపు నుండి లీల మహల్ సర్కిల్ వైపు వస్తున్న ఫ్లైఓవర్ పై ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా పాయమంచాలకు చెందిన ఆదిలక్షి ్మ(24)గా పోలీసులు గుర్తించారు. తిరుపతికి వలస వచ్చిన సోదరుడు అన్నాసాములు, చెల్లెలు ఆదిలక్ష్మి ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. తూర్పు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## తల్లిని హత్య చేసిన కొడుకు అరెస్టు

**రాజాం (విజయనగరం జిల్లా), మే 15 ప్రభాతవార్త:** రాజాం పట్టణం డోలపేటకు చెందిన ముంజేటి స్పందన హత్య కేసును ఛేధించి ఇద్దరు నిందితులను పట్టుకోవడం జరిగిందని చీపురుపల్లి డిఎస్పీ రాఘవులు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో డోలపేటలో జరిగిన స్పందన అనే మహిళను కిరాతకంగా హతమార్చిన ఇద్దరు స్నేహితులను తిరుపతిలో పట్టుకున్నామని తెలిపారు. అదేవిధంగా హత్యకు గురైన స్పందన తన కుమారుడే హత్య చేశాడని తెలిపారు. కుమారుడు తమ ప్రవర్తనను మార్చుకోవాలని తల్లి స్పందన మందలించడంతో, కుమారుడు తల్లిని హత్య చేయడానికి పూనుకున్నాడు. ఈ తరుణంలో ఇంటిలో ఎవరూలేని సమయంలో తనకు క్రికెట్ ఆటలో పరిచయమైన మరొక స్నేహితులతో తల్లిని కిరాతకంగా హతమార్చి చెరువులో పడి వేసారని తెలిపారు. అదేవిధంగా హత్య చేసిన అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, డబ్బు ఇద్దరు స్నేహితులు కలిసి ముంబై, విశాఖపట్నం తిరుగుతూ చివరికి తిరుపతిలో పట్టు పడ్డారని తెలిపారు. ఈ విధంగా హత్యలు జరుగుతుండడంతో ఇంట్లో తల్లిదండ్రులు పిల్లల ప్రతి విషయంలో జాగ్రత్త వహించవలసిందిగా డిఎస్పీ సూచించారు.

# ట్రావెల్స్ బస్ దగ్ధం.. ప్రయాణికులు సురక్షితం



**ఉలవపాడు, మే 15 ప్రభాతవార్త:** వెనుక టైరు పేలడంతో సంభవించిన ప్రమాదం.. డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం.. జాతీయ రహదారిపై కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. హైదరాబాదు నుండి 36 మంది ప్రయాణికులతో తిరుపతి వెళుతున్న ఈ బస్సు ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం చాగొల్లు మధ్య శుక్రవారం తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో బస్సు వెనుక టైరు పేలి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపి ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించారు. అనంతరం మంటలు చెలరేగిన చక్రాల వద్ద అదుపు చేసేందుకు డ్రైవర్లతోపాటు ప్రయాణికులు కూడా ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా విఫలమవడంతో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటి లోనే బస్సును వ్యాపించాయి. సమాచారం అందు కున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బస్సు అగ్నికి ఆహుతి అయింది. ఈ విష యం తెలుసుకున్న కందుకూరు సిఐ అన్వర్ భాష, ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు, కందుకూరు ఎస్ఐ బాలకృష్ణ, ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించడంతోపాటు ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కందుకూరు ఆర్టీవో నాగలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బస్సుకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నట్లు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను విచారిస్తున్నట్లు తెలిపారు.

## కుమార్తెను బావిలో పడేసిన కన్నతండ్రి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 15 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై ఉన్న కక్షతో కన్నకూతురిని బావిలోకి పడేసి ప్రాణాలు తీసేశాడుఓ కసాయి తండ్రి. వివరాల్లోకి వెళ్తే గాదరాడ గ్రామానికి చెందిన రామవరపు రాజు, నీలిమ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగు తున్నాయి. ఈ క్రమంలో భార్యపై కోపంతో రాజు తన రెండో కుమార్తె లహరిని(4) తీసుకువెళ్లి ఇంటి పక్కనే ఉన్న బావిలో పడేశాడు. నీటిలో మునిగి ఊపిరాడక చిన్నారి లహరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షి ంచారు. చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతోగాదరాడలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# జీవీఎంసీ అభివృద్ధి పనులపై ఉన్నత స్థాయి సమీక్ష

8 లో

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
శనివారం 16, మే 2026



# విశాఖలో పర్యాటక అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

## కొత్త టూరిజం సర్క్యూట్లు, ట్రెక్కింగ్ మార్గాల అభివృద్ధికి చర్యలు



8లో

# వేటకు విరామంతో మత్స్యకారులు ఆకలి కేకలు...

- మెకనైజ్డ్ బోట్లకు విరామంతో ఉపాధి కోల్పోయిన వేలాది కుటుంబాలు
- సంప్రదాయ పడవలతో సముద్రంలోకి వెళ్లినా దొరకని మత్స్యసంపద



8వ పేజీలో

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్

నిర్మాణ పనులను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



వార్త 8లో

# ముందస్తుగా మాన్సూన్ ఎంట్రీ.. రైతుల్లో ఆనందం

8వ పేజీలో



# వాహన శ్రేణికి బ్రేక్...

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు నా దేశం - నా బాధ్యత విధానం అమలులో ప్రజా ప్రతినిధులు ముందుంటున్నారు. అందులో భాగంగానే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన వాహన శ్రేణికి బ్రేక్ ఇచ్చారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకునే క్రమంలో ఈవీ వాహన వాడకానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో పొదుపు చర్యలు అవశ్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ పొదుపు బాట పట్టాలన్నారు.

## ఈవీ లో గంటా



# 22న నర్సీపట్నంలో టీడీపీ పార్లమెంట్ మినీ మహానాడు



- నర్సీపట్నం స్టార్ హోమ్స్ కన్వెన్షన్ హాల్ లో భారీ ఏర్పాట్లు..
- పసుపు దుస్తులతో పండుగ వాతావరణంలో తరలిరావాలని పిలుపునిచ్చిన జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబు..
- 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గాల వారీగా మహానాడుల నిర్వహణ

(వార్త 8వ పేజీలో)

# ఏయూఈఈటి - 2026 ఫలితాలు విడుదల



8లో

# 1700 కోట్ల నకిలీ బిల్లుల స్కాం నిందితుడు అరెస్టు



విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

నకిలీ బిల్లులతో భారీ జీఎస్టీ మోసం చేసిన వ్యక్తులను విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. పలు రాష్ట్రాలకు విస్తరించిన నకిలీ ఇన్‌వాయిస్‌ల సిండికేట్ ద్వారా సుమారు రూ.1700 కోట్ల మేర బోగస్ లావాదేవీలు జరిగినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆదిరెడ్డి అలియాస్ అంజిరెడ్డిని అధికారులు అరెస్టు చేశారు. కొంతకాలంగా పరారీలో ఉన్న అతని కదలికలను నిఘా ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా అంజిరెడ్డి సుమారు 92 నకిలీ కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా మోసపూరిత జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు అధికారులు వెల్లడించారు. అమాయకుల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి బోగస్ సంస్థలను నమోదు చేసినట్లు గుర్తించారు.

తరువాయి 8వ పేజీలో

## ఏయూఈఈటి - 2026 ఫలితాలు విడుదల

ఆంధ్రవిశ్వవిద్యాలయం, మే 15, ప్రభాతవార్త

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో నిర్వహించే ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూఈఈటి -2026 ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తన కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డీన్ ఆచార్య కె.శ్రీనివాస రావు, ఆచార్య వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 7 ప్రధాన నగరాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 5327 మంది దరఖాస్తు చేయగా 4707 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరికి మార్కుల ఆధారంగా ర్యాంకులను కేటాయించారు. త్వరలో ఆన్‌లైన్‌లో సర్టిఫికేటల పరిశీలన, కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ప్రత్యేక విభాగాల వారికి పెదవాల్తేరులోని సంచాలకుల కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుపుతారు. ప్రవేశ పరీక్షలో విజయనగరానికి చెందిన జి.జయరాం 84 మార్కులతో ప్రథమ స్థానంలో నిలచాడు. పల్నాడుకు చెందిన జి.వెంకట భువన తేజ 2వ ర్యాంకును, ప్రకాశం జిల్లా సింగరాయ కొండకు చెందిన షేక్ నౌషీర్ 3వ ర్యాంకు, శ్రీకాకుళంకు చెందిన వి.మురళీకృష్ణ 4 వర్యాంకు, శ్రీకాకుళంకు చెందిన కె.లిఖిత్ 5వ ర్యాంక్ పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విసి ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందనలు తెలియజేసారు.

## ముందస్తుగా మాన్సూన్ ఎంట్రీ.. రైతుల్లో ఆనందం

-వాతావరణ శాఖ ప్రకటనతో రైతుల్లో ఆనందం-ముందస్తుగా మాన్సూన్ ప్రవేశించే అవకాశం

(ప్రభాతవార్త–విశాఖపట్నం)

ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళలోకి ప్రవేశించే మాన్సూన్ ఈసారి ముందుగానే రానున్నట్లు అంచనా వేస్తున్నారు. అరేబియా సముద్రంలో అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడటం, గాలుల వేగం పెరగడం, తేమ శాతం అధికంగా ఉండటం వల్ల నైరుతి రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. కేరళ తీరాన్ని తాకిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల వైపు మాన్సూన్ విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వార్త ఊరటనిచ్చేలా మారింది. ముఖ్యంగా రైతులు మాన్సూన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వర్షాలు ప్రారంభమైతే సాగు పనులు వేగవంతం అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా వచ్చే రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## విశాఖలో పర్యాటక అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

విశాఖపట్నం జిల్లా పర్యాటక అభివృద్ధిపై జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి ఛైర్మన్ అభిషిక్త్ కిషోర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా పర్యాటక మండలి సమావేశంలో సమగ్ర సమీక్ష చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పర్యాటక కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ సంస్థల పనితీరుతో పాటు ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు, ప్యాకేజ్ టూర్ ఆపరేషన్ల గత ఆరు నెలలు, ఒక సంవత్సరం పనితీరుకు సంబంధించిన విశ్లేషణ నివేదికలను తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విశాఖ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను విభాగాల వారీగా గుర్తించి, సమీప జిల్లాల పర్యాటక కేంద్రాలతో అనుసంధానం చేస్తూ కొత్త టూరిజం సర్క్యూట్లు రూపొందించాలని సూచించారు. పర్యాటకులు విశాఖలో ఎక్కువ రోజులు బస చేసేలా ప్రత్యేక పర్యాటక ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న టూరిజం సర్క్యూట్ల పనితీరు వివరాలను తదుపరి సమావేశంలో సమర్పించాలని ఆదేశించిన కలెక్టర్, విశాఖ నగరంలోని హోటళ్లలో పర్యాటకులకు ఉపయోగపడే కాఫీ టేబుల్ బుక్స్, టూర్ ఇటినరరీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అడవి ప్రాంతాల్లో ట్రెక్కింగ్ మార్గాల అభివృద్ధి కోసం అటవీ శాఖ నిపుణులతో కలిసి అధ్యయనం నిర్వహించి, సాధ్యాసాధ్యాల నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## రూ.1700 కోట్ల నకిలీ బిల్లుల స్కాం నిందితుడు అరెస్టు

7వ తరువాయి ..

అంతేకాకుండా నకిలీ అద్దె ఒప్పందాలు, మార్పులు చేసిన మొబైల్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలతో కంపెనీలను నిర్వహిస్తూ భారీ మోసానికి పాల్పడినట్లు తేలింది. సరుకు రవాణా జరగకుండానే నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి కోట్ల రూపాయల జీఎస్టీ క్రెడిట్‌ను అక్రమంగా పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ స్కామ్‌కు సంబంధించి పలు రాష్ట్రాల్లో మరిన్ని లావాదేవీలు,అనుబంధ నిందితులపై విచారణ కొనసాగుతోందని జీఎస్టీ నిఘా విభాగం వెల్లడించింది.

## ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న యువతికి సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం

-విశాఖ ఎంపీ శ్రీభరత్ చేతుల మీదుగా రూ.91 వేల చెక్కు అందజేత

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:



ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ప్రకాశ్‌రావుపేటకు చెందిన బర్టిక పద్మకు సీఎం సహాయనిధి నుంచి రూ.91 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితురాలికి అందించారు. 29వ వార్డు ప్రకాశ్ రావుపేట ప్రాంతానికి చెందిన బర్టిక పద్మ (18) పక్షవాతం సమస్యతో బాధపడుతోంది. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు చేసి చికిత్స చేయిస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న వార్డు అధ్యక్షులు ఉరికీటి గణేష్ బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం ఈ విషయాన్ని పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ దృష్టికి తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా ఆయన కృషి చేశారు. దీంతో రూ.91 వేల చెక్కును భరత్ కార్యాలయంలో బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు పద్మ, ఎంపీ శ్రీ భరత్‌తో పాటు వార్డు అధ్యక్షులు ఉరికీటి గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు అక్కరబోయిన సూరిబాబు, పల్లా మధు, ఒమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగంగా చెత్త వేస్తే కఠిన చర్యలు

-వ్యర్థాల సేకరణలో అలసత్వం సహించబోమన్న జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:

నగరంలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పడవేస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. వ్యర్థాల సేకరణ శతశాతం జరగకపోతే ఉపేక్షించేది లేదని ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు.శుక్రవారం వెస్ట్ జోన్ 61వ వార్డు పరిధిలోని గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వీధులు, కాలనీలు, రోడ్లపై చెత్త పేరుకుపోవడాన్ని గమనించిన ఆయన.. క్లాప్ వాహనాల రాకపోకలు, వ్యర్థాల సేకరణ విధానంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.నివాసితులు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. క్లాప్ వాహనాలు, లోడర్లు పిన్‌పాయింట్ వారీగా నిర్ణీత సమయాల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.తడి, పొడి వ్యర్థాల వేర్వేరు సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు క్లాప్ వాహనాల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్, విజిల్ తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రధాన కాలువలు, గెడ్డలలో వ్యర్థాలను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## దేశ ప్రయోజనాల కోసమే మహానాడు రద్దు



పిఎం పాలెం, మే 15, ప్రభాతవార్త:

దేశ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ మహానాడును రద్దు చేయడం అభినందనీయ నిర్ణయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ పార్టీ అధ్యక్షులు, సీఎం నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దేశ ప్రయోజనాలను ముందుంచుకుని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుకు స్పందిస్తూ మహానాడును రద్దు చేయడం ద్వారా తెలుగుదేశం పార్టీ మరోసారి దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో ఇష్టంగా నిర్వహించుకునే మహానాడు పండుగను రద్దు చేయడం బాధాకరమైన విషయమే అయినప్పటికీ.. దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాలని దాసరి శ్రీనివాస్ కోరారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌ను రోల్ మోడల్‌గా నిలబెడుతున్న నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఆయన కొనియాడారు.

## కనకమహాలక్ష్మి అమ్మవారికి బంగారు నెక్లెస్ విరాళం



-రూ.2.45 లక్షల విలువైన ఆభరణం సమర్పించిన భక్త కుటుంబం

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:

నగరంలోని కరాస ప్రాంతానికి చెందిన వి. పరదేశమ్మ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 23 గ్రాముల బంగారు నెక్లెస్‌ను విరాళంగా సమర్పించారు. సుమారు రూ.2.45 లక్షల విలువగల ఈ ఆభరణాన్ని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శోభారాణి, ధర్మకర్తల మండలి చైర్మన్ కందుల నాగరాజు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ అధికారులు భక్త కుటుంబంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం శేషవస్త్రాలు, ప్రసాదాలను భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# వేటకు విరామంతో.. మత్స్యకారులు ఆకలి కేకలు..!

-అప్పులు, ఆకలి, ఆందోళనల మధ్య బతుకుదెరువు కోసం పోరాటం -ప్రభుత్వం నిషేధంతో జెట్టీలకే పరిమితమైన బోట్లు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

సముద్రంలో మత్స్యసంపద సంరక్షణ, చేపల ఉత్పత్తి పెంపుదల లక్ష్యంగా ప్రభుత్వం మెకనైజ్డ్ బోట్ల ద్వారా చేపల వేటపై తాత్కాలిక నిషేధం అమలు చేస్తోంది. దీంతో తీర ప్రాంతాల్లో వందలాది ట్రాలర్లు, పెద్ద బోట్లు జెట్టీలకే పరిమితమయ్యాయి. ప్రతి ఏడాది అమలయ్యే వేట విరామ కాలం మత్స్యకార కుటుంబాలకు తీవ్ర పరీక్షగా మారుతోంది. వేట పూర్తిగా ఆగిపోవడంతో సముద్రంపైనే ఆధారపడి జీవించే వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. మెకనైజ్డ్ బోట్ల యజమానులు మాత్రమే కాదు..బోట్లలో పనిచేసే కార్మికులు, చేపల వడపోత పనివారు, చేపల అమ్మకందారులు, వలలు అల్లే మహిళలు, ఐస్ ఫ్యాక్టరీ కార్మికులు, రవాణా సిబ్బంది ఇలా అనుబంధ రంగాలపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధి కూడా దెబ్బతింది. రోజువారీ ఆదాయం లేక ఇంటి ఖర్చులు నిర్వహించడం కష్టమైపోయిందని మత్స్యకారులు చెబుతున్నారు.

### సంప్రదాయ పడవలతో వేటకు ప్రయత్నాలు

ఉపాధి కోసం చాలామంది మత్స్యకారులు సంప్రదాయ పడవలతో సముద్రంలోకి వెళ్తున్నారు. అయితే చిన్న పడవలతో ఎక్కువ దూరం వెళ్లే అవకాశం లేక తీర ప్రాంతాల్లోనే వేట సాగించాల్సి వస్తోంది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో చేపలు దొరకకపోవడంతో ఖర్చులు కూడా తిరిగి రావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. గంటల తరబడి సముద్రంలో తిరిగినా చేతికి సరిపడా మత్స్యసంపద చిక్కడం లేదని చెబుతున్నారు.

### 'సముద్రం దగ్గరే ఉన్నా ఆకలితోనే రోజులు'

"వేట లేక ఇంట్లో పొయ్యి వెలగడం లేదు. చిన్న పడవలతో వెళ్లినా ఖాళీ చేతులతోనే తిరిగి వస్తున్నాం. కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సి వస్తోంది" అంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకరోజు వేటకు వెళ్లి వచ్చిన ఆదాయంతో కుటుంబ అవసరాలు తీర్చుకునేవాళ్లమని, ఇప్పుడు రోజువారీ ఖర్చులకే డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. కాగా,

చేపల అమ్మకాలపై ఆధారపడి జీవించే మహిళల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. చేపలు దొరకక మార్కెట్లలో వ్యాపారం తగ్గిపోవడంతో ఆదాయం పూర్తిగా ఆగిపోయిందని మహిళలు చెబుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అవసరాలు, వైద్య ఖర్చుల కోసం బంగారం తాకట్టు పెట్టడం, అధిక వడ్డీకి అప్పులు చేయడం తప్ప మరో మార్గం లేదని వాపోతున్నారు.

### పెరిగిన అప్పులు.. తగ్గిన ఆదాయం..

బోట్ల నిర్వహణ, వలల మరమ్మతులు, డీజిల్ ఖర్చులు ఇప్పటికే మత్స్యకారులపై భారంగా ఉన్నాయి. ఇప్పుడు వేట లేక ఆదాయం పూర్తిగా ఆగిపోవడంతో చాలామంది ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. కొన్ని కుటుంబాలు నిత్యావసరాల కోసం కూడా రుణాలపై ఆధారపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల సముద్రంలో వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగా లేకపోవడం మత్స్యకారులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. అలల ఉద్ధృతి, గాలుల తీవ్రత పెరగడం, చేపల వలస మార్పులు వంటి కారణాలతో తీర ప్రాంతాల్లో మత్స్యసంపద తగ్గిందని మత్స్యకార సంఘాలు పేర్కొంటున్నాయి. చిన్న పడవలతో సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులకు భద్రతా సమస్యలు కూడా ఎదురవుతున్నాయి.

### ప్రభుత్వ సహాయం సరిపోవట్లేదంటున్న మత్స్యకారులు

వేట విరామ కాలంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కుటుంబ అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీవన భృతి పెంచాలని, సంప్రదాయ మత్స్యకారులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వేట నిలిచిన కాలంలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. తీర ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని మత్స్యకార సంఘాల నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని, అప్పుల్లో కూరుకుపోయిన మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో తీర గ్రామాల్లో మరింత ఆర్థిక, సామాజిక సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## 22న నర్సీపట్నంలో టీడీపీ పార్లమెంట్ మినీ మహానాడు

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని మినీ మహానాడు మే 22వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నర్సీపట్నంలోని స్టార్ హోమ్స్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు నర్సీపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు తాతయ్య బాబు వెల్లడించారు. నర్సీపట్నం లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 18, 19, 20 తేదీలలో మహానాడు కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుగుతాయని తెలిపారు. ఈ నియోజకవర్గ సమావేశాల్లో ప్రవేశపెట్టిన తీర్మానాలన్నింటినీ క్రోడీకరించి 21వ తేదీ నాటికి పూర్తి చేసి జిల్లా పార్టీ నుండి రాష్ట్ర పార్టీకి పంపుతామని ఆయన వివరించారు. అనంతరం 22వ తేదీ శుక్రవారం నాడు ఉదయం 9:30 గంటలకు నర్సీపట్నం నియోజకవర్గ మహానాడుతో పాటు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ మినీ మహానాడును స్టార్ హోమ్స్ లో భారీ ఎత్తున జరపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ పెద్దలు కొల్లు రవీంద్ర, అనిత, జనరల్ సెక్రెటరీ విజయ్, పలువురు ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జులు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు పెద్ద ఎత్తున హాజరవుతారని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ.. ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## జీవీఎంసీ అభివృద్ధి పనులపై ఉన్నతస్థాయి సమీక్ష

-త్రాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

-అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని అధికారులకు ప్రధాన కార్యదర్శి ఆదేశాలు

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి ప్రాజెక్టులపై రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్. తేజ్ భరత్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీవీఎంసీ పరిధిలో అమలవుతున్న 24/7 త్రాగునీటి సరఫరా, మధురవాడ ఎస్టీపీ, ఆటోమేషన్ బల్క్ అండ్ సెమీ బల్క్ వాటర్ సప్లై, డిశాలినేషన్ ప్లాంట్, మురికివాడల అభివృద్ధి, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, బల్క్ వాటర్ సప్లై పైపులైన్లు, ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ సిటీ వంటి కీలక ప్రాజెక్టుల పురోగతిని ఆయన సమీక్షించారు. ముందుగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధి పనుల వివరాలను ప్రధాన కార్యదర్శికి వివరించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ భీమిలి, అనకాపల్లి ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గుర్తించిన మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. డిశాలినేషన్ ప్రాజెక్టుల అమలులో ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి ఉత్తమ పద్ధతులను అమలు చేయాలని సూచించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం త్రాగునీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నిర్ణీత సమయాల్లో నీటి సరఫరా అందించాలని ఆదేశించారు. నీటి సరఫరా ట్యాంకర్లకు జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, సచివాలయాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని సూచించారు. త్రాగునీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్‌కు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ప్రజల నుంచి అత్యధిక ఫిర్యాదులు ఈ అంశాలపైనే వస్తున్నాయని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్లు ప్రతిరోజూ ఉదయం వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి లోపాలను వెంటనే సవరించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నివాసిత సంక్షేమ సంఘాలు, సామాజిక సంస్థల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో కూడా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. ఆస్తి పన్నుల వసూళ్లపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కమిషనర్‌కు సూచించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నుండి చెక్కు అందజేత

మాధవధార, మే 15, ప్రభాతవార్త



అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 65 వేల 529 రూపాయలు సనపల వరప్రసాద్ అందజేశారు. తెన్నేటినగర్, జివియంసి 50 వ వార్డ్ నివాసి మడ్డుగారి రమణ రోడ్డు ప్రమాదం కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తి, గతకొంతకాలంగా బాధపడుతున్నాడు. రమణ కుటుంబం ఎపి కళింగ కార్పోరేషన్ డైరెక్టర్, 50 వ వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళారు. వరప్రసాద్ విశాఖపట్నం లోక్సభ సభ్యులు యం. శ్రీ భరత్ సహకారంతో బాధితుడుకి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 65 529 రూపాయలు సహాయం వచ్చేటట్టు కృషిచేశారు. వరప్రసాద్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును రమణకు అందజేశారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవలపై సమీక్ష

-ఈహెచ్‌ఆర్, అభా ఐడీ నమోదు, ఐవీఆర్‌ఎస్ సేవలను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ

-ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి ఆదేశం



పిఎం పాలెం, మే 15, ప్రభాతవార్త:

నగరంలోని ఏఎస్‌ఆర్ నగర్, మురళీనగర్, సాగర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈహెచ్‌ఆర్, అభా ఐడీ రిజిస్ట్రేషన్, ఐవీఆర్‌ఎస్ ద్వారా హాస్పిటల్ సేవలు ప్రజలకు అందుతున్న తీరును పరిశీలించారు. ప్రజాభిప్రాయాలను సేకరించడంతో పాటు కేపీఐ ఇండికేటర్స్, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు తదితర అంశాలను సమీక్షించారు.ప్రతిరోజూ జూమ్ సమావేశాల ద్వారా వివిధ కార్యక్రమాలకు సంబంధించిన సూచనలు ఇస్తున్నామని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది అందరూ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింహాచలం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా అశోక్‌గజపతిరాజు

-సభ్యులుగా మరో 16 మంది నియామకం

సింహాచలం, మే 15, ప్రభాతవార్త:

సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజును చైర్మన్‌గా మరో 16 మంది సభ్యులను నియమించింది. మక్కెన సీతారాం పాత్రుడు (నవీన్) (ఎస్.కోట–టీడీపీ), కశిరెడ్డి దామోదర్ (భీమిలి –టీడీపీ), చలమూరి భారతి (భీమిలి–టీడీపీ), కరక దేవుడు (పెందుర్తి –టీడీపీ), కనకాల మురళీమోహన్ (విజయనగరం–టీడీపీ), వేంపాడపు అన్నపూర్ణ (చీపురుపల్లి –టీడీపీ), బీతల నీరజ లక్ష్మీకుమారి (అరకులోయ–టీడీపీ), మధుపాడ సన్యాసిరావు (విశాఖ –బీజేపీ), డా. ధరిణి బండ్ల (నరసరావుపేట–టీడీపీ), నీటిపల్లి మహేశ్ (పెందుర్తి–జనసేన), పెద్దిశెట్టి ఉషశ్రీ (విశాఖాజనసేన), లలిత జ్యోతి (పుంగనూరు–టీడీపీ), గుత్తికొండ శ్రీలత (విశాఖ ఉత్తరం–టీడీపీ), సుసరపు గణపతిరావు (టెక్కలి–టీడీపీ), చల్లంగి జ్ఞానేశ్వరి (పాడేరు–టీడీపీ), పావులూరి శ్రీనివాసరావు (అనపర్తి –టీడీపీ)

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్

-వేల కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల ప్రాజెక్ట్.. యువతకు భారీ ఉపాధి అవకాశాలు

(ప్రభాతవార్త–విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పురోగతిని అధికారులు వారికి వివరించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రతీకగా నిలవనుందని పేర్కొన్నారు. సుమారు రూ.4,500 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. మొత్తం ప్రాజెక్ట్ విస్తీర్ణం 2,200 నుంచి 2,700 ఎకరాల మేర విస్తరించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గ్లోబల్ కనెక్టివిటీని పెంచే ప్రధాన కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు అనువుగా విశాలమైన రన్‌వేలు, ఆధునిక టెర్మినల్ భవనాలు, కార్గో హబ్, లాజిస్టిక్స్ సెంటర్‌తో పాటు అత్యాధునిక భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో నిర్మాణం కొనసాగుతోందని వెల్లడించారు. విమానాశ్రయ పరిధిలో విస్తృత పార్కింగ్, రవాణా సదుపాయాలు, హోటల్స్, కమర్షియల్ స్పేస్‌లు, బిజినెస్ హబ్‌లు కూడా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని నాయకులు పేర్కొన్నారు. నిర్మాణ దశలోనే పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయని, విమానాశ్రయం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో పర్యాటక, ఐటీ, పారిశ్రామిక రంగాలకు విశేష ప్రోత్సాహం లభిస్తుందని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థికాభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వారు స్పష్టం చేశారు.

## గీతం లో కాటన్ 223వ జయంతి

విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:



ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 223వ జయంతి సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తేది: 15-05-2026 న సర్ ఆర్థర్ కాటన్ భవనంలో జయంతి సభను నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. భరణి చంద్ర కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్, ప్రొపెసర్ ఎమ్.రమేష్, డాక్టర్ పి.చందనకుమార్ సీనియర్ ప్రొఫెసర్‌లు పాల్గొని కాటన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.భరణి చంద్ర కుమార్ మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రానికి నీటిపారుదల రంగంలో అమల్యమైన సేవలు అందించారని కొనియాడారు. గోదావరి, కావేరి నదులపై నిర్మించిన ఆనకట్టలు, కాలువలు ఆయనే స్వయంగా ప్రణాళికలు రూపొందించి రైతులకు సాగు నీరు అందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రజల బాగు కోసం తపన పడి ఆంధ్ర రాష్ట్రాన్ని పచ్చగా ఉంచడానికి కాటన్ నిర్మించిన ఆనకట్టలు దోహదపడ్డాయని అన్నారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే యువత కాటన్ వంటి నిస్వార్థ నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్రీచ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త:

మండుతున్న ఎండలకు ఉపశమనం కలిగించేందుకు ఎన్రీచ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శంకరమఠం రోడ్ లో గల రామలిగేశ్వర స్వామి ఆలయం దగ్గరలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదచారులకు వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ చేసారు. ఫౌండర్ ప్రెసిడెంట్ తిలక్ పట్నాయక్, వైస్ ప్రెసిడెంట్ బి మాల్యాద్రి, అక్కయ్యపాలెం పోర్ట్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సెలగంశెట్టి ప్రసాదరావు, బొచ్చా రామయ్య మరియు చంటి తదితరులు పాల్గన్నారు

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో సంచలన తీర్పు

విశాఖపట్నం, మే 15 ప్రభాతవార్త

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి కోర్టు 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించింది .తాజాగా ఎం.వి.పి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. కేసులో ముద్దాయి అయిన చింతాడ నవీన్ కుమార్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,500 జరిమానా విధిస్తూ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై ఎం.వి.పి పోలీసులు నమోదు చేసిన కేసును వేగంగా దర్యాప్తు చేసి, పక్కా ఆధారాలను కోర్టులో సమర్పించారు. విచారణ అనంతరం నిందితుడిపై అభియోగాలు రుజువుకావడంతో పోక్సో కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందాన్ని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, అభినందించారు. చిన్నారులపై నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ కేంద్రాలపై చర్యలు



పిఎం పాలెం, మే 15, ప్రభాతవార్త:

విశాఖపట్నం జిల్లాలో నిర్వహిస్తున్న అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ యాక్ట్-1994 ప్రకారం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. విశాఖపట్నం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ పొందని స్కానింగ్ కేంద్రాల యజమానులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://pcpndt.ap.gov.in/ ద్వారా అప్లై చేసుకోవచ్చని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి స్పష్టం చేశారు.

## సెంట్రల్ పార్క్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం :సీఐ ఎర్రం నాయుడి

విశాఖపట్నం, మే 15 ప్రభాతవార్త



మహిళలు గుర్తుతెలియని వ్యక్తుల నుండి జాగ్రత్తగా ఉండాలని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎర్రం నాయుడు ప్రజలకు తెలియజేశారు. శుక్రవారం సెంట్రల్ పార్క్ లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మహిళ భద్రతే ప్రాధాన్యత గా బాధ్యత వహిస్తున్న పోలీసులు విశాఖ పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి,, డీసీపీ-1 ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో సెంట్రల్ పార్క్‌లో ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు అధికారి, సిబ్బంది పాల్గొని పార్క్‌కు వచ్చిన ప్రజలకు వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువత కారణంగా ఏర్పడుతున్న సమస్యలపై ప్రజలకు వివరించారు. మహిళల భద్రతకు విశాఖ నగర పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.



## యువకుడు అనుమానాస్పద మృతి

### చీమలపల్లి వద్ద మృతదేహం గుర్తింపు

( అచ్చుతాపురం మే 15 ప్రభాతవార్త

అచ్చుతాపురం మండలంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వికాస్ కుష్వా (26) అనే వ్యక్తి మడుతూరు జంక్షన్ వద్ద ఉన్న మై చాయిస్ ఐస్‌క్రీమ్ డీలర్ ప్రదీప్ కుమార్ వద్ద గత రెండేళ్లుగా పని చేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం నుంచి అతడు కనిపించ కుండా పోయినట్లు సమాచారం. కాగా గురువారం మధ్యాహ్నం చీమలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 66లో ఉన్న శివప్రియ గార్డెన్స్ సమీపంలో వికాస్ కుష్వా మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఇంధన ధరల పెంపు ఉపసంహరించాలి

### వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ డిమాండ్



అచ్చుతాపురం మే 15 ప్రభాతవార్త

అచ్చుతాపురం కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చోడిపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలు పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పెట్రోల్ వినియోగం తగ్గించాలని సూచిస్తూ, మరోవైపు ఇంధన ధరలను పెంచడం వల్ల సామాన్య వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు అధికమై, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతుందని తెలిపారు. ఇంధన ధరల పెరుగుదలతో ఇప్పటికే పెరిగిన జీవన వ్యయం మరింత భారమవుతోందని, సాధారణ కుటుంబాల జీవనోపాధి కష్టతరంగా మారుతోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలను తగ్గించాలని ఆయన కోరారు.

## పాయకరావుపేట నియోజకవర్గం మినీ మహానాడును జయప్రదం చేయండి: మెరుగు



నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

ఈనెల 20వ తేదీన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడిల సారథ్యంలో నియోజకవర్గస్థాయి మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ నాయకులు, నియోజకవర్గస్థాయి పార్టీ నాయకత్వం భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా జరిగే పాయకరావుపేట నియోజకవర్గం సంబంధించిన మినీ మహానాడు నక్కపల్లి కేంద్రంగా జరుగుతున్న కార్యక్రమాన్ని జయప్రదం చేసే విషయంలో ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఎంపీటీసీ సభ్యులు, జిల్లా మత్స్యకార నాయకులు మెరుగు నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జాతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ల సారథ్యంలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి మహానాడును జయప్రదం చేసే విషయంలో ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని, ప్రతి గ్రామంలో టిడిపి అధికారంలోకి వచ్చి చేపట్టిన అనేకమైన సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేస్తూ పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి విధంగా ఈ మహానాడు మనకు ఉపయోగపడాలని, అందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నడూ ఊహించిన రీతిలో పాయకరావుపేట నియోజకవర్గం కోట్లాది రూపాయలు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని ,ఇటువంటి అభివృద్ధి ఏనాడూ చూడలేదని నాగేశ్వరావు అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో రాష్ట్ర హోం మంత్రి వంగలు పోవడానికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వేదిక ఈ మినీ మహానాడును జయప్రదం చేసే కార్యక్రమంలో భాగంగా పార్టీ చేపట్టిన అనేకమైన కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని గ్రామస్థాయి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



గాజువాక,మే 15,ప్రభాతవార్త

పశ్చిమ నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు అందజేశారు. మజ్జి అచ్చుత రావు భార్య దుర్గంబకు మోకాళ్ళ ఆపరేషన్ రూ. 1.12 లక్షలు, లక్ష్మికి రూ. 81 వేలు, పెద్దాడ గాయత్రికి రూ. 48,289 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రి చికిత్స అనంతరం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి సోమేశ్, సీనియర్ నాయకులు కాకి పోలిరెడ్డి, జయశంకర్, ఊరుకుటి డేవిడ్, పంచాదార్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



గాజువాక, మే 15,ప్రభాతవార్త

శ్రీ సంతోషిమాత ఆలయ పునః నిర్మాణానికి భక్తులు తమ ఉదారతను చాటుకుంటున్నారు. తాజాగా కాకి అప్పల రెడ్డి పైడికొండమ్మ దంపతుల కుమారులు కుంచారావు, నూకరాజు కలిసి ఆలయ నిర్మాణ నిధి కోసం 51,116 రూపాయల భారీ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ పునః నిర్మాణంలో భాగస్వాములు కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కాగా, నిస్వార్థంగా విరాళం అందించిన దాతలను వార్డ్ మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు స్థానిక భక్తులు ప్రత్యేకంగా అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు ఆ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ‘శక్తి’ యాప్‌పై అవగాహన



గాజువాక,మే 15,ప్రభాతవార్త

దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో మహిళా భద్రత, అత్యవసర సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ పోలీసులు విద్యార్థులకు ‘శక్తి’ యాప్ పనితీరుపై వివరించారు. డబ్ల్యూ. ఎస్.ఐ పి.వెంకటలక్ష్మి, ఏ.ఎస్.ఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు ఈ యాప్ శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఎస్ఓఎస్ బటన్ నొక్కడం ద్వారా తక్షణమే పోలీసుల సాయం ఎలా పొందవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. లైవ్ లొకేషన్ షేరింగ్ వంటి ఫీచర్ల ద్వారా రక్షణ సులభతరమవుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల ఆత్మరక్షణకు ఇటువంటి యాప్‌లు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు హేమ సుందర్, కొండలరావు, స్పందన విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒడిశా రెవెన్యూ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కరణంరెడ్డి నరసింగరావు



గాజువాక, మే 15,ప్రభాతవార్త

ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఆ రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ పూజారిని బీజేపీ గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు మర్యాద పూర్వకంగా కలిశారు. గంగానగర్‌లోని మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై వారు ముచ్చటించారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ.. తన ఒడిశా పర్యటనలో భాగంగా సంబల్‌పూర్, జార్సిగూడ, సుందర్‌గఢ్ ప్రాంతాలతో పాటు భువనేశ్వర్‌లోని 11వ శతాబ్దపు పురాతన శ్రీ లింగరాజు ఆలయాన్ని దర్శించుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆసియాలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సు అయిన చిలికా సరస్సును సందర్శించామన్నారు. 1100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ సరస్సులో డాల్ఫిన్లు, విదేశీ వలస పక్షుల సందడి విశేషంగా ఉందన్నారు. ఈ పర్యటనలో కేఎన్ఆర్ వెంట ఆయన స్నేహితులు శశికుమార్, రమణ, శివరామకృష్ణ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## డిజైర్ సొసైటీకి ఎన్ఆర్ఐ వితరణ



గాజువాక, మే 15,ప్రభాతవార్త:

ఎయిడ్స్ బాధిత చిన్నారులను అక్కున చేర్చుకుని సేవలందిస్తున్న అఫీషియల్ కాలనీలోని ‘డిజైర్ సొసైటీ’కి ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ) గొందేశి సుధీర్ రెడ్డి చేయూతనందించారు. తుంగలాం ప్రాంతానికి చెందిన ఆయన తన తండ్రి రామిరెడ్డి జ్ఞాపకార్థం రూ. 65 వేల విలువైన నిత్యావసర వస్తువులను శుక్రవారం సొసైటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సౌత్ సర్కిల్ క్రైమ్ సిఐ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు దూరమై కష్టాల్లో ఉన్న చిన్నారులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. తోటి వారికి సాయం చేయాలనే సంకల్పం ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుందని, సుధీర్ రెడ్డిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. దాత సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రతి నెలా ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజైర్ సొసైటీ ఇన్చార్జి లక్ష్మణ్, రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలపై ఇంటింటా ప్రచారం



మాధవధార, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలపై బర్మాకాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి, ఉపాధ్యాయులు శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. స్కూల్ పరిధిలో చిన్న పిల్లల ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ పాఠశాల మా పాఠశాల కాదు మన పాఠశాల అని వివరించారు. విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ఉచిత యూనిఫారం, పుస్తకాలు, పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో ప్రతిరోజు రాగి జావ, ఉడకపెట్టిన కోడిగుడ్డు,ఆరోగ్యవంతమైన పరిశుభ్రమైన మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందించడం జరుగుతుందని వివరించారు.తమ విద్యార్థులను ఆరోగ్యవంతమైన ఆదర్శవంతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దే అన్ని విద్యా అర్హతలు కలిగిన ఉపాధ్యాయ బృందం ఉన్నారని,కావున తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించి ఆర్థిక ఇబ్బందికి గురికాకుండా తమతో పంపించడం ద్వారా వారి భవిష్యత్తుకు మేము భరోసా ఇవ్వగలమని,ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు వస్తున్నట్టు పేర్కొన్నారు.

## జాతీయ సరుకు రవాణా నెట్‌వర్క్‌ను సృష్టించడం ‘ ఫ్రేమ్ వర్క్ ‘లక్ష్యం

ఆరిలోవ, మే 15, ప్రభాతవార్త

జాతీయ ఈవీ హైవే మార్గదర్శక ఫ్రేమ్‌వర్క్, 2027 నాటికి భారతదేశంలోని అత్యంత రద్దీగా ఉండే సరుకు రవాణా మార్గాలను విద్యుదీకరించేందుకు ఒక దశల వారీ ప్రణాళికను సిఫార్సు చేస్తోంది. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గుర్తించిన 20 ప్రాధాన్యతా రహదారులతో ప్రారంభించి, పారిశ్రామిక కేంద్రాలు, ఓడరేవులకు విస్తరించి, చివరిగా 2035 నాటికి అంతరాయం లేని, జాతీయ సరుకు రవాణా నెట్‌వర్క్‌ను సృష్టించడం ‘ఫ్రేమ్ వర్క్ ‘లక్ష్యమని నీతి ఆయోగ్ విశిష్ట ఫెలో డా.ఓ.పి.అగర్వాల్ తెలిపారు. అమెజాన్‌తో కలిసి నెలకొల్పిన ‘ది క్లైమేట్ ప్లెడ్జ్’ వాతావరణ మార్పులపై ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సి40 సహకారంతో, సరుకు రవాణాను డీజిల్ నుండి జీరో- ఉద్గార బ్యాటరీ ఎలక్ట్రిక్ ట్రక్కులకు మార్చడానికి భారతదేశపు మొట్టమొదటి రుజువు-ఆధారిత రోడ్‌మ్యాప్‌ను ప్రచురించింది. ఈ ఫ్రేమ్‌వర్క్, విద్యుదీకరణ, సుస్థిర రవాణాపై ప్రభుత్వ దృష్టికి, అలాగే 2070 నాటికి నికర-జీరో ఉద్గారాలను సాధించాలన్న భారతదేశ నిబద్ధతకు అనుగుణంగా ఆచరణాత్మక మార్గాలను వివరిస్తుంది. అమెజాన్, ఇండియా, ఆస్ట్రేలియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ మాట్లాడుతూ మా కార్యకలాపాలను మరింత సుస్థిరంగా మార్చడానికి మేము పెట్టుబడులు పెట్టడం కొనసాగిస్తున్నామని,మా లాజిస్టిక్స్‌ను విద్యుదీకరించడం ఆ ప్రయత్నంలో ఒక కీలక భాగం. ‘ది క్లైమేట్ ప్లెడ్జ్’ ద్వారా, భారతదేశంలో ఎలక్ట్రిక్ ఫ్రైట్ సొల్యూషన్స్‌ను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడానికి మేము భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నామన్నారు. వీటిని మరింత వేగంగా స్వీకరించేలా చేసేందుకు ప్రభుత్వం, పరిశ్రమల మధ్య నిరంతర సహకారం ప్రాముఖ్యతను ఇవి బలపరుస్తున్నాయని తెలిపారు.

## పెట్టుబడిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎన్ఎస్ఇ

ఆరిలోవ, మే 15, ప్రభాతవార్త

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ విజయవాడలోని విజ్ఞాన్ యూని వర్సిటీలో 350 మందికి పైగా విద్యార్థులు, పెట్టుబడిదారులు, అధ్యాపకులకు నిపుణుల భాగస్వామ్యంతో భారీ స్థాయిలో పెట్టుబడి దారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్థిక అక్షరాస్యత, బాధ్యతాయుత పెట్టుబడులు, అలాగే ఆర్థిక, సైబర్ మోసాలపై అవగాహన పెంపొందించడంపై దృష్టి సారించింది. ఈ విషయంపై పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు, నరసరావుపేట ఇలా పేర్కొన్నారు... విజయవాడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇటువంటి పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని, ఆర్థిక అవగాహన కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తుందని, నేటి ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అక్షరాస్యత ఒక అవసరమైన జీవన నైపుణ్యంగా మారుతున్న నేపథ్యంలో, విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల ద్వారా చురుకుగా ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు. పొదుపులు, ఆర్థిక మోసాల నివారణపై అవగాహన యువతకు సమాచారంతో కూడిన ఆర్థిక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అందించడంతో పాటు, దేశ ఆర్థిక అభివృద్ధికి అర్థవంతమైన సహకారం అందించేలా సాధికారత కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ఎన్ఎస్ఇ ఎండి అండ్ సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ.. ఆర్థిక సాధికారతను సాధించడానికి ఆర్థిక అక్షరాస్యత అత్యంత ప్రభావవంతమైన సాధనాలలో ఒకటని, ఈ పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాల ద్వారా, భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో సురక్షితంగా మరియు బాధ్యతాయుతంగా పాల్గొనడానికి అవసరమైన జ్ఞానం, అవగాహన, ఆత్మవిశ్వాసంతో పౌరులను ముఖ్యంగా యువతను సన్నద్ధం చేయడం మా లక్ష్యమని తెలిపారు.

## ఎమ్మెల్యే వెలగపూడి చేతులు మీదుగా వెలిగిన స్ట్రీట్ లైట్స్



ఆరిలోవ, మే 15, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు బిఆర్‌టిఎస్ రోడ్డు అనుకోని ఉన్న స్కిల్ డెవలప్మెంట్ నుంచి ఆరిలోవ చివరి బస్ స్టాప్ వరకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లో 32 లక్షలు జీవీఎంసీ నిధులు తో రోడ్డు ఇరువైపులా స్ట్రీట్ లైట్స్ వేశారు. ఆ లైట్స్‌ను తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు చేతులు మీదుగా శుక్రవారం సాయంత్రం స్విచ్ ఆన్ చేసి లైట్లు వెలిగించడంతో కారుచీకటిగా ఉన్న ఆ రోడ్డుపై ఒక్కసారిగా లైట్లు వెలగడంతో ఆరిలోవ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఎలక్ట్రికల్ వర్క్స్ డిఈ ఎం.అన్నంనాయుడు, ఏఈ రాజేష్, ఇన్స్పెక్టర్ వేణు, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, వార్డు మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, యల్లమిల్లి సురేష్, ఉపాధ్యక్షులు కిల్లంశెట్టి శ్రీనివాస్, ఓశెట్టి పైడిరాజు, చింతలపూడి నాగేశ్వరరావు, మజ్జి శ్రీదేవి, రాజేష్, కొల్లి చిరంజీవి, గురజాపు వాసు తదితరులు పాల్గొన్నారు.

## నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

### గాజువాకలో ఎంఏయూడీ ప్రధాన కార్యదర్శి విస్తృత పర్యటన -భోగాపురం కనెక్టివిటీ రోడ్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

నగర పరిశుభ్రత నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి గాజువాక జోన్ పరిధిలో పర్యటించి పారిశుద్ధ్య పనులు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం, భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించారు. గాజువాక 76వ వార్డులో ఇంటింటి చెత్త సేకరణ, కాలువల పరిశుభ్రత, మురుగునీటి పారుదల పరిస్థితులను పరిశీలించిన ఆయన.. చెత్తను బహిరంగంగా వేస్తే జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. కాలువల నిర్మాణంలో లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం గాజువాకలో నిర్మాణంలో ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను పరిశీలించి, గాజువాకతో పాటు మధురవాడ, ముడసర్లోవ ప్రాంతాల్లో నిర్మిస్తున్న హాస్టళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెందుర్తి జోన్‌లో జుత్తాడ నుంచి వేపగుంట వరకు చేపడుతున్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ రోడ్ల పనులను కూడా పరిశీలించిన ప్రధాన కార్యదర్శి.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభానికి ముందే రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తదుపరి జైల్ రోడ్‌లో ఉన్న ఫుడ్ కోర్ట్‌ను కూడా సందర్శించి అక్కడి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఏ. ప్రభాకర్ రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## తోటగరువులో ప్రారంభమైన వైఎస్సార్సీపి ప్రీమియర్ లీగ్



ఆరిలోవ, మే 15, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం తోటగరువు మైదానంలో నాలుగు రోజులు పాటు జరగనున్న వైయస్సార్సీపి మొల్లి అప్పారావు ప్రీమియర్ లీగ్ టోర్నమెంటును 10వ వార్డు యువజన అధ్యక్షులు కంటుబోతు తులసీరామ్ అధ్యర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మొదటగా టాస్ వేసిన వైఎస్ఆర్సీపీ ఉత్తరాంధ్ర జోనల్ యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శైలేష్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే వైఎస్ఆర్సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జీవి.రామచంద్రరావు బ్యాటింగ్ చేసి టోర్నమెంట్ ను ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. టోర్నమెంట్లో మొదటి మ్యాచ్ కళ్యాణ్ ఫ్రెండ్స్ జం ఫ్రెండ్లీ స్టార్స్ మధ్య జరుగగా ఫ్రెండ్లీ స్టార్స్ మొదటి మ్యాచ్ గెలిచారు.మొదటి రోజు 8 జట్ల మధ్య 4 మ్యాచులు జరిగాయి. ఈ కార్యక్రమంలో 10వ వార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు, విశాఖ జిల్లా పార్టీ కార్యదర్శి బోండా శ్రీనివాస్, 12వ వార్డు అధ్యక్షులు మొల్లి హేమంత్ కుమార్, వార్డు జనరల్ సెక్రటరీ ఒమ్మి శ్రీను, సచివాలయ ప్రెసిడెంట్ రౌతు సంతోష్, సోషల్ మీడియా అధ్యక్షులు రవీంద్ర చౌదరి, కోరాడ సంతోష్, కొల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

### రాబోయే ఎన్నికలలో వైసీపీకి ఓటు వేస్తే ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్టే



మాధవధార, మే 15, ప్రభాతవార్త

విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ పరిధిలో పలువురు లబ్ధిదారులకు నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు ఆయన కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని మొత్తం 10 వార్డులకు చెందిన 16 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6,17,781 విలువైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు.వచ్చే జీవీఎంసీ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు.మరల వైసీపీకి ఓటు వేసి ప్రజలు ఇబ్బంది పెట్టుకునే పరిస్థితి రాకుండా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.రానున్న రోజులలో విశాఖ మరింత అభివృద్ధి కాన్నునందన్నారు. యుద్ధాల నేపథ్యంలో పెట్రోల్ ఆదా చేయాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు కూటమి నేతల వాహన కాన్వాయ్ శ్రేణి తగ్గించాలని,ముందు కూటమి నేతలు పాటించాలని వైసీపీ హేళన చేశారని, ప్రపంచంలోనే అందరూ ఆదరించే,దేశంలోనే అత్యంత శక్తి గల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ,సీఎం చంద్రబాబు సైతం కాన్వాయ్ శ్రేణి తగ్గించారని ఇప్పుడు వైసీపీ నేతలు ఎం చెప్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

## దుర్గంధం సమస్యకు శాశ్వత పరిష్కారం

### గంటా ఆదేశాలతో కదిలిన యంత్రాంగం




ఆనందపురం, మే 15, ప్రభాతవార్త

తాళ్లవలస పంచాయతీ పరిధిలోని రాయనిపేట చెరువు దుర్గంధ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల టాయ్ లెట్ల నుంచి వ్యర్థాలను పైపుల ద్వారా చెరువులోకి వదిలేయడం ప్రజల నుంచి వ్యతిరేకతకు కారణమైంది. స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఆ విషయం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి వెళ్లింది. సమస్య తీవ్రత నేపథ్యంలో తక్షణ పరిష్కార చర్యలకు ఆదేశించడంతో భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. చెరువులో దుర్గంధాన్ని వెంటనే తొలగించాలని అధికారులతో చెప్పారు. దీంతో పొక్లైన్, పైపు ద్వారా మురుగు తొలగించే పనులను శుక్రవారం నుంచి మొదలుపెట్టారు. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో తొందర్లోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొంటామని విజయ్ బాబు చెప్పారు. చెరువులోకి టాయ్ లెట్ వ్యర్థాలను వదలడంతో స్థానిక ప్రజలు అనారోగ్యం పాలవుతున్న విషయాన్ని ఎమ్మెల్యే గంటా తీవ్రంగా పరిగణిస్తున్నారని తెలిపారు.

## నాగవంశ కార్పోరేషన్ ద్వారా ఉత్తరాంధ్రాలో ఐదు కళ్యాణ మండపాలు నిర్మిస్తాం



పద్మనాభం, మే15,ప్రభాతవార్త

అన్ని రకాలుగా వెనుకబడిన ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ముఖ్యమైన పట్టణ, గ్రామాలలో నాగవంశ కార్పోరేషన్ నిధులతో ఐదు కళ్యాణ మండపాలను నిర్మించనున్నట్లు రాష్ట్ర నాగవంశ కార్పోరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు అన్నారు. తగరపువలసలో శుక్రవారం రాష్ట్ర నాగవంశ అడహక్ కమిటీ ఆధ్వర్యం లో జరిగిన విశాఖపట్నం జిల్లా నాగవంశ సంక్షేమ సంఘ సభ్యులు సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వం కార్పోరేషన్‌కి విడుదల చేసిన నిధులలో ఏభై శాతం నిధులను ఉత్తరాంధ్ర నాగవంశీయుల అభివృద్ధికి ఖర్చుచేస్తారని అన్నారు.ప్రభుత్వం విడుదల చేసిన నిధులు చాలకపోయినా విరాళాలలతో భీమిలిలో గాడు అప్పలనాయుడు జ్ఞాపకార్థం కళ్యాణం మండపం నిర్మాణానికి కృషి చేస్తారని అన్నారు. రానున్న రోజులలో నాగవంశీయులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరదామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నాగవంశ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా నూతన సంఘ సభ్యులు సేవలు చేయాలని అన్నారు. అలాగే నాగవంశీయులను బిసి డి నుండి ఎకి మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. అయితే సంఘ సభ్యులు పదిలో అత్యధిక మార్కులు సాధించిన నాగవంశ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిచారు. సంఘ అధ్యక్షులు ముని మోహనక్రిష్ణ, సభ్యులు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించిన గంటా



విశాఖపట్నం, మే 15, ప్రభాతవార్త

భీమిలి నియోజకవర్గం ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిం చారు. మధురవాడ జోన్ 8వ వార్డు పరిధిలోని గుడ్లవానిపాలెం, సాగర్ నగర్, సుభాష్ నగర్, రాజీవ్ నగర్‌లలో రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు నిర్మించాలని 5వ వార్డు సాయిరాం కాలనీ, శారదానగర్‌లలో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. మారికవలస శివాలయం రోడ్డు మీదకు వస్తున్న మురుగునీరు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, కొమ్మాది సర్వే నెంబర్ 27లో రజకులకు దోభీ ఘాట్ నిర్మించాలని కోరారు. ఆనందపురం మండలం బోని నుంచి ముకుందపురం చెరువు మీదుగా రోడ్డు నిర్మించాలని విన్నవించారు. మధురవాడ, భీమిలి జోన్ల నుంచి, భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి ప్రజలు తెలియజేసిన సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలని గంటా ఆదేశించారు. కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పొట్నూరు గ్రామంలో రెండు వారాల నుండి తాగునీటికి కటకట



పద్మనాభం,మే 15, ప్రభాతవార్త

మండలంలో పొట్నూరు గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల గత రెండు వారాల నుండి గ్రామ ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం మోటారు రెండు వారాల కిందట మరమ్మత్తులకు గురుకావడంతో తాగినీటికి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.గ్రామ ప్రజలు తాగు నీటికి అరకిలో మీటర్ల దూరంలో ఉన్న పరదేశమ్మ గుడి బోరువద్ద నుండి తాగునీటి తెచ్చుకుంటున్నారు. వ్యవసాయ కూలి పనుల మానుకొని రోజు అంతా మంచినీటి పనిమీద ప్రజలు దృష్టి సారిస్తున్నారు. చిన్నపిల్లలు సీసాలుతోను, పెద్దవారు బిందెలతో మంచినీటిని దూరం నుండి తెచ్చుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు గగ్గోలు పెట్టినా గ్రామ సచివాలయ అధికారులు కనికరించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేరుగా సచివాలయానికి వెళ్లి చెప్పినా ఖాతరచేయలేదని ప్రజలు మండి పడుతున్నారు.మండల అధికారులు స్పందించి తాగునీటిని ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# 20న పాయకరావుపేట నియోజకవర్గ మినీ మహానాడు నక్కపల్లిలోనే



## జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం

నక్కపల్లి, ప్రభాతవార్త

ఈ నెల 20న పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టిడిపి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, పాయకరావు పేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి టీడీపీ నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. నక్కపల్లిలో మంత్రి నివాసం వద్ద ఉదయం 10 గంటలకు మినీ మహానాడు ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి గ్రామ కమిటీ సభ్యులతో పాటు కనీసం 30 మంది కార్యకర్తలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా, వివిధ గ్రామాల నుంచి టీడీపీలో చేరికలు కూడా ఈ సందర్భంగా నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రతి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించాలని సూచించారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి మినీ మహానాడును విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు మరింత కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, చించెలపు పద్దు, అమలకంటి అబద్ధం, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, పెద్దిరెడ్డి చిట్టిబాబు, అయినంపూడి అప్పలరాజు, యాళ్ల వరహాలు, వెదుళ్ళ పాపారావు, నానేపల్లి రాఘవులు, కాశీ విశ్వనాథ్, మునిషా బేగం, రమా కుమారి, ప్రగడ వీరబాబు, గోసల చిన్న తాతారావు, శ్రీకాంత్, మెరుగు నాగేశ్వరరావు, దార్ల కృష్ణ, గొట్టివాడ బాబ్జి, కంకిపాడు వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధిలో మరో మైలురాయి

## సిరసపల్లిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ యూనిట్‌కు శంకుస్థాపన : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, మే 15, ప్రభాతవార్త




సిరసపల్లిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ యూనిట్‌కు శంకుస్థాపన చేయడం జిల్లా అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మునగపాక మండలం టి.సిరసపల్లి గ్రామంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ శంకుస్థాపన కార్యక్రమంలో శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్ కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిఆర్‌డిఓ, ఎన్ఎస్‌టిఎల్ అధికారులు, జాయింట్ కలెక్టర్ లతో కలసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొన్నారు. రక్షణ రంగానికి సంబంధించి అత్యంత కీలకమైన ఈ బృహత్తర ప్రాజెక్టును వర్చువల్ పద్ధతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించగా ప్రత్యక్షంగా మునగ పాక మండలం టి.సిరసపల్లి గ్రామంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థ శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, శాసనసభ్యులు బండారు సత్య నారాయణమూర్తి, సుందరపు విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పీలా గోవింద సత్య నారాయణ, బత్తుల తాతయ్య బాబు, మల్లా మల్లా సురేంద్ర, కోట్ని బాలాజీ, మనోజ్ కుమార్, ఎన్ఎస్‌టిఎల్ సైంటిస్ట్ రాజేశ్వరి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ స్థాపన కోసం భూములను ఇచ్చిన సిరసపల్లి గ్రామ ప్రజలకు అభినందనలు తెలుపుతూ అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. భూసేకరణ ప్రక్రియను సమర్థవంతం గా నిర్వహించిన జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌ను అభినందించారు. ఈ ప్రాజెక్ట్ స్థాపన ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, దేశ రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర ముఖచిత్రంతో పాటు అనకాపల్లి అంతో అభివృద్ధి చెందుతుంద న్నారు. ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ భారత రక్షణ రంగానికి వెన్నెముకగా నిలిచే భారత్ డైనమిక్స్ లిమిటెడ్ యూనిట్ సిరసపల్లిలో ఏర్పాటు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాము చేసిన కృషిని గుర్తు చేస్తూ, స్థానిక యువతకు ఈ పరిశ్రమ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.




# దుప్పితూరు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## సీఎం చంద్రబాబుతో పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు భేటీ

అచ్చుతాపురం మే 15, ప్రభాతవార్త



అచ్చుతాపురం ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగు తోందని, నిర్వాసితుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మాజీ పార్ల మెంట్ సభ్యుడు పప్పల చలపతి రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి దుప్పితూరు గ్రామ తరలింపు అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ దుప్పితూరు నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సంక్షేమం, పునరావాసం, అభివృద్ధి అంశాల్లో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పేదలు, నిర్వాసితులు, సాధారణ ప్రజల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. సీఎం నాయకత్వంలో ప్రజలకు భరోసా, గ్రామాలకు అభివృద్ధి, రాష్ట్రానికి కొత్త దిశ లభిస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

# పేదల పెన్నిధిగా కూటమి ప్రభుత్వం

## బాధితులకు రూ.14.18 లక్షల సాయం పంపిణీ



అచ్చుతాపురం, మే 15, ప్రభాతవార్త

అచ్చుతాపురం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోం దని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక మండలం మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం లో 36 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్, డ్వాక్రా పీఎం చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.14 లక్షల 18 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. పి.సింహాచలంకు రూ.లక్ష, పులపర్తి గ్రామానికి చెందిన డి.సన్యాసమ్మకు రూ.లక్ష, కృష్ణాపురం గ్రామానికి చెందిన డి.జ్యోతికి రూ.లక్ష చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ వారి శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో భరోసా నింపుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణీకులకు ఉచిత వాటర్ పంపిణీ



అగనంపూడి ప్రభాతవార్త

రైల్లో జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న పాసింజర్లకు అగనంపూడి సీనియర్ సిటిజన్, దువ్వాడ రైల్వే యూజర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మంచినీటి బాటిల్ సప్లై చేశారు. మానవ సేవ మాధవ సేవ ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేయడం జరుగుతుం దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఆర్ నాయుడు, వర ప్రసాదు, సూర్యనారాయణ, జై కుమారు, విజయ్ కుమార్, గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

# హాకీ క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారులు చేయూత...



ఎలమంచిలి, మే 15, ప్రభాతవార్త

పట్టణంలోని ఎలమంచిలి హాకీ సెంటర్ నందు సీనియర్ హాకీ క్రీడాకారులైన మజ్జి గణేష్, కొల్లి హర్ష, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం చేస్తున్న వీరు వారి తల్లిదండ్రులు చేతుల మీదుగా కొల్లి దేవి, మజ్జి దేవి, స్థానిక హాకీ క్రీడాకారులకు 50 వేల రూపాయలు విలువచేసే గోల్ కీపర్ కిట్టు, బీప్స్, బాల్స్, అందజేశారు. ప్రతి సంవత్సరం ఈ విధంగా క్రీడాకారులకు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొటారు నరేష్, జీవి రెడ్డి, డి మహేష్, జి రాంబాబు, హర్ష, లోకేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి ఘన సన్మానం

ఎస్ రాయవరం,మే 15, ప్రభాతవార్త



మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన గుదే గీతాన్విత 582 మార్కులు సాధించడంతో ఎస్ రాయవరం మండలంలో తృతీయ స్థానం సంపాదించిన విద్యార్థినికి చిరు సత్కారం జరిగింది. గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్ సియ్యాధుల అచ్యుత్ కుమార్ ఆధ్వర్యంలోసన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీతాన్విత పాఠశాలకు, గ్రామం నకు మంచి పేరు తీసుకు వచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకొని రాబోయే విద్యాసంవత్సరంలో విద్యార్థులు,ఇంతకన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు యం యస్ ఎన్ ప్రశాంతి, ధర్మవరం-అగ్రహారం మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ కుమార్(నాని),బండి నాగేశ్వరరావు,కోరుప్రోలు రమణ,నగిరెడ్డి అప్పారావు,ఎన్ యస్ ఉపాధ్యాయులు రాజాన అప్పలనాయుడు,తుంపాల రాంబాబు,గజివెల్లి గణేష్,మైచర్ల అప్పారావు,గుదే నాగేశ్వరరావు,బంగారు శ్రావణ సంధ్య పాల్గొన్నారు.

# కొరుప్రోలు గ్రామంలో, కిషోర్ వికాసం, వేసవి కాలం సమావేశం



ఎస్ రాయవరం,మే 15, ప్రభాతవార్త

కొరుప్రోలు గ్రామంలో కిషోర్ వికాసం వేసవి కాలం సమావేశం నిర్వహించడం జరిగింది. శుక్రవారం కొరుప్రోలు శ్రీ నూకాంభిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం" 11 సంవత్సరంలో నుండి 18 సంవత్సరం" లోపు గల బాల బాలికలకు జీవన నైపుణ్య అభివృద్ధి,రుతుస్రావం పరిశుభ్రత,ఆరోగ్యం,యోగ, విద్య,భవిష్యత్ పై అవగాహన స్మార్ట్ ఫోన్స్, ఫోక్సో,గృహహింస చట్టాలపై అవగాహన డ్రగ్స్ వంటి విషయాలపై కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. వచ్చే నెల 10వ తేదీ వరకు వారంలో రెండు రోజులు మంగళవారం మరియు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఆడపిల్లలతో, మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు మగ పిల్లలతో సమావేశాలు ఏర్పాటు చేసి,వారికి అర్థం అయ్యే భాషలో అన్ని విషయాలపై అవగాహన కల్పించి, 15 మంది పిల్లలకు తక్కువ లేకుండా 20 మంది పిల్లలకు మించకుండా, ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి పిల్లల కు సమస్యలు లేని గ్రామంగా, చేయడం దీని ముఖ్య ఉద్దేశం అని, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు.కిషోరి వికాసం సెషన్ 5 హెచ్ ఐ వీ / ఎ యిడ్స్ పై మరియు పిల్లలకు సంబంధించి,పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించడం జరిగింది. బాలల అవసరాలు చదువు, చదువుకు కావలసిన పుస్తకాలు,ఆరోగ్యం, ఆడుకోవడానికి కావలసిన వస్తువులు,మానసిక స్థిరత్వం వంటి విషయాలను, పిల్లలపై జరుగుతున్న వేధింపులు,పిల్లల హక్కులకు భంగం కల్పించే విధంగా ఉండటం,చదువు మధ్యలో ఆపివేయడం,ఆర్థిక పరిస్థితులు,ఫీర్ గ్రూప్స్ ప్రెషర్,స్మార్ట్ ఫోన్ కి దూరంగా ఉంటూ వారి భవిష్యత్తును రక్షించుకోవాలని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఎం.శ్రీవిద్య, చైల్డ్ అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి, ఎం.రమేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, కె.ఎల్.మనోహర్, రక్షణ అధికారి, ఎస్.ఐ,ఎస్.రమేష్, ఉపాధ్యాయిణి బి. వరలక్ష్మి, కొరుప్రోలు,ఎస్.కె.ఆశ యం ఎల్ హెచ్ పీ , డి.ఉన్నిష, సి.హెచ్.సత్యవతి సూపర్వైజర్స్, రాజేష్, వెలుగు సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్,వి.సంతోషి, అంగన్వాడీ టీచర్స్, విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న పప్పల చలపతిరావు

ఎలమంచిలి, మే 15, ప్రభాతవార్త



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు, సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలపై వచ్చిన వారి వద్ద నుండి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ (నానాజీ), జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, యూత్ అధ్యక్షులు నమ్మి రమణ, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దంట్ల వెంకటస్వామి, సేనాపతి తులసీరామ్, ఎస్ రమణబాబు, కరెడ్ల మల్లికార్జునరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె బాబురావు, గుర్రాల రాము, కోటి బాబు, అర్జున్ మూర్తి, పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు రద్దు చేయాలి: సిపిఎం నేత అప్పలరాజు



ఎస్ రాయవరం,మే 15, ప్రభాతవార్త

కేంద్రం ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్మవరం అగ్రహారం ఆటో స్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ దేశ ప్రజలు అందరూ ఊహించినట్లే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడానికి సన్నాహాలు చేస్తుందని, అనుకున్నట్లు గానే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పెంచిన మూడు రూపాయలు పెట్రోల్, డీజిల్ ధరలు వలన శుక్రవారం నుండి పెట్రోల్ నూట పదమూడు రూపాయలు, డీజిల్ తొంబై తొమ్మిది రూపాయుల డబై ఆరు పైసలు అవుతుందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడతారన్నారు,వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ఏ.వరహాలరావు,కె.శ్రీను, జీ.నాగేష్, బి.శ్రీను, జీ.అప్పలరాజు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కరాటే మాస్టర్ వెంకటరామన్ ఆధ్వర్యంలో కరాటే, బాక్సింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం

ఎలమంచిలి, మే 15, ప్రభాతవార్త



పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతం లో కరాటే మాస్టర్ నక్కా వెంకటరామన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహి స్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలోని 8 సంవత్సరాలు పైబడిన పిల్లలకు నెల రోజులపాటు ఈ శిక్షణలో మెలకువలు నేర్పిస్తామని మాస్టర్ నక్కా వెంకటరామన్ తెలిపారు. ప్రస్తుతం బాలికలకు స్వీయ రక్షణ, శరీర దృఢత్వం చాలా అవసరమని ఈ ఉచిత శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మజ్జిగ పంపిణీ



నక్కపల్లి ,ప్రభాతవార్త

నక్కపల్లి సత్య సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం వారపు సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి భజన మండలి సభ్యులు కక్కిరాల సురేష్‌తో పాటు నున్న విశ్వేశ్వరరావు, కొత్త భగవాన్ ,నున్న కాశీ విశ్వనాథ్, సత్తికొండ, నవర నూకరాజు శర్మ తదితరులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.




# సామాజిక వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణలో భాగస్వామ్యంపై అవగాహన

గొలుగొండ మే 15 ప్రభాతవార్త




మండలంలో సామాజిక వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంపొం దించాలని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్‌లో పంచాయతీ కార్య దర్శులతో నిర్వహించిన సిఎస్‌సి అవగాహన డాక్యుమెంటరీ ద్వారా జరిగిన శిక్షణా కార్యక్ర మంలో మరు గుదొడ్ల వినియోగంపై ప్రజా భాగస్వామ్యం పెరగాలని అన్నారు. గ్రామాల్లో ఉండే మరుగుదొడ్లే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలు అంగన్వాడి, పాఠశాలలు పంచాయతీ భవనాలు వద్ద ఉండే మరుగుదొడ్లను గుర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలతో పాటు ఆయా సిబ్బంది కూడా అవగాహన కలిగించాలన్నారు. వీటి ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

# కిషోర్ వికాసంపై శిక్షణా కార్యక్రమం

గొలుగొండ మే 15 ప్రభాతవార్త



కిషోర్ బాలబాలికలలో తలెత్తుతున్న రక్తహీనత పౌష్టికాహార లోపాలను అధిగ మించేందుకు ఐసిడిఎస్ ద్వారా నిర్వహి స్తున్న శిక్షణా తరగతులు ముంగర్లపాలెం కోడలు పాలెం నర్సింగపల్లి అంగన్వాడి సెం టర్లలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీ గౌరీ ప్రత్యేకంగా హాజరై ఈ వేసవిలో కిషోర్ బాల బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రధానంగా రక్తహీనతను అధికమించి దృఢమైన బాలబాలికలుగా ఎదగాలని ఇందుకు తగిన ఆహార నియమాలపై అవగాహన పెంపొందేలా శిక్షణ ఇవ్వాలి అన్నారు. గ్రామాల్లో రోజురోజుకు పెరుగు తున్న ఆహార లోపాలు తాతలు కాలం నాటి ఆహార అలవాట్లను వినియోగంలో తీసుకువచ్చే ఉద్దేశమే లక్ష్యం గా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీల ద్వారా నిర్వహిస్తున్న అవగాహన శిక్షణ తరగతులు బాలబాలికలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది వారితో ఎప్పటికప్పుడు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సత్యవతి, అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి, మంగ, ఆయాలు, కిషోర్ బాల బాలికలు పాల్గొన్నారు.

# 220 కె.వి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు కారణంగా మే 16 నుండి 24 వరకు విద్యుత్‌కు అంతరాయం

యలమంచిలి, మే 15 ప్రభాతవార్త

రాంబిల్లి, అచ్యుతాపురం మండలం ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)లో ఉన్న 220 కె.వి బ్రాండిక్స్ ఉప కేంద్రంలో పవర్ ట్రాన్స్ఫర్మర్ -3 ఆయిల్ మరమ్మత్తులు కారణంగా ఈనెల 16 నుండి 24 సాయంత్రం వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగునని అనకాపల్లి జిల్లా కార్యనిర్వాహక ఇంజనీర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు, మిగిలిన రెండు పవర్ ట్రాన్స్ఫర్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా యధావిధిగా కొనసాగిస్తా మని అన్నారు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు, అనివార్య కారణాలవల్ల అంతరాయం ఏర్పడినచో ప్రజలు సహకరించాలని కోరారు.

# ప్రసూతి ఆస్పత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి హైమావతి



అనకాపల్లి మే 15, ప్రభాతవార్త

స్థానిక రావులపాలెంలో ఉన్న ప్రసూతి ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హైమావతి శుక్రవారం సందర్శించారు. హాస్పటల్‌లో ప్రతి వార్డుని క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ పాలకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఈ హాస్పిటల్ సుమారుగా 80 సంవత్సరాల నిర్వహించడం జరుగుతుందని, వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈ హాస్పిటల్ నిర్వహించడం జరుగుతుందని ఆమెకు వివరించారు. అదే విధంగా హాస్పటల్లో గల ఏఎంఏపీఎం రోటరీ ఐ హాస్పిటల్ కూడా సందర్శించారు. ఐ హాస్పిటల్ చైర్మన్ బుద్ధ రమణాజి డిఎంహెచ్ఓకి ఐ హాస్పిటల్ చేస్తున్న సేవా కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ అభయ యాప్ గురించి ప్రతి ఒక్కరు కూడా నిశ్చితంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, హాస్పిటల్ ప్రెసిడెంట్ రంగారావు, కార్యదర్శి రామ అప్పలనాయుడు (చినరాము), సి.సి లక్ష్మీనారాయణ, సిబ్బంది రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీసీకి ఉపాధ్యాయ సమస్యలపై వినతి

అనకాపల్లి మే 15, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ఏపీసీ గా ఇటీవల నియమితులైన ప్రత్యేక ఉప కలెక్టర్ కే శ్రీరాములను శుక్రవారం ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, సబ్ కమిటీ, అనకాపల్లి శాఖ ప్రతినిధులు కలిసి పుష్ప గుచ్ఛం, సంఘ డైరీ అందజేసే అభినందించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నూతన పాఠ్య పుస్తకాలపై త్వరలో జరగనున్న శిక్షణా కార్యక్రమాల కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా శిక్షణ కేంద్రాల్లో ముందస్తుగా అన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై శ్రీనివాసరావు, ఎస్ దుర్గాప్రసాద్, సబ్ కమిటీ సభ్యులు ఎం మహాలక్ష్మి నాయుడు దేవుడు బాబు, ఎం రామ్మూర్తి, కొణతాల గణేష్, ఆదారి నరసయ్య నాయుడు, పినిశెట్టి జగదీష్, బి.కన్నారావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవం





నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లి పట్నంలోని రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న సిద్ధి వినాయకుని ఆలయ 14వ వార్షికోత్సవం వందలాది మంది భక్తులు నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్వామివారిని చిన్న పల్లకిలో తిరువీధి ఉత్సవం ఏర్పాటు చేయగా పురవీధుల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా ఆలయ కమిటీ ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసింది. శనివారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.




## ప్రతి ఒక్కరూ కుటుంబ సర్వేను సహకరించండి

### ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ



పాడేరు,మే15, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో భాగంగా పివిటిజి కుటుంబల యొక్క సమాచారం కొరకు నిర్వహిస్తున్న సర్వేకు మండల అభివృద్ధి అధికారి ముఖ్య భూమిక తీసుకొని ఈ యొక్క సర్వేను శత శాతం పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ ఆదేశించారు. భారతదేశంలోని గిరిజన జాతులలో అత్యంత అట్టడుగున ఉన్న వర్గాలైన, పివిటిజి కుటుంబాల యొక్క సామాజిక-ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి భారతదేశ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాలు దీర్ఘకాలికంగా అభివృద్ధిలో ఉన్న అంతరాలను తగ్గించడానికి మరియు దేశవ్యాప్తంగా ప్రతి పివిటిజి కుటుంబనికి అవసరమైన సేవలు అందేలా చూడటమే లక్ష్యంగా పెట్టుకున్నాది. సమగ్ర అభివృద్ధి ఫలితాలను సాధించడానికి, పివిటిజి కుటుంబాలకు అవసరమైన పథకాలు, ప్రయోజనాలు అందించడానికి వారు అందించే పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కలసి వారి అభివృద్ధి లక్ష్యంతో పనిచేస్తున్నాయి. అందుకు గాను, పివిటిజి కుటుంబలను గుర్తించి, ధృవీకరించబడిన కుటుంబల వివరాలు, వారి స్థాయి సమాచారంను రూపొందించడానికి కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సర్వే సేతు అనే మొబైల్ సర్వే అప్లికేషన్‌ను ద్వారా ప్రతి పివిటిజి కుటుంబల యొక్క సమాచారంను సేకరిస్తుంది. ఈ సమాచారం సేకరణలోభాగంగా ప్రభుత్వం ద్వారా నియమించిన సర్వేయర్లు ప్రతి కుటుంబన్ని సందర్శించి సర్వే చేయడం జరుగుతుంది. ఈ సర్వేలో భాగంగా మీ ఇంటికి వచ్చిన సర్వేర్లకు మీ కుటుంబ సభ్యుల వివరాలను అందించి నమోదు చేయించుకోవలెనని, ఇందులో భాగంగా మీ దగ్గర ఉన్న దృవపత్రలు,ఆధార్ కార్డు,రేషన్ కార్డు,బ్యాంకు ఎకౌంటు వివరాలు ,భూమి పట్టాలు, కుల దృవికరణ పత్రలను వారికి చూపించి సరైన సమాచారన్ని వారికి అందిచవలసి ఉంటుందని, ఈ సర్వే ద్వారా పివిటిజి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నేరుగా వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము చెల్లింపు జరుగునని, అలాగే గ్రామ స్థాయిలో ప్రభుత్వ సిబ్బంది అయిన పంచాయతి కార్యదర్శి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వారి పరిధిలో ఉన్న అన్ని పివిటిజి కుటుంబాలకు సర్వేయర్లు తో కలసి సర్వే పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సంబంధిత ఆదేశించారు.

## గిరిజన సంక్షేమ శాఖ టీచర్ల సమస్యలపై డిడికి వినతి



**పాడేరు, మే15, ప్రభాతవార్త:** అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంహలకు పరిమళ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్ జిల్లా శాఖ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన రెమెడియన్ టీచింగ్ తరగతులకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని అదేవిధంగా రెమెడియన్ క్లాసులకు హాజరవుతున్న విద్యార్థులకు వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని తగు ఏర్పాట్లు చేయాలని వారికి కావాల్సిన పోషక ఆహారం మజ్జిగ పండ్లు అందించాలని డిడి నాయకులు కోరారు. 2025 సంవత్సరంలో రెమిడీల్ క్లాసులకు హాజరైనట్లు ఉపాధ్యాయులకు ఈరోజు వరకు సంపాదిత సెలవులు మంజూరు చేయలేదు వాస్తవానికి వేసవి సెలవులో పని చేసిన కాలానికి సంపాదిత సెలవులు మంజూరు చేయాలి కానీ అధికారులు సంపాదిత సెలవులు మంజూరు చేయలేదనీ, ఉపాధ్యాయులకు కన్వీనియన్స్ అలవెన్స్ మంజూరు చేయాలి సమస్యల పరిష్కారం కోసం ప్రాతినిధ్యం చేయడం జరిగిందనీ దీనిపై గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు పరిమళ సానుకూలంగా స్పందించారు. రెమెడియన్ క్లాసులకు హాజరైన ఉపాధ్యాయులలో శతశాతం ఉత్తీర్ణత పొందిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సబ్జెక్టు టీచర్స్ కు మాత్రమే ఇయల్స్ చెల్లిస్తామని చెప్పి చెప్పడం అసంబద్ధమైనచర్య ఈ నిబంధనను ఉపసంహరించుకుని వేసవి సెలవులు కోల్పోయిన ఉపాధ్యాయులకు చెల్లించాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయి అధికారులకు సంప్రదింపులు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. రఘునాథ్, వి. మహేశ్వరరావు , జిల్లా కార్యదర్శులు ఈ దేముడు ఎస్.కన్య పాల్గొన్నారు.

## బెట్టు కాట వ్యాపారులపై దాడులు



**డుంబ్రిగూడ, మే 15, ప్రభాతవార్త:** మండలంలోని శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో జిల్లా కొలతలు తూనికల శాఖ అధికారులు బెట్టుకాటలపై దాడులు నిర్వహించారు. ఈ బెట్టుకాటలతో గిరిజనులను మోసం చేస్తున్న కాటాలను సీజ్ చేసి వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెట్టు కాటలతో అమాయక గిరిజనులను మోసం చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పదని జిల్లా అధికారిణి అనురాధ హెచ్చరించారు.

## అరకులోయ వెంకన్న ఆలయం వద్ద ఉచిత ధ్యాన శిక్షణ

**అరకులోయ, మే 15, ప్రభాతవార్త :** అరకులోయ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద శుక్రవారం హార్ట్ ఫుల్ నెస్ సంస్థ, శ్రీరామ్ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఉచిత ధ్యాన శిక్షణ ఈనెల 17వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహిస్తున్నారు. 15 సంవత్సరాలు పైబడిన ప్రతిఒక్కరూ ఈ ఉచిత దిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. దీనిద్వారా ఆధ్యాత్మిక , మానసిక ప్రశాంతత పొందుతారన్నారు. మరిన్ని వివరాలకు శివ శంకర్ 9247464006, 9381615768 అనే నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## పాడేరు ఘాట్ రోడ్డులో

## భారీ వాహనాలు, సరుకు రవాణా వాహనాలు నిషేధం



**పాడేరు,మే15, ప్రభాతవార్త:** పాడేరు శ్రీమోధ కొండమ్మ అమ్మవారి పండగఈ నెల17,18,19 తేదీల్లో జరగనున్న దృష్ట్యా శుక్రవారం 17 వ తేదీ నుండి పాడేరులోకి భారీ వాహనాలను, సరుకు రవాణా వాహనాలను నిషేధించడం జరిగిందని చింతపల్లి అడిషనల్ ఎస్పీ నవజ్యోతి మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా అమ్మవారి పండగ మూడు రోజులు సాయంత్రం రెండు గంటల నుంచి ఏ వాహనాన్ని పాడేరులోకి అనుమతించబడదన్నారు. వైజాగ్ నుండి అరకు వెళ్లే వాహనాలు వంతాడపల్లి మీదుగా తుంపాడ ,సన్యాసమ్మ పాలెం అడారిమెట్ట నుండి చింతలవీధి కి రావాలనీ అలాగే అరకు నుండి వచ్చే వైజాగ్ వెళ్లే వాహనాలు అడారిమెట్ట నుండి సన్యాసమ్మపాలెం తుంపాడ వంతాడపల్లి చెక్ పోస్ట్ మీదుగా చోడవరం రోడ్డులోకి తిరగాలని, వైజాగ్ నుండి జి.మాడుగుల వెళ్ళే వాహనాలు నక్కలపుట్టు, వర్తనపల్లి ,లగిసపల్లి మీదుగా సెయింట్ ఆన్స్ వచ్చి జి.మాడుగులపై వెళ్ళాలనీ, జి.మాడుగుల నుంచి వైజాగ్ వెళ్లే వాహనాలు సెయింట్ ఆన్స్ లగిసపల్లి, నక్కల పుట్టు మీదుగా చోడవరం రోడ్లోకి వెళ్ళాలనీ,జి. మాడుగుల నుంచి అరకు వెళ్లే వాహనాలు బొక్కల్లో జంక్షన్ నుండి గుత్తులపుట్టు వచ్చి చింతల వీధికి వచ్చి అరకు వెళ్ళాలనీ, అరకు నుండి జి.మాడుగుల వెళ్లాల్సిన వాహనాలు అరకు నుండి చింతల వీధి,గుత్తులుపుట్టు బొక్కెళ్ళ జంక్షన్ను వచ్చి జి.మాడుగుల వెళ్లాలనీ ఏఎస్పీ నవ స్పష్టం చేసారు. కావునా ప్రయాణికులు భక్తులు, వాహనదారులు గమనించి సహకరించాలని దీనబంధు కోరారు.

## పసికందు అపహరణ కేసులో నిందితురాలు

## మా గ్రామ వాసి కాదు



హుకుంపేట, మే 15, ప్రభాతవార్త: ఈనెల 14వ తేదీ నఅపహరణకు గురైన పసికందు కేసులో ఉప్ప గ్రామానికి చెందిన సంతారి కృష్ణవేణి అనే మహిళపేరును పోలీస్ శాఖ వారు ప్రకటించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉప్పనుంచి, పాడేరు వెళ్లే బస్సులను ఆపి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమల కృష్ణారావు , గ్రామస్తులు మాట్లాడుతూ సంతారి కృష్ణవేణి అనే అమ్మాయి తప్పుడు చిరునామా ఇచ్చిందని అయితే అటువంటి పేరు గలవారు తమ గ్రామంలో లేరని దీనివలన తమ గ్రామానికి చెడ్డ పేరు వచ్చిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి సమాచారం లేకుండా తప్పుడు అడ్రస్ ను పోలీసులు ఎలా ప్రకటించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలో జరిగినప్పుడు వారు చెప్పే సమాచారాలు నమ్మకుండా పోలీసులు పూర్తిగా వివరాలు సేకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మోదకొండమ్మ జాతర ఉత్సవ పోస్టర్లో

## మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నేతల అభ్యంతరం



పాడేరు,మే15,ప్రభాతవార్త: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ శ్రీ మోదకొండమ్మ ఉత్సవ పోస్టర్ లో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేకపోవడంపై అల్లూరి జిల్లా బీజేపీ జిల్లా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం పాడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు, జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పాడేరు కూటమిలో బీజేపీ కి ప్రాధాన్యత లేకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ వ్యవహార శైలిపైవారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉత్సవ పోస్టర్ జిల్లా కలెక్టర్ విడుదల చేసినప్పుడు మోడీ ఫోటో ఉందని కానీ ఉత్సవ కమిటీ విడుదల చేసిన పోస్టర్ లో సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు మాత్రమే ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో ఉత్సవ కమిటీ ఆవిష్కరణలో లేకపోవడంపై బీజేపీ నాయకులు అగ్రహారం వ్యక్తం చేశారు,మోద కొండమ్మ అమ్మవారి ఆలయం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉందంటే అది బీజేపీ సీనియర్ నాయకులు స్వర్గీయ కురుసా బొజ్జయ్య చేసిన కృషి ఫలితం మేరకు నేడు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ఉందని వారు గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మినిస్టర్ గా ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయం ఎండోమెంట్ కి అప్పగించే ప్రయత్నం బీజేపీ కురుసా బొజ్జయ్య హైకోర్టు లో స్టే తెచ్చిన సంఘటన మర్చిపోయారా అని వారు ప్రశ్నించారు,ఇకనైనా కూటమి నాయకులు ఉత్సవ కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్సవ జరుపుకోవాలని ఆశించడం తప్పు కాదని రాజకీయాలు అతీతంగా పండుగ జరగాలని, సాక్షత్తు నిబంధనలు ప్రకారం స్థానిక శాసన సభ్యులు ఆలయ కమిటీ చైర్మన్ ని కూడా పక్కన పెట్టి ఉత్సవ కమిటీ ఉత్సవం జరుపుకోవాలని అనుకోవడం సరికాదని వారు హితవు పలికారు,ఇకనైనా జిల్లా కలెక్టర్, ఉత్సవ చైర్మన్ అందర్నీ కలుపుకొని ఉత్సవం జరిపించాలని వారు వెంటనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటో పోస్టర్ లో పెట్టాల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్ పెనుమాక, సల్లా రామకృష్ణ,, కూడా కృష్ణా రావు,నందోలి ఉమా మహేష్, డొంబు నాయుడు, కురుసా లక్ష్మయ్య, లకే అబ్బాయి దొర,కేజీయా రాణీ, కదుళ్ల శ్రీనివాసరావు, పండా ఈశ్వరరావు, తంగుల సత్యవతి, రాస పాపిటి రాజు, సత్యనారాయణమ్మ కుంజం, తదితరులు పాల్గొన్నారు.

## మోదకొండమ్మ తల్లి జాతర సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

### - జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ



పాడేరు,మే15, ప్రభాతవార్త: పాడేరు మోదకొండమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో భారీగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 17,18,19వ తేదీలలో అమ్మవారి జాతర జరగనున్నందున, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజలందరూ" రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి "అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ మూడు రోజులు నిర్వహించే మెగా శిబిరంలో జిల్లాలోని, రెవెన్యూ,సచివాలయ, పోలీస్ శాఖ సిబ్బందికి,స్వచ్ఛంద సేవా సంస్థలు, పండగలో పాల్గొనే యువతీ యువకులుపెద్ద ఎత్తున పాల్గొని, రక్తదానం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులు, స్థానికులు మానవతా దృక్పథంతో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, జిల్లా రెడ్ క్రాస్ యంత్రాంగంతో మమేకం అవ్వాలని , మీతో పాటు పదిమంది యువతీ యువకులను రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. రెడ్ క్రాస్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లాలో ప్రతి ఒక్క జిల్లా అధికారి, వారి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రెడ్ క్రాస్ 'లైఫ్ మెంబర్‌షిప్' డ్రైవ్‌లో పాల్గొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రెటరీ జి. గౌరీ శంకర్రావు, కోశాధికారి పి. సూర్యారావు రెడ్ క్రాస్ సిబ్బంది, జిల్లా కోఆర్డినేటర్ ఎస్. పూర్ణానంద, ఎంసీ మెంబర్లు ఇతర రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి : కలెక్టర్



పాడేరు,మే15, ప్రభాతవార్త: జిల్లాలోని బడి ఈడు కలిగిన ప్రతి బిడ్డ తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలని, ఏ ఒక్కరు కూడా బడికి దూరం కాకూడదని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా లో 100% బడి ఈడు పిల్లలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో 5 నుండి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలబాలికలందరినీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యంతో పిల్లలకు పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించి, వారిని తిరిగి బడిబాట పట్టించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇతర వసతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్య బోధనలో ఎంతో మెరుగుగా ఉందని, బడి ఈడు పిల్లలందరినీ ప్రోత్సహించి స్కూల్లో చేర్పించే విధంగా చూడాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.కృష్ణారావు, సర్వ శిక్ష అభియాన్ ఏపీసి స్వామి నాయుడు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పిబికె పరిమళ, గురుకులం ఓఎస్డి పి ఎస్ ఎన్ మూర్తి పాల్గొన్నారు.

## అమ్మవారి జాతరకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

### పాడేరు డిపో మేనేజర్ శ్రీనివాసరావు

పాడేరు,మే15, ప్రభాతవార్త: శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా పాడేరు ఏపీఎస్ఆర్టీసీ డిపో బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నారని డిపో మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.పాడేరు నుండి చోడవరం విశాఖపట్నం మధ్యలో 34 బస్సులు. పాడేరు,అరకు 17.జోలాపూట్, ముంచంగి పుట్టుకు18బస్లు. పాడేరు నుండి చింతపల్లి వైపు 21 బస్ లురాజమండ్రి కి రెండు బస్సులు కాకినాడకు రెండు బస్సులు ఒక బస్ మద్దిగరువు, ఒక బస్ మూల కొత్తూరు,ఒక బస్ చీకుమద్దుల , రోజువారి సర్వీసులు కంటే అదనంగా మరొక అన్ని సర్వీసులను పెంచుతూ నడుపుటకు ప్రణాళిక రూపొందించేయమన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఉన్న నిమిత్తం ముఖ్యంగా విశాఖపట్నం చోడవరం నుండి వచ్చే బస్సులు నక్కల పుట్టు దగ్గర గల పెట్రోల్ బంక్ వద్ద వి ఆర్ ఫంక్షన్ హాల్ నుండి ఆదివారం సాయంత్రం నుండి సోమ, మంగళవారంలో తిరుగుతాయన్నారు. ఆదివారం, సోమవారం, మంగళవారం ,చింతపల్లి వైపు బస్సులు జీ మాడుగుల వైపు బస్సులు సెయింట్ ఆన్స్ స్కూలు దగ్గర గల పెట్రోల్ బంకు వద్దనుండి ట్రిప్పులను నడపబడునుఅరుకు జోలాపుట్ ముంచంగి పుట్టు సర్వీసులు పాడేరు కాంప్లెక్స్ నుండి నడపనున్నామన్నారుబుధవారం నుంచి అన్ని బస్సులు యాదవిధిగా పాడేరు బస్టాండ్ నుండి నడుపబడునుప్రయాణీకులు పై సౌకర్యాలు వినియోగించుకొని అమ్మవారిని దర్శించుకుని వెళ్ళవలసిందిగా డీఎం శ్రీనివాసరావు కోరారు.

## ఆర్వీనగర్ పాలగెడ్డ రహదారికి మోక్షం

### రూ. 18 కోట్లతో చురుగ్గా సాగుతున్న నిర్మాణం



గూడెం కొత్తవీధి మే 15 (ప్రభాతవార్త): ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకొని ఆర్వీ నగర్ పాలగెడ్డ రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ..18 కోట్ల వ్యయంతో ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.. ఆ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. ఆర్వీనగర్ పాలగెడ్డ వరకు రహదారి గత పదిహేనేళ్లుగా మరమ్మతులకు నోచుకోక గోతులమయంగా మారింది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఈ రోడ్డు రూపు రేఖలు మారిపోయాయి. రోడ్డు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి రూ. 18 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరైన నిర్మాణ పనుల ప్రారంభానికి ఏడాదిన్నర పట్టింది. ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం లంకపాకలు గూడెం కొత్తవీధి మధ్య నిర్మాణం పనులు జరుగుతు న్నాయి. జీకేవీధిలో శుక్రవారం జరుగు తున్న నిర్మాణాన్ని ఆర్ అండ్ బి చిం తపల్లి ఏఈఈ జయరాజ్ పరిశీలిం చారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## కిషోరీ వికాస వేసవి తరగతులు



అరకు రూరల్, మే 15, ప్రభాతవార్త : కిశోర, కిషోరీ బాల బాలికలకు వేసవి అవగాహన తరగతులు మే1 నుండి జూన్ 9 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న ట్టు అల్లూరు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. కిశోరీ బాలికలకు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (ఐ.సి.డి.యస్) వారి ఆధ్వర్యంలో ఈ వేసవికాల శెలవల్లో ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నారు. అరకులోయ మండలంలోని 168 అంగన్వాడి సెంటర్లో ఈ కార్యక్రమంలు నిర్వాహించబడుతున్నాయ్. 39 రోజుల పాటు ఆయా అంగన్వాడి సెంటర్లలో ఈ తరగతులు జరుగుతాయని అరకు లోయ ఇన్చార్జి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి లక్ష్మి తెలియజేశారు. ఈ తరగతులలో 11 నుండి 18 వయసు ఉన్న కిషోరీ,కిషోరా బాల బాలికలకు పోషక ఆహారం,ఆరోగ్యం,పరిశుభ్రతా ,చైల్డ్ ఎబ్యూజ్ (బాల లైంగిక హింస)-చట్టాలు,ఎనీమియా - జాగ్రత్తలు,బాల్య వివాహాలు,ప్రవర్తన, సెల్ ఫోన్లు వినియోగం, విద్యా వైద్యం ఆరోగ్యం, జీవన విధానం వంటి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి పూర్తి అవగాహన కల్పిస్తున్నామని ఆమె అన్నారు. వేసవి సెలవుల్లో బాల, బాలికలు పాఠశాలలకు ఇళ్లకు వచ్చి ఖాళీగా ఉంటారు కనుక వారి ఖాళీ సమయంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం బాలికలకు మధ్యాహ్న బాలురకు తరగతుల నిర్వహిస్తున్నామన్నారు. ఎదిగే వయసులో బాల,బాలికలు తీవ్ర మానసిక గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటూ ఉంటారని ఆ సమయంలో వారికి సరైన ఆలోచన చెప్పేవారు ఉండరని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో యువత తమ సమస్యలు ఇతరులతో పంచుకునేందుకు బిడియపడుతూ ఉంటారని అలాంటి వారికి వికాస తరగతులు ఎంతో ఉపయోగపడతాయనీ తెలిపారు. అలాంటి వారు తీసుకోవలసిన ప్రతి జాగ్రత్తను గూర్చి పూర్తి అవగాహన కలిగే విధంగా ఈ తరగతులు వివరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఒక్కొక్క సెంటర్లో 30 మంది బాల బాలికల చొప్పున మండలంలోని 168 సెంటర్లలో సుమారు నాలుగు నుండి ఐదువేల మంది కిషోర,కిషోరీ బాల, బాలికలు ఈ వేసవి వికాస కార్యక్రమం వల్ల అవగాహన పొందు తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయిలో స్త్రీ- శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఈ మొత్తం కార్యక్రమాలను జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ ఆనంద్ పర్యవేక్షణలో నిర్వహించబడుతున్నట్లు అల్లూరు జిల్లా స్త్రీ -శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.

## అధికారులంతా విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ టి.నిశాంతి



పాడేరు,మే15, ప్రభాతవార్త: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్ ) కు 62 వినతులు, రెవెన్యూ క్లినిక్ 41 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ , ఐటిడిఏ పివో ఆదిత్య వర్మ, డిఆర్వో (ఎఫ్ ఏ సి )ఎమ్ వి ఎస్ లోకేశ్వరరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల వినతులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిడి డిఆర్‌డిఏ వి.మురళి,పిడి డ్వామా డి.విద్యా సాగర్,జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణారావు, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ , పిడి ఐసిడిఎస్ ఝాన్సీ బాయ్ పడల్, గురుకులం ఓఎస్డి మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, జిల్లా సమాచారం పౌర సంబంధాల అధికారి కె. వెంకట రావు, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపిసి. సోము నాయుడు, గురుకులం ఓఎస్డి మూర్తి, డిపిఓ చంద్రశేఖర్‌రావు, డిఎల్పిఓ పి.ఎస్ కుమార్, జిల్లా మలేరియా అధికారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్, ఈ ఈ ఆర్డబ్ల్యుఎస్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతునాయుడు, జిల్లా అధికారులు, పాడేరు, జి మాడుగుల,అనంతగిరి, హుక్కుంపేట, అరకు పలువురు తాహసిల్దార్లు, తదితరులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అరకులోయలో స్వచ్ఛఆంధ్ర .. స్వర్ణాంధ్ర

అరకు రూరల్, మే 15, ప్రభాతవార్త:అరకు లోయ మండలంలోని పెదలబుడు గ్రామపంచాయతీ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఆవరణలో "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడును. అరకు లోయ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో 16 వ తేదీన "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వి. ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, ఒక్కసారే వినియోగించే ప్లాస్టిక్ నిర్మూలన, తడి మరియు పొడి చెత్తను వేరు చేయడం, స్వచ్ఛ రథం ద్వారా వ్యర్థాల సేకరణ, సేంద్రియ ఎరువు తయారీ, హరిత పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు చేపట్టబడతాయి. అలాగే గ్రామాలలో స్వయం సహాయక సంఘాలు, యువత మరియు హరిత ప్రతినిధుల భాగస్వామ్యంతో "వ్యర్థాల నుంచి సంపద" కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుంది. ప్రతి గ్రామపంచాయతీలో పాత్రల బ్యాంకు ఏర్పాటు చేసి ఒక్కసారే వినియోగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోబడతాయి. గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుటకు సహకరించాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కోరారు. ప్రజలు తమ ఇళ్ల వద్దనే తడి మరియు పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ రథానికి అందించాలని సూచించారు. అన్ని పంచాయతీ సిబ్బంది, హరిత ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు మరియు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడమైందని తెలిపారు .

## తలసేమియాతో బాధపడుతున్న బాలుడ్ని ఆదుకోండి



గూడెం కొత్తవీధి మే 15 (ప్రభాతవార్త): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న గిరిజన బాలుడి జస్వంత్ ను ఆదుకోవాలని రింతాడ మాజీ ఉప సర్పంచ్ సోమేష్ కుమార్ కోరారు. జి కే వీది మండలం రింతాడ పంచాయతీ బొడ్డుమాను వీధికి చెందిన పాంగి రమణ, రూత్ దంపతుల ఏడాదిన్నర బాలుడు జస్వంత్ పుట్టుకతోనే తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. విశాఖపట్నం కేజీహెచ్ హాస్పటల్ వైద్యులు బాలుడికి తలసేమియా మేజర్గా నిర్ధారించారన్నారు. బాలుడు ప్రాణాలతో ఉండాలంటే ప్రతి 15 రోజులకు లేదా నెలకు ఒకసారి రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా మెడికల్ పెన్షన్ కోసం కుటుంబ సభ్యులు సచివాలయం మరియు వైద్య అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటం, తల్లి బాలుడి సంరక్షణలో ఉండటం వల్ల తండ్రి ఒక్కరే సంపాదిస్తూ ఇంటి ఖర్చులు మరియు వైద్య ఖర్చులు భరించడం చాలా కష్టంగా మారిందని పేర్కొన్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ అధికారులు , వైద్య సిబ్బంది వెంటనే స్పందించి ఎన్టీఆర్ భరోసా మెడికల్ పెన్షన్ మంజూరు చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా జ్ఞానేశ్వరి



గూడెం కొత్తవీధి, మే 15, (ప్రభాతవార్త) : ప్రముఖ పుణ్య క్షేత్రం సింహాచలం నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా చల్లంగి జ్ఞానేశ్వరి ని నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని టీఎన్ఎస్ఎఫ్ జికె వీధి మండల అధ్యక్షుడు గుంట బుజ్జిబాబు, కార్యదర్శి ముక్కలి ఐశ్వర్య హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా చింతపల్లి మండలానికి చెందిన చల్లంగి జ్ఞానేశ్వరి గత ఇరవై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఆమె వివిధ హోదాల్లో పనిచేసి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. తాజాగా ఆమె చేసిన సేవలు గుర్తించిన ప్రభుత్వం సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా నియమించడం అభినందనీయమన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదులు పరిష్కరించాలని దొన్నుదొర అధికారులకు ఆదేశం



అరకు రూరల్, మే 15, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర శుక్రవారం అరకు లోయ లోని తన క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో స్మశాన వాటిక నిర్మించాలని ఓ మహిళ దొన్ను దొరకి విన్నవించారు. వెంటనే సంబంధిత అధికారికి ఫోన్లో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలని వెంటనే బరియల గ్రౌండ్ నిర్మించాలని ఆయన ఆదేశించారు. తనకు అన్నదాత సుఖీభవ నిధులు రాలేదని సిరిగాం పంచాయతీ వజ్ర గ్రామం వాసి గ్రీవెన్స్ ను ఆశ్రయించారు. మండల వ్యవసాయ అధికారికి ఈ విషయాన్ని తెలియజేసి తర్వాత విడత వచ్చే అన్నదాత సుఖీభవ నిధులు ఆయన ఖాతాలో పడేలా చూడాలని దొన్ను దొర ఆదేశించారు. వీటితోపాటు చాలా గ్రామాలలో వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తుతుందని కొందరు, పెన్షన్ల మంజూరు చేయాలని మరి కొందరు, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న వారు దొన్ను దొర గ్రీవెన్స్ ను ఆశ్రయించారు. కొందరు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలని ఇంటింటికి తాగునీరు రావడం లేదని కొందరు తెలియజేశారు. వీటిని దొన్ను దొర అక్కడికక్కడే అధికారులతో మాట్లాడే పరిష్కరించాలని ఆదేశించారు. అరకు లోయ మండల అధ్యక్షుడు లోకోయి మహదేవ్, డుంబ్రిగూడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, కనీస వేతన డైరెక్టర్ తుడుము సుబ్బారావు, ఏఎంసి చైర్మన్ బోరి బోరి లక్ష్మి, అరకు పార్లమెంట్ టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు పట్టిబోయిన శంకర్ నాయుడు, అనంతగిరి మండలం ఉప అధ్యక్షుడు మజ్జి భీమరాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భీమవరపు గంగులు, టిడిపి సీనియర్ నాయకుడు వీరమాల శివ, సీనియర్ నాయకుడు కపాటి వీరభద్ర రావు, పాంగి భీమన్న, ఏఎంసి డైరెక్టర్ సొన్నాయి గంగ, సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ఉప సర్పంచ్ పాడి చందు నిర్మల, మాదగడ పంచాయతీ అధ్యక్షుడు కొర్ర సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ వంతల వెంకటరావు, క్లస్టర్ ఇంచార్జి కొర్ర శేఖర్, కో క్లస్టర్ ఇంచార్జి కిల్లో మోహన్ దాస్,పి ఏ సి ఎస్ డైరెక్టర్ గద్దారి బారికి అర్జున్, స్వాబి దొన్ను, సిరగం పంచాయతీ అధ్యక్షుడు పూజారి మాణిక్యం, టిడిపి నాయకురాలు కిలో రత్నమ్మ మాజీ ఉప సర్పంచ్ లోకోయి ఓనాది, మాజీ వార్డు నెంబర్ పాంగి రాము, గ్రామ నాయుడు కొర్ర శ్రీరామ్, చిన్నలబుడు పంచాయతీ అధ్యక్షుడు పాంగి భగత్, కిల్లో నాగేంద్ర బాబు, సర్పంచ్ సిదారి గుండన్న, సెబీ తమన్నా, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

16 -5Pg9th cheli.qxd:16 -5Pg9th cheli.qxd 1/1/02 6:32 AM Page 1



# పిచ్‌వాయీ చీరెల అందం

ఫ్యాషన్ ఫ్యాషన్



ఈ తరం చాల మంది అమ్మాయిలు చీరను మెచ్చరు. వేడుకలకు తప్ప చీరే కట్టరు... కార్పొరేట్ ఆఫీసుల్లో చాలామంది మెరిసేది కాటన్ చీరల్లోనే! వాళ్ళు ముచ్చటపడి కట్టుకుంటోంది పిఛ్వాయీ కళ అద్దిన కాటన్ చీరలనే! నాలుగు వందల ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈ కళని ఒకప్పుడు గోడలమీదే వేయడమో, ఫ్రేముల్లో గోడలకు తగిలించేలాగో వేసేవారట. అనతి కాలంలోనే నెమ్మదిగా వస్త్రాల మీదకి వచ్చేసింది. పిఛ్వాయీని చేత్తో వేయడానికి గంటలకొద్దీ సమయం పడుతుంది. ఎంతోమంది కళాకారుల కష్టం దాగుంటుంది. ఆ కళను మాత్రం ప్రత్యేకంగానే చూస్తున్నారు. పైగా సంస్కృతి, పురాతన కళలు, వాటి వెనక దాగున్న కథలు ఇవి మన వారసత్వ ఆస్తులు. దాన్ని ఇతరులకూ పరిచయం చేయొచ్చన్న భావనతోనూ దీన్ని ఎంచుకుంటున్నారు. అసలే వేసవి కాలం కాబట్టి, సహజంగానే కాటన్‌ఎంచుకుంటున్నారు. అనుకున్నా పొరపాటే. కాలమేదైనా వీళ్ల ఓటు దీనికే. తేలికగా ఉంటూనే గాలి తగిలేలా చేస్తాయి.



## ఆరోగ్య భాగ్యం
# చియా విత్తనాలు ఆరోగ్య ప్రయోజనాలు

చియా విత్తనాల్లో అధిక ఫైబర్, ప్రోటీన్స్ వల్ల కడుపు నిండినట్లుండి అధిక ఆకలిని తగ్గించి తినడాన్ని నివారిస్తాయి. అంతేకాకుండా అధిక బరువుని తగ్గిస్తాయి. దీనిలోని అధిక ఫైబర్ వల్ల క్రమబద్ధమైన ప్రేగు కదలికల్ని ప్రోత్సహించడం వల్ల ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌లకి మద్దతు నివ్వడం విశేషం దీనిలోని అధిక కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వల్ల ఎముకల ఖనిజ సాంద్రతకి దోహదం చేయడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇవి రక్తంలో చక్కెర స్థాయిల్ని స్థిరీకరించడమే కాకుండా ఇన్సులిన్ నిరోధకతని తగ్గించడంలో సహాయపడతాయి. దీనిలోని అధిక ఆంటీ ఆక్సిడెంట్ల వల్ల చర్మం ఆరోగ్యంగా కాంతివంతంగా ఉంటుంది. చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచి వేసవిలోని వేడిని, మంటని తగ్గించి చలువ చేస్తుంది. ఇవి స్త్రీలలో హార్మోన్ల సమతుల్యతని కాపాడి బహిష్టులోపాల్ని నివారిస్తుంది. వీటిలోని ఆరోగ్యకరమైన పోషకాల రుచి వల్ల వీటిని ఎక్కువగా స్నాక్స్, హెల్త్‌డ్రింక్స్, డెజర్ట్, స్మూతీలు, పుడ్డింగ్‌లు వివిధ వంటకాల్లో జోడించవచ్చు. చియా గింజలు పరిమాణంలో చిన్నవి అయినప్పటికీ వాటి శక్తి అపారం ఇవి శరీరంలోని ఫ్రీరాడి కల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. దీనిలోని 9 అమైనో ఆమ్లాలు, మైరిసెటిన్, క్వెర్సెటిన్ కెఫిక్ ఆసిడ్ వంటి శక్తివంతమైన 3 ఆంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇవి గుండెకి, కాలేయానికి కూడా మేలు చేస్తాయి. దీనిలోని ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ మెదడు, కంటి ఆరోగ్యాత రోగనిరోధక శక్తికి చాలా అవసరమవుతాయి. ఇవి విటమిన్ల శోషణని పెంచడం వల్ల ప్రేగుల్లో మంచి ప్రేగు బ్యాక్టీరియా పెంపొంది డైవర్టిక్యులైటిస్, అల్సరైటివ్ కొలైటిస్, క్రోన్స్ డిసీజ్-పెప్టిక్ అల్సర్ వంటి జీర్ణకోశ సమస్యల నుండి రక్షణ పొందడమే కాకుండా మలబద్ధకం నుండి ఉపశమనం కల్గుతుంది. దీనిలోని విటమిన్స్ ఖనిజాల వల్ల దీర్ఘకాలిక వ్యాధుల్ని కేన్సర్, ఆర్థరైటిస్, స్థూలకాయం, గుండెజబ్బులు నివారించవచ్చు. ఇవి తేలికపాటి, సహజమైన డిటాక్స్ పెజెంట్‌గా పనిచేస్తాయి. ఇవిగ్లూటెన్ రహితమైనవి. అందువల్ల ఇవి సీలియాక్ వ్యాధి లేదా గ్లూటెన్ సున్నితత్వం ఉన్నవారికి అనుకూలంగా ఉంటాయి. వీటిని ఉదయం పూట, వ్యాయా మానికి ముందు, రాత్రి పూట తీసుకోవడం అన్ని విధాలా మంచిది. వీటిని తక్కువ రక్తపోటు ఉన్నవారు రక్తం పల్చబరిచే మందులు వాడే వారు, విత్తనఎలర్జీ ఉన్నవారు, కిడ్నీ రోగులు తీసుకోరాదు. వీటిని నానబెట్టకుండా ఎండబెట్టిన చియాగింజల్ని తినరాదు. అవి ఉబ్బిపోయి గొంతుల్లో అడ్డుపడే అవకాశం ఉంది. వీటిని ప్రతి రోజూ 1-2 టేబుల్ స్పూన్స్ తీసుకోవడం సురక్షితంగా ఉం టుంది. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కడుపుబ్బరం వీరేచనాలు, కడుపు నొప్పి గ్యాస్ట్రబుల్, కడుపులో అనీజీ ఏర్పడుతుంది. కాబట్టి వీటిని డైరెక్ట్‌గా తినకుండా నానపెట్టి తినడమే మంచిది. నీరు, పాలు లేదా జ్యూస్‌లో రాత్రంతా నానాపెట్టి ఉదయాన తీసుకోవడం మంచిది. ఖాళీ కడుపుతో చియా వాటర్ లేదా చియా పుడ్డింగ్ తీసుకోవడం వల్ల (30- 40గ్రా) శరీరం శుద్ధి అయ్యి ప్రేగు కదలికల్ని మెరుగుపర్చడంతో బరువు తుగ్గుతారు. వీటిని చల్లని, పొడి ప్రదేశంలో గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేస్తే అవి 2 సంవత్సరాల వరకు నిల్వ ఉంటాయి. వీటిని నేరుగా ఉడకపెట్ట కుండా వేడి సూప్‌లు/పానీయాలలో కలుపుకోవచ్చు. పిల్లలకి ముఖ్యంగా 2-3 సంవత్సరాలు దాటిన వారికి తక్కువ మోతాదు లో నానపెట్టి మెల్లగా క్రమంగా అలవాటు చేయాలి.ఇవి ప్రకృతి యొక్క పోషక ఛాంపియన్‌లుగా అవిసె గింజల కంటే ఎక్కువ పోషకాల్ని కల్గి ఉంటాయి. వాటిని తేమగా ఉండే ఆహార పదార్థాలతో కలిపి నప్పుడు ముఖ్యంగా పెరుగు, ఓట్‌మీల్, ఫ్రూట్ సలాడ్‌లు పాలతో కలపడం వల్ల ఉత్తమగా పని చేస్తాయి. దీనిలోని మెగ్నీషియం కండరాల శక్తికి జింక్ కణాల పెరుగు దలకే కాకుండా రిపేర్‌కి రాగి, కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. దీటిని గర్భిణీలు బాలింతలు కూడా మితంగా తీసుకో వచ్చు. వీటి విత్తనాల పొడిని చపాతీ రోటిల పిండిలో కలుపుకొని తరుచుగా కూడా వీటిని తినవచ్చు. వేసవిలో నీరం, అలసట, తలనొప్పి, తలతిరగడం వంటి సమస్యలు న్న వారికి తక్షణ శక్తినివ్వడమే కాకుండా ఎనర్జీబూస్టర్‌గా పని చేస్తాయి. ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గించి సంతానోత్పత్తి అవకాశాల్ని మెరుగుపరుస్తాయి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# ఎండ నుంచి రక్షగా !

ఎండలు ఎంతలా మండిపోతున్నా మనం బయటకు వెళ్లి తీరాల్సిందే! అలా వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్‌ని తీసుకెళ్లున్నారా? అందులో ఉత్తనీరుని కాకుండా ఇవి కూడా జోడించండి. ఎండ నుంచి ఉపశమనంతో పాటు పోషకాలు కూడా అందుతాయి.

నీటిని కొద్దిగ తేనె, నిమ్మరసం, దంచిన అల్లం కలిపితే.. శరీరం నుంచి వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలుంటే తొలగిపోతాయి. తరిగిన కీరదోస ముక్కలు, కచ్చాపచ్చాగా దంచిన పుదీనా ఆకులు కలిపిన నీళ్లు తాగితే ఎండ నుంచి ఉపశమనంతో పాటు, శరీరంలోని మలినాలు బయటకు పోతాయి. బరువు తగ్గడంతోపాటు హైబిపి నుంచి ఉపశమనం ఉంటుంది. సన్నగా తరిగిన ఫైనాపిల్ ముక్కలు, కొబ్బరిముక్కలు వీటిని నీటికి జోడించి రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి తెల్లారి తాగి చూడండి. శరీరానికి మేలు చేసే కొవ్వులు అందడంతో పాటు.. ఎండ నుంచి తక్షణ ఉపశమనం కలిగించే ఎలక్ట్రోలైట్లు అందుతాయి. దానిమ్మ గింజలు, దాల్చిన చెక్క వీటిని కలిపి తాగితే బిపి తగ్గి.. వ్యాధినిరోధక శక్తి పెరుగు తుంది. సన్నగా చక్రాల్లా తరిగిన ఆరెంజ్ స్లైసులని నీళ్లలో కలిపి తాగితే బరువు తగ్గడంతో పాటు శరీరం ఎక్కువసేపు తేమగా ఉంటుంది.



# ఏకాగ్రతను పెంచే బంతాట



కాలక్షేపం అంటూ ఫోన్లూ, ట్యాబ్‌లకు అతుక్కుపోతోన్న పిల్లల మనసు మళ్లించాలంటే ఆరుబయట ఆడించే ఆటే సరైన మార్గం. ఇవి వారికి శారీరక శ్రమను అందించడమే కాదు, మెదడునీ చురుగ్గా ఉంచుతాయి. అలాంటిదే ఈ బ్యాలెన్సింగ్ బాల్ గేమ్. దీనికోసం మీరు చేయాల్సిందల్లా.. ముందు ఒక లక్ష్యం ఏర్పాటు చేయాలి. దానికి ఐదు మీటర్ల దూరం వరకూ కాస్త ఎడం ఇచ్చి సమాంతరంగా రెండు గీతలు గీయాలి. ఇద్దరు చిన్నారుల్ని లక్ష్యానికి మరోవైపు లైన్ చివర నిలబెట్టాలి. వారి చేతికి ఒకేలాంటి కర్రలిచ్చి ఇద్దరినీ పట్టుకోమనాలి. ఇప్పుడు వాటిపై ఓ బంతిని పెడితే, కింద గీత దాటకుండా ఆ బాల్ కింద పడకుండా ఇద్దరూ బ్యాలెన్స్ చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలి. ఈ ఆట ఏకాగ్రతను పెంచడంతో పాటు, ఇతరులతో సులువుగా కోఆర్డినేట్ చేసుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది.

# ధర్మమార్గంలోనే ధర్మాచరణ

మానవుడు రోజురోజుకీ సంకల్ప బలం కోల్పోతున్నాడు. కారణం ధర్మాన్ని విస్మరించడమే కారణం ఏదైనా సత్యం, నిజాయితీ, స్వార్థ రహిత ప్రేమ, త్యాగం, సేవాభావం, లాంటి గుణాలు ధర్మంగా బ్రతికే వారిలోనే కనిపిస్తాయి. ధర్మాన్ని ఆచరించేవారిని ఆదేమి వారిని భయం నుండి రక్షిస్తుంది. మానవుడు ఎంతగొప్పగా జీవిస్తున్నా, రాజ్యాలను ఏలే చక్రవర్తి అయినా ధర్మాన్ని ఆచరించని ఎడల పతనావస్థకు చేరుకొని మానసికంగా వేదనా భరితమైన జీవితాన్ని అనుభవిస్తాడు. కష్టాలువచ్చిన ప్పుడు భగవంతునిపై నిందలు వేయడం పరిపాటై పోయింది. ధర్మమార్గం ఎలా బ్రతకాలో చెప్పినా, తనకుగా తెల్సినా ఎవ్వరూ దాన్ని పట్టించుకోవడం లేదు. ధర్మాచరణం ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. ఇతరులు విమర్శించినా చలించని ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. ధర్మాచరణం చేసిన మానవులను రోగ భయాల నుంచీ, మృత్యుభీతి నుంచి దూరం చేస్తుంది. ముఖ్యంగా పవిత్రతను పెంచుతుంది. ప్రేమను పెంపొందిస్తుంది. శాంతి కలుగుతుంది. ఆత్మానందం కలుగుతుంది. ధర్మో రక్షతి రక్షితః అన్నారు. ధర్మాన్ని రక్షించిన వారినే ధర్మం రక్షిస్తుందని శృతివాక్యం ధర్మాన్ని ఆచరించే మానవుడు పరమాత్మ సేవలో బ్రహ్మపదాన్ని అనుభిస్తాడు. మానవుడు, లౌకికమైన ఆనందాన్ని అనుభవించే దిశగా పయనిస్తూ ఈ విధమైన అద్భుతమైన బ్రహ్మానందాన్ని పోగొట్టు కుంటున్నాడు.

- డా. పులివర్తి కృష్ణమూర్తి

# 'పెద్ది' నుంచి శివరాజ్‌కుమార్ లుక్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన మచ్ అవైటెడ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'తో బాక్సాఫీస్ తుఫాన్ సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్సెస్‌లో చరణ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచాయి. ఇప్పుడు ఈ చిత్రానికి పాన్ ఇండియా స్థాయిలో మ్యాసీవ్ ప్రమోషన్స్ ప్రారంభమవుతున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో నిర్మాత వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై 'పెద్ది'ని భారతీయ సినిమాకు కొత్త అనుభూతిని ఇచ్చే విజువల్ స్పెక్టకిల్‌గా రూపొందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు.ఈలోగా మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఓ కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయనని గౌరాయుడుగా పరిచయం చేస్తూ పవర్ఫుల్ వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోలో శివరాజ్ కుమార్ కుస్తీ బరిలో పవర్ ఫుల్ ప్రెజెన్స్‌తో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంత పవర్ ల్ గా ఉండబోతుందో ఈ వీడియో తెలియజేస్తోంది.ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయబోతున్నాయి.నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ నవీన్ నూలి ఎడిటింగ్ నిర్వహిస్తున్న ఈ భారీ చిత్రానికి ఇప్పటికే ఫుల్ ఎడిట్ లాక్ అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.'పెద్ది జూన్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, జూన్ 3న ప్రీమియర్స్ ప్రారంభం కానున్నాయి.

# 'నాగబంధం' నుంచి లీలావతిగా అనసూయ ఫస్ట్ లుక్ రిలీజ్



అభిషేక్ నామా దర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం' ది సీక్రెట్ ట్రెజర్ చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ 'నాగబంధం' సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది.సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది.ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో 'నాగబంధం' చిత్రం జూలై 3న విడుదల కానుంది.

# తెర

## 'శ్రీనివాస మంగపురం'లో 'మ్రంగా మంగా' సాంగ్



'శ్రీనివాస మంగాపురం' సినిమాతో తెలుగు ప్రేక్షకు లకు హీరోగా పరిచయమో తున్న జయకృష్ణ ఘట్టమనేని తన స్టన్నింగ్ లుక్స్, ఆకట్టుకునే బేస్ వాయిస్‌తో మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడిగా, మహేష్‌బాబు అన్న కొడుకుగా భారీ అంచనాల మధ్య ఇండస్ట్రీలోకి అడుగుపెడు తున్న ఆయన ఆ అంచనా లకు తగ్గట్టుగానే తన ప్రామిస్‌ను నిలబెట్టుకుంటు న్నారు. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి విభిన్న చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న క్రియేటివ్ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న శ్రీనివాస మంగాపురం విజువల్‌గా అద్భుతమైన, వైలెంట్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోంది ఇప్పటికే విడుదలైన తొలి సింగిల్ 'అలెల్లే అలెల్లే' కేవలం రెండు వారాల్లోనే 4.6 మిలియన్ వ్యూస్ సాధించి ట్రెండింగ్ హిట్‌గా నిలిచింది. తాజాగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ సినిమా సెకండ్ సింగిల్ 'మంగా మంగా' సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటలో జయకృష్ణ, రాషాను ఇష్టపడి.. తిరుపతిలోనే ఉండిపోవాలని కోరుకుంటూ, తనని జీవిత భాగస్వామిగా అంగీకరించమని సరదాగా ఆటపట్టించే విధంగా కనిపించారు. పర్కషన్ బీట్స్, వాడిన వాద్యాలు ఈ పాటను మరింత ఎనర్జిటిక్‌గా, ఫన్‌గా మార్చాయి. ఎల్.వి. రేవంత్ అద్భుతంగా ఆలపించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అందించిన లిరిక్స్ మరింత ఫ్లేవర్ జోడించాయి. ఈ చిత్రానికి జయకృష్ణ గుమ్మడి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, మాధవ్ కుమార్ గుళ్లపల్లి ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు.

# 'మేము కాప్'లం' ట్రైలర్ విడుదల



జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే 'మేము కాప్'లం'. కొన్నాళ్ల నుంచి ఈ సిరీస్ టైటిల్ దగ్గర నుంచి ప్రతీ విషయంలోనూ క్యూరియాసిటీని పెంచు తోంది. మే 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా 'మేము కాప్'లం' ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చా డండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. దీంతోవాళ్ల కొత్త సమస్య నుంచి ఊరిని బయటపడేయ టానికి ప్రయత్నిస్తారు. ఇంతకీ మహదేవపట్నంలోని ప్రధాన సమస్య ఏంటి? పోలీసులు దాన్ని ఎలా పరిష్కరిస్తారు. నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన 'మేము కాప్'లం' సిరీస్‌ను రా ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, మిస్టరీ కలయికగా అందరినీ ఆకట్టుకునే కథాంశంతో..గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం.. ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కింది.

# 'వదలా' సోల్ ఫుల్ టైటిల్ సాంగ్ రిలీజ్



వెర్సటైల్, కమాండింగ్ స్క్రీన్ ప్రజెన్స్‌తో అదరగొట్టే జగపతి బాబు సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'తో రాబోతున్నారు. ఈ చిత్రంలో ఆయనతో పాటు లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్ పై కిషోర్ నాయుడు చిరుమమిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించారు.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, థ్రిల్లింగ్ టీజర్ తో ఆసక్తిని రేకెత్తించిన టీం, ఇప్పుడు వదలా టైటిల్ ట్రాక్ ని రిలీజ్ చేశారు.ప్రేమ, బాధ, భావోద్వేగాలను ఆత్మీయంగా మిళితం చేసిన ఈ పాట ఒక సోల్‌ఫుల్ మెలోడీగా ఆకట్టుకుంటోంది. ఎర్రోజు శివకృష్ణా చారి అందించిన సాహిత్యం పాటకు మరింత డెప్త్ తీసుకురాగా, ప్రియా నారాయణ తన వోకల్స్ తో ప్రతి లైన్‌కి ప్రాణం పోశారు. జగపతి బాబు పై హృతికా శ్రీనివాస్ కి వున్న ఎమోషన్ ఈ పాటలో క్యాప్చర్ చేసిన తీరు ఆసక్తికరంగా వుంది. ఈ సాంగ్‌ని చాలా లావిష్‌గా చిత్రీకరించారు, సంగీతం, సాహిత్యం, పెర్ఫార్మెన్స్ అన్నీ కలిసి 'వదలా' టైటిల్ ను వినగానే గుర్తుండిపోయే మెలోడీగా నిలబెట్టాయి.ఈ చిత్రానికి చోటా కె నాయుడు డీవోపీ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్, లక్ష్మీ ్మ భూపాల రైటర్.

# జూన్ 19న రాబోతోన్న 'మా ఇంటి బంగారం'



ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం'మా ఇంటి బంగారం. సమంత హీరోయిన్‌గా నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'మా ఇంటి బంగారం' టీజర్ ఇప్పటికే అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేసింది. 'తస్సాదియ్యా' అనే పాట కూడా యూట్యూబ్‌ని షేక్ చేసేస్తోంది. మంచి బజ్‌ను క్రియేట్ చేసిన ఈ సినిమాని జూన్ 19న రిలీజ్ చేయబోతో న్నారు. ఈ మేరకు రిలీజ్ డేట్‌ను రివీల్ చేస్తూ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సమంత చీరకట్టులో ఆ గన్ను పట్టు కున్న తీరు, ఆ చూస్తున్న చూపులు అదిరి పోయాయి. వేటకు వెళ్తున్న సివంగిలా సమంత లుక్ కనిపిస్తోంది. ఇక సినిమాని జూన్ 19న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు 'ఓ బేబీ' తరువాత నందినీ రెడ్డి, సమంత కలిసి చేస్తున్న చిత్రం కావడంతో సహజంగానే ఆడియెన్స్‌లో అంచనాలు ఏర్పడ్డాయి. ఇక రాజ్ నిడిమోరు స్టోరీ, స్క్రీన్ ప్లేని అందిస్తుండటంతో మరింతగా హైప్ ఏర్పడింది. ఈ సినిమాలో దిగ్నాథ్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్ని పోషించారు. శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మీ, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజూష తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. చిన్నా, పెద్దా అన్నతేడా లేకుండా ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రంగా 'మా ఇంటి బంగారం' రాబోతోంది.

## రాబోయే ఐదు రోజులు ఎండ తీవ్రత అధికం : కలెక్టర్



వీరఘట్టం, మే 15 ప్రభాతవార్త : మన్యం జిల్లాలో రాబోయే ఐదు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండనుందని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్.టి.జి) విభాగం హెచ్చరించింది. మే 15, 2026న విడుదల చేసిన తాజా వాతావరణ నివేదిక ప్రకారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15 మండలాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 41డిగ్రీల నుండి 54 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

**ప్రభావితమయ్యే మండలాలు ఇవే ..**

వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని, కొమరాడ, బలిజిపేట, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి, పాలకొండ మండలాలు వున్నాయన్నారు. మధ్యాహ్నం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండటానికి తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా గొడుగు లేదా టోపీని ధరించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

## వీరఘట్టం మండల టీడీపీ అధ్యక్షుడిగా బుజ్జి



వీరఘట్టం, మే 15 ప్రభాతవార్త : ఇదిగో, అదిగో అంటూ...అధిష్టానం ఊరిస్తూ వస్తున్న ప్రచారానికి నేటితో ఫుల్ స్టాప్ పెట్టినట్లు అయ్యింది. ముందు నుండి అందరూ ఊహించినట్లుగానే పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన సాసుబిల్లి వెంకటరమణ (బుజ్జి)ని నియమిస్తూ టీడీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.ఈయన ఇన్‌చార్జ్ భూదేవి ముఖ్య అనుసరినిగా, రియల్ ఎస్టేట్ బిల్డర్‌గా ఈ ప్రాంతంలో పేరు గాంచడమే కాకుండా తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారు. దీనిని పార్టీ గుర్తెరిగి ఈయనకు కీలకమైన పదవిని కట్టబెట్టింది. ఈ సందర్భంగా బుజ్జి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందని, అలాగే పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పడాల భూదేవి నేతృత్వంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు తేజోవతి, రాష్ట్ర తెలుగు రైతు విభాగం ఉపాధ్యక్షులు ఖండాపు వెంకటరమణమూర్తితో పాటు తనతో శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బుజ్జికి పదవి లభించడం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు గేదెల గజేంద్రనాయుడు, పప్పల మహేష్, తమరాపు అప్పలనాయుడు, గర్భాన శ్రీనివాసరావు, ముఖలింగం, పిన్నింటి శ్రీనివాసరావు, ముల్లు శ్రీనివాసరావు , తదితరులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజాదర్బార్ .. ప్రజాసమస్యల పరిష్కార వేదిక



పలాస, మే 15, ప్రభాతవార్త: పలాస నియోజకవర్గ స్థానిక శాసనసభ్యుల కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ప్రజా పరిష్కార వేదిక – ప్రజాదర్బార్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హాజరై తమ సమస్యలను శాసనసభ్యురాలికి వినిపించారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర సమస్యలకు సంబంధించిన 21 మంది వినతిపత్రాలను సమర్పించారు. శాసనసభ్యురాలు ప్రజల వినతులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రధాన బాధ్యత అని, ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వేగవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి సైకిల్ వితరణ



కోటబొమ్మాళి, మే 15 ప్రభాతవార్త : మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న భవిరి వాణిశ్రీ ఆ పాఠశాల పూర్వపు విద్యార్థులు శుక్రవారం సైకిల్‌ను వితరణగా అందజేశారు. వాణిశ్రీ ప్రతిరోజూ సారవకోట మండలం మదనాపురం గ్రామం నుండి పాఠశాలకు కాలినడకతో వస్తుందని గుర్తించి అమెకు పాఠశాల పూర్వ విద్యార్థులు సైకిల్ కొనుగోలు చేసి ఇచ్చారు. విద్యార్థి వాణిశ్రీకి తండ్రి చనిపోగా, తల్లి వలసకూలీ. అమ్మమ్మ ఇంటి నుండి వెళ్తూ చదువుకుంటున్న పేదింటి వాణిశ్రీకి ఈ సాయం చేయటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సాయం చేయడంలో భాగస్వాములు అయిన కొత్తపల్లి యూత్‌కి ఉపాధ్యాయ బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షణ్ముఖరావు, తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



ఆమదాలవలస, మే 15 ప్రభాతవార్త : ప్రజా సమస్యల కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపద రావు మురళీధర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వ హించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే రవికుమార్ ఉంటారని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవిం చుకోవచ్చనన్నారు. ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తమ్మి నేని శ్రీనివాసరావు, పీవీకే రాజు, చౌదల గోవిందరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు పంట సాగు హక్కుల కార్డు తీసుకోండి



ఆమదాలవలస, మే 15 ప్రభాతవార్త: కౌలు రైతులందరూ మీ గ్రామ రెవెన్యూ పరిధిలో అధికారులను సంప్రదించి పంట సాగుదారు హక్కుల కార్డులను తీసుకోవాలని ఏవో మెట్ట మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. సాగు హక్కు కార్డులను తీసుకున్న రైతులకు వివిధ రకాల ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. పండించే పంట అమ్ముకోవడానికి, ఎరువులు పొందుటకు, ప్రభుత్వ పథకాలు మరియు రుణాలు పొందుటకు అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని మోహన్‌రావు తెలిపారు. కౌలు రైతులందరూ వెంటనే ఆధార్, భూ యజమాని పాస్ బుక్ ఫోటోలు తీసుకుని మీ రెవెన్యూ అధికారులు సంప్రదించాలని మోహన్‌రావు తెలిపారు.

## నాటు వైద్యానికి ఓ నమస్కారం..లార్వా వేటపై సమరం



సీతంపేట, మే 15, ప్రభాతవార్త : మండలంలో మలేరియా, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటు వైద్యానికి ఓ నమస్కారం లార్వ వేట పేరుతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బంగిగూడ ధోనుబాయ్ పరిధిలో పెదరామలో లార్వ వేట నాటువైద్యానికో నమస్కారం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా డీఎంవో పివి సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ కే.విజయపార్వతి ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బిబి మిశ్రా, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అజయ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, ఝాన్సీరాణి పంచాయతీ సెక్రటరీ వినోద్, మోహనబాబు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై యువత ముందుండాలి




వీరఘట్టం, మే 15 ప్రభాతవార్త : సామాజిక అంశాలపై యువత ముందుండాలని, తద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మరియగిరి చర్చి ఆవరణలో కలర్స్ యూత్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో యువత పాత్ర వారు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై దిశానిర్దేశం చేశారు. యువత వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని, డ్రగ్స్ లేని సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెరుగుతు న్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. బాలల రక్షణ మరియు వారిపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యువత క్రమశిక్షణతో మెలిగి, చట్టాల పట్ల అవగాహన పెంచుకున్నప్పుడే మెరుగైన సమాజం సాధ్యమవుతుందని సీఐ ఈ సందర్భంగా తెలిపారు. స్థానిక ఎస్సై ఎస్.షణ్ముఖరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు, యువతీ యువకులు మరియు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో యువతకు భవిష్యత్



ఆమదాలవలస, మే 15 ప్రభాతవార్త : క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ పి.తాతయ్యలు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చిరంజీవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో శుక్రవారం ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో క్రీడాకారుల కోసం తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మకరాంపురం జట్టు, జన్ జడ్ శ్రీకాకుళం క్రికెట్ క్లబ్ మధ్య క్రికెట్ పోటీ జరిగింది. మకరంపురం క్రికెట్ టీం టాస్ గెలిచి బ్యాటింగ్ చేయడంతో 20 ఓవర్లుకు 194 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది తర్వాత వచ్చిన శ్రీకాకుళం క్రికెట్ క్లబ్ సభ్యులు 20 ఓవర్లుకు 110 పరుగులు చేయడంతో మకరాంపురం టీం విజయం సాధించారు. దీంతో మకరాంపురం టీం గెలిచినట్లు క్రికెట్ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రకటించారు. అలాగే ఇరు జట్లలో పృథ్వీ 78 పరుగులు, లవన్ 57 పరుగులు చేశారు. అలాగే చెర్రీ 3 వికెట్లు, భార్గవ్ 3,సాత్విక్ 6 వికెట్లు తీసి జట్లు విజయం పాత్ర పోషించారు. అంపైర్లుగా కిల్లి సుదర్శనరావు, స్కోరర్‌గా ఈశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో క్రీడా అసోసియేషన్ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి




కొత్తూరు, మే 15 ప్రభాతవార్త : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో విచ్చలవిడిగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కొత్తూరు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను అడ్డగోలుగా పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపడం అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు సింహాచలం, రమేష్, కృష్ణ, బాలరాజు, జయరాజు, తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధరలు తగ్గే వరకు తమ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.

## వంశధార కాలువ మరమ్మతు పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



పలాస, మే 15 ప్రభాతవార్త : వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు గ్రామ సమీపంలో వంశధార కాలువ మరమ్మత్తు పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఇరిగేషన్ శాఖ ద్వారా సుమారు రూ.60 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా కాలువల మరమ్మత్తులు అత్యంత అవసరమన్నారు. వంశధార కాలువ ద్వారా పరిసర గ్రామాల రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కాలువల పునరుద్ధరణ పనులను ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలువ మరమ్మత్తు పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. సాగునీటి పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం నాయకులు, మున్సిపాలిటీ నాయకులు, మండల నాయ కులు, మహిళలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, మే 15 ప్రభాతవార్త : కొలిగాం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం కూడా ఫకీరుపేట, గొల్లవీధి, రత్తకన్న, మండపల్లి బాలకృష్ణాపురం, మశాఖపురం, జగన్నా ధపురం, కొలిగాంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పలాస ఈఈ అర్.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో చెప్పారు. శుక్రవారం కార్మికులు అందుబాటులో లేకపోవడంతో శనివారం అంతరాయం ఉంటుందని చెప్పారు. లైన్ మరమ్మతులు కారణంగా ఉదయం 9 నుండి 2 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.

## బాలికల సమగ్ర అభివృద్ధే లక్ష్యం



వీరఘట్టం, మే 15 ప్రభాతవార్త : బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో బాలికల సమగ్ర అభివృద్ధి కోసం కిశోరి వికాసం పేరిట మే1 నుండి జూన్ 11 వరకు ప్రత్యేక వేసవి శిబిరంలో భాగంగా శుక్రవారం కెల్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ టి.కనకదుర్గ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాలకొండ సిడిపిఓ రంగ లక్ష్మి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక ఈ శిబిరాల్లో పాల్గొని తన భవిష్యత్తును మరింత బలపరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం ఔట్రీచ్ వర్కర్ రావాడ హరికృష్ణ,వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ పల్లవి, లీగల్ అడ్వకేట్ కవిత, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీస్, అంగన్వాడీ వర్కర్స్, విలేజ్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయిలో తొలిసారిగా ఫిర్యాదుల స్వీకరణ



రాజాం, మే 15 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మొట్టమొదటిసారిగా నియోజకవర్గ స్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని రాజాం తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవా రం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కొండ్రు మురళీమో హన్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించిన సుమారు 90 ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా రెవెన్యూ, భూమి సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, తదితర అంశాలపై అర్జీలను సమర్పించారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 18 మంది లబ్ధిదారులకు సుమారు రూ.13.54 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, జాయింట్ కలెక్టర్ అందజేశారు. ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన్ విలేజ్ – వన్ మంత్ – ఫోర్ విజిట్స్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్డీవో సుధారాణి, మున్సిపల్ కమిషనర్ ఏ.రామచంద్రరావు, రాజాం, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి, వంగర మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావానికి తగ్గట్టుగా జొన్న, సజ్జ, కంది పంటలు



కంచిలి, మే 15 ప్రభాతవార్త : సోంపేట డివిజన్ కంచిలి మండలం అంపురం యూనిట్‌లో గల బలియా పుట్టుకలో సామూహికంగా కూరగాయల ఫీల్డ్ చుట్టు ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తెల్ల జొన్నలు, సజ్జలు, ఆముదం, కంది, గోరుచిక్కుడు మొదలగు పంటలను వేయడం వలన ఆదాయంతో పాటు ఈ ప్రభావానికి తట్టుకుంటాయని ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్ శివానందం రైతులకు వివరించారు. కంచిలి ఐసీఆర్పి బొడ్డ పుష్పలత, లీడ్ ఫార్మర్స్ రైతులు హాజరయ్యారు.

## సీతంపేటలో ఎన్‌జీకే క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



సీతంపేట, మే 15 ప్రభాతవార్త: సీతంపేటలో ఎన్‌జేకే క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ను ఎస్సై వై.అమ్మ న్నారావు ప్రారంభించారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లో ఈ క్రికెట్ మ్యాచ్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే ఈ క్రికెట్ పోటీల్లో క్రికెట్ క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సహకారంతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇమరక పవన్, తదితరులు పాల్గొన్నారు.

## నేరడిలో పీఎండీఎస్ పద్ధతిలో నవధాన్యాల సాగుకు శ్రీకారం



కొత్తూరు, మే 15, ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు నేరడి పంచాయతీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన, క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఏడీఏ రాజ్‌గోపాల్, ఎంటీ సూర్యనారాయణ, డీఎమ్ఎంటీ జగన్ ఆధ్వర్యంలో నేరడి గ్రామానికి చెందిన గూనపు అప్పన్న అనే రైతు చేనులో పీఎండీఎస్ గ్రౌండింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. ఏడీఏ రాజ్‌గోపాల్, ఎంటీ సూర్యనారాయణ, డీఎమ్ఎంటీ జగన్‌లతో పాటు ఐసీఆర్‌పీలు ఢిల్లీశ్వరి, ముఖలింగం, చిన్నా, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## భూ వివాదంపై న్యాయం జరపాలి



కంచిలి, మే 15 ప్రభాతవార్త : కంచిలి మండలం కేసరిపడ గ్రామంకాలనీలో భూవివాదంపై న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామస్తులు మల్లారపు దుదిష్టి, నెయ్యల రాజు, కడియం ప్రసాద్, కొరికాన కృష్ణమూర్తి, చంద్రమణి, గోపాల్, గంగాధర్ మాలి అజిత్ గోవింద్‌లు కేసరపడ కాలనీలో సర్వేనెంబర్ 468/2,4 68/3లో గత 30 సంవత్సరాలుగా కాలనీ రోడ్డు కోసం రెండు సెంట్లు విస్తీర్ణం కోసం రెండు సెంట్లు వాటర్ ట్యాంక్ ఒక సెంటు బిటి రోడ్డు 0.001/2 సెంట్లు భూమిలో ప్రభుత్వ నిర్మాణాలు ఉన్నాయని చెప్పారు. అలాగే కాలనీలో పిలక గంగమ్మ, సల్ల గంగమ్మ, మాలతి హరిపాత్రులకు 30 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం కాలనీ ఇల్లు కోసం స్థలం కేటాయించడంతో నిర్మాణాలు చేసి నివసిస్తూ ఉన్నామని అయితే కొద్ది రోజుల్లో క్రితం అదే గ్రామానికి చెందిన సల్ల షణ్ముఖరావు అనే వ్యక్తి తమ ఆస్తులు పంపకంలో 19 సెంట్లు భూమి దకలబడిందని ప్రభుత్వం ,ప్రైవేట్ వ్యక్తులు తమ భూమిలో నిర్మాణాలు చేసి ఉన్నారని అలాగే ప్రభుత్వం నుండి కూడా రికార్డులు పొంది ఉన్నామని వెంటనే వీటిని తొలగించాలని కంచిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కాలనీవాసులు అలాగే గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఆ స్థలం ప్రభుత్వ పోరంబోకుదని కాని షణ్ముఖరావు అనే వ్యక్తి స్థలం మాదే అని చెప్పి తమకు ఇబ్బంది చేస్తున్నారని నెలరోజుల క్రితం విషయం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కవిటిలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే జిల్లా కలెక్టర్ తెలియజేయడంతో స్పందించి స్థానిక రెవెన్యూ అధికారులకు రీసర్వే జరిపి బాధితులకు న్యాయం చేయాలని చెప్పినా తమ గ్రామానికి ఇంత వరకు రెవిన్యూ అధికారులు రాకుండా తత్సారం చేస్తుండడంతో అనేక అనుమానాలు కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుండా న్యాయం చేయకపోతే మరల ఉన్నతాధికారులకు, సీఎం గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

## పోరాటాల నారాయణుడు



కోటబొమ్మాళి, మే 15 ప్రభాతవార్త : తాను చేస్తున్న వృత్తికి నూటికి నూరుశాతం న్యాయం చేస్తూ ఇతర సిబ్బంది ఏ సమస్య వచ్చిన నారాయుడులా అదుకొనే వ్యక్తి. ఆయన స్థానిక మండల పరిషత్‌లో 37 పరిపాలన అధికారిగా యూనియన్ పరంగా జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టిరియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. కిలారి నారాయణరావు ఉద్యోగుల ౹౹౹ పాలిట నారాయణు డేనని చెప్పక తప్పదు. పుష్కరకాలం నుంచి ఉద్యోగుల సంఘం నాయుకుడుగా ఈయన పని చేస్తున్నాడు. ముఖ్యంగా డ్వామా, టీఆర్డీఏ, ఎస్సీ, బీసీ కార్పోరేషన్ల, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, పీఐయు తదితర శాఖలలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై నిరంతం పోరాటం ఈయనది. అలాగే తమ సామాజక పరంగా 108 ఉద్యోగులు ఇబ్బంది పడుతున్న పరిష్కార దిశగా ఆయన చర్యలు చేపడతారు. కూటమి ప్రభుత్వం భాగస్వామి అయన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ ఎంతో కాలంగా పదోన్నతులు లేక ఎదురు చూస్తున్న పంచాయతీ రాజ్ సిబ్బందికి పదోన్నతి కల్పించటం సంతోషకర విషయమన్నారు. సిబ్బంది రెట్టింపు ఉత్సహంతో పని చేస్తున్నారని ఆయన అన్నారు. అలాగే ప్రతిష్టాత్మకమైన కోటబొమ్మాళి మండలంలో ప్రణాళిక బద్దంగా పని చేస్తున్నామని ఆయన తెలిపారు.

## బయో ఇన్‌పుట్ విధానంతో సహజ వ్యవసాయం సులభతరం



కోటబొమ్మాళి, మే 15 ప్రభాతవార్త : మండలం హరిశ్చంద్రపురంలో గల కొత్తమాతల్లి ట్రైనింగ్ సెంటర్‌లో నోడల్ బయో రిసోర్స్ సెంటర్‌లో బి.ఆర్.సి యజమానులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డి.పి.ఎం) పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బయో రిసోర్స్ సెంటర్ యజమానులకు సహజ వ్యవసాయంలో ఉపయోగించే బయో ఇన్‌పుట్స్ తయారీ, వినియోగం మరియు వాటి ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. రైతులకు నాణ్యమైన జీవామృతం, బీజామృతం, ఘన జీవామృతం వంటి బయో ఇన్‌పుట్స్ అందించడంలో బి. ఆర్. సిల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు.అలాగే ఎ.డి.పి. ఎం ధనుంజయ్ నోడల్ బయోరిసోర్స్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణ, రైతులకు అందించాల్సిన సేవలు, సహజ వ్యవసాయ విస్తరణలో వాటి ప్రాధాన్యత గురించి వివరంగా తెలియజేశారు. ఎఫ్.పి.ఓ సీఈఓ సత్య ప్రియ, ఎన్.ఎఫ్.ఎఫ్ శ్రావ్య, మృదుల, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శోభన్ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, బి.ఆర్.సి యజమానులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం నడిపిన ఎమ్మెల్యే కోండ్రు



రాజాం, మే 15 ప్రభాతవార్త: పశ్చిమాసియా సంక్షోభ పరిణామాలను ఎదుర్కోనేందుకు ప్రధాని మోదీ పిలుపు మేరకు, మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తమ ప్రోటోకాల్ వాహనాలను సైతం పక్కనపెట్టి బుల్లెట్ బైక్‌పై వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యారు. ముందుగా తన క్యాంప్ కార్యాలయం నుంచి రాజాం పురపాలక సంఘం కార్యాలయం వరకు ద్విచక్ర వాహనంపై వెళ్లి, మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర వాహనాల వినియోగాన్ని తగ్గించి, ప్రజా రవాణాను వినియోగించుకోవాలని అనవసరంగా బంగారం కొనుగోళ్లను నివారించాలని ఎమ్మెల్యే కోండ్రు సూచించారు. ప్రతీ ఒక్కరూ పొదుపు చర్యలు పాటించాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయనగరం జిల్లా, కలెక్టర్ రాంసుందర్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో ఘనంగా ఎమ్మెల్యే సత్కరించి మెమోంటోను అందజేసి, మెడికల్ క్యాంప్‌ను కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజాం తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నియోజక వర్గ స్థాయి తొలిసారి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.



విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## బడిబస్సుల భద్రంపై క్షుణ్ణంగా తనిఖీలు : ఎంవిఐ ప్రసాద్



సాలూరు మే15 ప్రభాతవార్త : సాలూరు పట్టణంలో ఉన్న ప్రైవేట్ స్కూల్ బస్సుల కండీషన్ ఏ విధంగా ఉన్నాయో అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జేవిఎస్ఎస్ ఎస్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం అందులో భాగంగా బస్సు రికార్డ్స్ సరిగా ఉంచుకోవాలని అలాగే డ్రైవర్ కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని పలు సూచనలు చేశారు. అంతేకాకుండా బస్సుయొక్క కండిషన్ రోజు చెక్ చేసుకోవాలని,ఎమర్జెన్సీ డోర్స్ తప్పనిసరిగా పనిచేసినట్లు చూసుకోవాలని ఇంకా జీపీఎస్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అలాగే ఫైర్ నివారించే పరికరాలు కచ్చితంగా ఉండాలని క్లారిటీ ఇచ్చారు.అలాగే స్కూల్ బస్సుల్లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే యాజమాన్యానికి తెలియజేయాని లేదంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని ఎంవిఐ ప్రసాద్ హెచ్చరించారు.ఆర్టీవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో చేరండి.. మెరుగైన విద్యను అభ్యసించండి



గరివిడి, మే15, ప్రభాత వార్త: ప్రభుత్వ బడుల్లో చేరి మెరుగైన విద్యార్జన చేయాలని గరివిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం వి బి సుబ్రహ్మణ్యం కోరారు. విద్యార్థులు తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో ఏ విధంగా ఫలితాలు వస్తున్నాయో పరిశీలించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన అన్నారు. బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వెంకు పాత్రుని రేగ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీల కుమారి, మండల విద్యా శాఖాధికారి పోలుబోతు రామారావు లతో కలసి ఆయన ఇంటి ఇంటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య చకితులను చేశారు. అర్హులైన, నిష్ణాతులైన ఉపాధ్యాయులు గవర్నమెంట్ స్కూళ్లలోనే ఉన్నారన్నారు. పాఠశాలల్లో కార్పొరేట్ కి దీటుగా సౌకర్యాలు ఉన్నాయని ఎంపిడిఓ పేర్కొన్నారు. ఆరుగురు బడి ఈడు పిల్లలను వెంకు పాత్రుని రేగ ప్రాథమిక పాఠశాలలో ఈ సందర్భంగా చేర్పించారు.ఆరుగురు చిన్నారులు తల్లిదండ్రులకి ప్రభుత్వ బడుల వలన సమకూరే ప్రయోజనాలు అధికారులు వివరించారు. ఉపాధ్యాయులు రవికుమార్,విద్యార్థులు తల్లిదండ్రులు ప్రభృతులు పాల్గొన్నారు.

## వీరఘట్టం మండల టిడిపి ఇన్చార్జిగా వెంకటరమణ



పాలకొండ. మే 15, ప్రభాతవార్త: వీరఘట్టం మండల టీడీపీ అధ్యక్షునిగా సాసుబిల్లి వెంకటరమణ(బుజ్జి)ను నియమించారు. టిడిపి కేంద్ర కార్యాలయం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మంత్రి కింజరాపు అచ్చినాయుడు ఆశీస్సులతో వీరఘట్టం మండల అధ్యక్షులుగా పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ద్వారా వెంకటరమణ నియమించడం జరిగిందన్నారు. పడాల భూదేవి టిడిపి నుంచి పాలకొండ నియోజకవర్గం పాల్గొన్నారు.

## పెదపెంకిలో గొర్రెలు, మేకలు, పశువుల పెంపకాలపై అవగాహన



బలిజిపేట : మండలం పెదపెంకి గ్రామంలో పశు సంవర్ధక శాఖ తరపున పశుసంవర్ధక కార్యకలాపాలను సందర్శించడం జరిగింది. గ్రామంలోని గొర్రెలు, మేకలు, పశువుల పెంపకం పరిస్థితులను పరిశీలించి, రైతులు మరియు కాపరులతో ప్రత్యక్షంగా మాట్లాడి పశువుల ఆరోగ్య పరిరక్షణ, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తగిన మేత మరియు తాగునీటి అందుబాటు గురించి అవగాహన కల్పించాము. అదేవిధంగా పచ్చిమేత పంటల సాగు, పచ్చి మేత వృధాని అరికట్టుటలో ఎష్టుటట ఎెచవతీ (గడ్డి కోత యంత్రం) ప్రాముఖ్యత,మేత నిల్వ విధానాలు, పశువుల షెడ్ల పరిశుభ్రత, దూడల సంరక్షణ మరియు సమయానుకూలంగా టీకాలు, పురుగుమందుల కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని వివరించడం జరిగింది. కార్యక్రమానికి సీతానగరం ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచారకులు డాక్టర్ శ్రీనివాసరావు , బలిజిపేట పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

## కొండ లక్ష్మీ పురంలో చలివేంద్రం ఏర్పాటు



గరివిడి , మే15 ప్రభాత వార్త: మండలం లోని కొండ లక్ష్మీ పురం లో ఆ గ్రామ మాజీ సర్పంచ్ పొంద్రంకి కామేశ్వర రావు చలివేంద్రం ఏర్పాటు చేశారు.గ్రీష్మ తాపానికి ప్రజలు తట్టుకోలేక తల్లడిల్లే సమయంలో ఆయన గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులు,ఉపాధి వేతన దారులు దాహార్తి తీర్చారు. చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేసి ప్రజల మనసులను గెలచుకున్నారు. పలువురు మజ్జిగ, చల్లని మంచినీరు సేవించి పొంద్రంకిని అభినందించారు.

## మిర్తివలసలో ఫ్రైడే అండ్ ఫ్రైడే



పాచిపెంట, మే 15 ప్రభాతవార్త: మండలంలో మిర్తివలస గ్రామంలో శుక్రవారం మండల టిడిపి ఉపాధ్యక్షుడు కొత్తల పోలినాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం పనులు చేపట్టారు . గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు వీధి కాలువలు తీయించారు. ఈ సందర్భంగా, ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు పారిశుధ్యం పై దృష్టి సారించాలని , ఆయన గ్రామస్తులను కోరారు. ఎవరి ఇంటి ముందు వారు పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తను డస్ట్ బిన్ లో నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులు వీధిలో కి చెత్త బండి వచ్చినప్పుడు చెత్త బండిలో చెత్తను పారవేయాలని ఆయన కోరారు . వాతావరణం మార్పు రావడం వలన ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని పరిశుభ్రంగా పరిసర ప్రాంతాల్లో ఉంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిషోర్ వికాస కార్యక్రమం



దత్తిరాజేరు మే 15 ప్రభాతవార్త : కౌమార దశలో ఉన్న బాలికలు బంగారు భవిష్యత్తుకు కిషోర్ వికాస కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్లు. శ్యామలత శకుంతల అన్నారు శుక్రవారం పి లింగాలవలస గుచ్చిమి అంగన్వాడి కేంద్రంలో కిషోర్ వికాసం 2026 వేసవి సెలవులు శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్లు మాట్లాడుతూ బాలికలకు సరైన అవగాహన విద్య మరియు నైపుణ్యాలు అందించడం ద్వారా వారికి భవిష్యత్తులో సాధికారులుగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు కిషోర్ బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి సమాజంలో వారు మరేశీతచైతన్యవంతులుగా నడిపించుకునేలా కిషోర్ వికాసం పేరుతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది అన్నారు బాల్య వివాహాలు నియంత్రించడం కోసమే ప్రభుత్వం కిషోర్ వికాసం కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బాలికలు , పోలీస్ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి అరుణ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా "లార్వావేట"ఘ్యారూ

### ప్రత్యేక అధికారి యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశాలు



సాలూరు, మే15 ప్రభాతవార్త : మున్సిపాల్టీలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు.శుక్రవారం సంబంధిత అధికారులతో వార్డులు పరిశీలించారు.అలాగే బంగారమ్మ, రామకాలనీలో"లార్వావేటా" కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతు వార్డుల్లో డ్రైనేజీలు క్లీనింగ్ ఇంకా పారిశుద్యపనులు చురుగ్గా సాగాలన్నారు.అలాగే నీరునిల్వ ఉన్న ప్రదేశాలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రతిచోట తప్పనిసరిగా ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అంతేకాకుండా లార్వా నివారణలో నిర్లక్ష్యం వహిస్తే అధికారుల తీరుపై తీవ్రపరిణామాలు ఉంటాయని.జేసీ వార్నింగ్ ఇచ్చారు. కమిషనర్ టిటి.రత్నకుమార్,శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ,డిఈ ప్రసాద్,ఏఈ అలేక్ కుమార్, మున్సిపల్ హెల్త్ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## పాదరక్షలు పంపిణీ



చీపురుపల్లి, మే 15, ప్రభాతవార్త.. ప్రతి సంవత్సరం ఎండాకాలంలో చలివేంద్రాలతో పాటు పాదరక్షలు అందించు కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కూడా మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు ఆధ్వర్యంలో శుక్రవారం చీపురుపల్లి సంత మార్కెట్ పరిసరాల్లో మండుటెండలో పాదరక్షలు లేకుండా నడుస్తున్న వారిని గుర్తించి 36 మందికి గోవిందరాజులు ఆర్థిక సహకారంతో ఉచితంగా అందించడం జరిగినది. కార్యక్రమంలో డాక్టర్ పల్లా వెంకయ్య, గుడివాడ రామ్మూర్తి నాయుడు, పొంద్రంకి వాసు, డి ఆర్ ప్రసాద్‌రావు, మీసాల కృష్ణమూర్తి, రెడ్ క్రాస్ టెక్నీషియన్ రమణ, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయండి



విజయనగరం: మే 15 ప్రభాతవార్త; గ్రామస్థాయి నుంచే పార్టీని పటిష్ఠం చేయాలని జిల్లా వైయస్సార్సీపి సమన్వయ కర్త మధ్య శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏడు నియోజకవర్గాల పరిశీలక్కలతో జన శ్రీను సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలేపేతంకు నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితులు భవిష్యత్ కార్యాచరణ ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టవలసిన కార్యక్రమాలపై విస్తృతస్థాయి చర్చలు నిర్వహించారు. గ్రామస్థాయి నుంచే కార్యకర్తలను తయారు చేయాలని పార్టీ సిద్ధాంతాలను పట్టిష్టపరిచి ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాలని నాయకులకు దిశ నిర్దేశం చేశారు. మున్ముందు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని విజయ పదములో నడిపించాలని చిన్న శీను పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ఇంటర్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కొప్పల వెలమ విద్యార్థులకు సన్మానం



బొబ్బిలి, మే 15 ప్రభాతవార్త: బొబ్బిలి నియోజకవర్గం కొప్పలి వెలమ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన టాప్ ర్యాంకులు సాధించిన వెలమ కమ్యూనిటీ హాల్లో కొప్పుల కోప్పలి వెలమసేవా సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు. ఎమ్మెల్సీ గాది శ్రీనివాసులు నాయుడు. బుడ చైర్మన్ డి లక్ష్మీ నాయుడు చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు మెమెంటోని అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు కళాశాల యజమాన్యం పాల్గొన్నారు. కొప్పలి వెలమ సంక్షేమ సంఘం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోసం డబ్బులిచ్చి యువత మోసపోవద్ద




రామభద్రపురం, మే 15 ప్రభాతవార్త : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేస్తున్నారని అటువంటి యువత అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి డీఎస్పీ ఆర్.గోవిందరావు హెచ్చరించారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో గురువారం సాయంత్రం చట్టాలపై గ్రామస్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎవరూ రూపాయి కూడా కట్టవద్దని, ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేస్తారని తెలిపారు. గ్రామాల్లో చీటీలు కట్టి మోసపోవద్దని, కొంత మంది అత్యాశకు వెళ్లి ఎక్కువ వడ్డీ వస్తుందని డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. అలాంటి మోసం చేస్తారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే బెట్టింగులకు పాల్పడి యువత బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు. ఇటీవల కాలంలో యువత ఈ బెట్టింగ్ భూతానికి బలై పోతున్నారని తెలిపారు. బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నార 3. మహిళలపై ఎవరైనా దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వె ఫైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపతే అపరాధ రుసుం తోపాటు జైలు శిక్ష విధిస్తామన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో ఐకమత్యంగా ప్రజలంతా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జ్ఞానప్రసాద్ రావు పాల్గొన్నారు.

## చివర దశలో వదిలేస్తే రోగుల పరిస్థితి ఎలా....?



కురుపాం, మే 15,ప్రభాతవార్త : కురుపాం నియోజకవర్గానికి కేంద్ర బిందువైన కురుపాంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టి అప్పట్లో 95 శాతం పనులు పూర్తి చేసుకుని రోగులకు సేవలు అందించేందుకు చివరి దశకు చేరింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో చివరి దశలో ఉన్న పనులు పూర్తికాక ప్రారంభానికి నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల ప్రజలకు కురుపాం ఆస్పత్రి కేంద్ర బిందువు. 30 పడకల ఆసుపత్రిగా ఉండేటప్పుడు అంతంత మాత్రమే రోగులు వస్తుండేవారు 50 పడకల ఆసుపత్రిగా రూపు దిద్దిన తర్వాత గైనకాలజిస్ట్, జనరల్, డింటిస్ట్ ఆర్థోపెడిక్ ఇలా ఏడు విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. మీరు కూర్చోవడానికి స్థలము లేక ఐదుగురు డాక్టర్లు ఒకేచోట కూర్చుని రోగులకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోగుల సంఖ్య వందల సంఖ్యలో పెరిగింది ప్రతిరోజు 300 వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. సోమ, గురువారాలు 500 రోగుల వరకు వచ్చి తనిఖీ చేయించుకుంటారు. 30 పడకల వరకే పరిమితమైన ఈ హాస్పిటల్ లో అప్పుడప్పుడు ఒకే మంచంపై ఇద్దరు ముగ్గరు రోగులు ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఐదు మండలాల గిరిజన ప్రాంతాలకు కేంద్ర బిందుకావటం తో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆసుపత్రి పనులు చివర దశకు చేరిన చిన్న చిన్న పనులు చేయలేక రెండు సంవత్సరాలగా ప్రారంభానికి ఎప్పుడు ఎప్పుడా అని ఆసుపత్రి ఎదురుచూస్తోంది. వెంటనే నూతన భవనము రోగులకు అందుబాటులోకి తెచ్చి ప్రారంభించాలని నియోజకవర్గం ప్రజలు కోరుచున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కద్రక సందీప్ కు వివరణ కోరగా అన్ని విభాగాలకు వైద్య అధికారులు ఉన్నారని దీంతో వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని దీంతో చాలీచాలని భవనముతో సిబ్బందితోపాటు రోగులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు .ఈ విషయశీ ఉన్నత అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లేమని కొద్ది రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పడం జరిగిందని ఆయన తెలిపారు.

## పల్లె నిద్ర కార్యక్రమం విజయవంతం చేయండి



గరుగుబిల్లి, మే 15, ప్రభాతవార్త : అందరికీ నమస్కారం. గరుగుపల్లి పోలీస్ స్టేషన్ తరపున రావు పల్లి గ్రామంలో రామాలయం వద్ద పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా సోషల్ మీడియాలో కొత్త ధోరణులు, కొత్త తరహా నేరాలు, మొబైల్ ఫోన్ కారణంగా భవిష్యత్తును కోల్పోతున్న యువత, రోడ్డు ప్రమాదాలకు బలవుతున్న యువత, వారిని సరైన రీతిలో నడిపించడానికి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోజురోజుకు సంక్లిష్టమవుతున్న భార్యాభర్తల మధ్య సంబంధాలు మరియు వాటి కారణంగా విచ్ఛిన్న మవుతున్న కుటుంబాలు పెరుగుతున్న కుటుంబ కలహాలు, వాటిని నివారించడానికి గ్రామంలోని పెద్దలు కుటుంబంలోని పెద్దలు తెలుసుకోవలసిన విషయాలు, ఒత్తిడి కారణంగా పెరుగుతున్న ఆత్మహత్యలు, వీటన్నింటికీ నివారణ చర్యలు, తో పాటు గ్రామాలలో తప్పనిసరిగా ఆచరించవలసిన పరిశుభ్రత, బహిరంగ మలమూత్ర ఉమ్మి విసర్జన నివారణ, యువతలో కనుమరుగవుతున్న సామాజిక చైతన్యం, సోదర భావం, పెద్దల పట్ల గౌరవం, ఐకమత్యం, మానవ సంబంధాలు గురించి విపులంగా చర్చించడం జరిగింది.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



నెల్లిమర్ల, మే 15 ప్రభాతవార్త : నెల్లిమర్లలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు.ప్రతినెల నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్, భద్రత ఏర్పాట్లు, గోడౌన్ తాళాలు, శీళ్లను తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సనపల సుధాసాగర్, నెల్లిమర్ల తహసిల్దార్ కె. శ్రీకాంత్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 20న టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ మినీ మహానాడు

### పార్టీ ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు వెల్లడి



నెల్లిమర్ల, మే 15, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ మినీ మహానాడు ను ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్చార్జ్, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు వెల్లడించారు. నెల్లిమర్ల పార్టీ కార్యాలయంలో ఆయన నాలుగు మండలాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ ఏర్పాట్లు జన సమీకరణ తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా మినీ మహానాడు ను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు, శ్రేణులు కృషి చేయాలన్నారు. మహానాడు కార్యక్రమ నిర్వహణను ప్రతిఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామం నుంచి భారీగా కార్యకర్తలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు మహంతి చిన్నంనాయుడు , మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ , మాజీ జడ్పీటీసీలు పతివాడ అప్పలనారాయణ , ఆకిరి ప్రసాద్ , మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ,మహంతి శంకర్రావు , పల్లె భాస్కర్ రావు , పార్టీ సీనియర్ నాయకులు గేదెల రాజారావు , పతివాడ తమ్మునాయుడు , నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు లెంక అప్పలనాయుడు ,అధికార ప్రతినిధి తాడి సత్యనారాయణ , ప్రధాన కార్యదర్శి గురాన చక్రధర్ , పసుపులేటి గోపి , దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన



దత్తిరాజేరు , మే 15 ప్రభాతవార్త : రాష్ట్రంలో గత ఐదేళ్లు దుర్మార్గమైన పాలన నుంచి విముక్తి పొంది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి వైపు దూసుకు వెళు తున్నామని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రవాసాందుల సాధికార సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు గడసాం గ్రామంలో యూనియన్ బ్యాంక్ సహకారంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. దత్తి నుండి భోజరాజు పురం గ్రామం వరకు రెండు కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభించారు. అలాగే దత్తి నుంచి దత్తిరాజేరు గ్రామం వరకు రెండు కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు కోడూరు రహదారి నుంచి పాపయ్య వలస వరకు కోటి రూపాయలతో ఆర్ అండ్ బిరహదారి తో పాటు. పి లింగాలవలస కిట్లు గెడ్డ వరకు కోటితో నిర్మించిన బీటీ రహదారి మరియు బ్రిడ్జిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిలింగాలవలస గ్రామంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులు రహదారి నిర్మిస్తే మీరు చిరకాలం మా హృదయాల్లో నిలిచిపోతారని ఒకే ఒక కోరిక కోరారని కూటమి ప్రభుత్వంవచ్చిన వెంటనే బ్రిడ్జి మంజూరు చేసి ఇప్పుడు గ్రామానికి రహదారి నిర్మాణం కూడా పూర్తి చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అటువైపు బొబ్బిలి వైపు వెళ్లే రహదారి కోసం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనతో మాట్లాడి ఒకటి పాయింట్ రెండు కిలోమీటర్లకు మంజూరు చేయడంతో రహదారి వేగంగా పూర్తయింది అంటూ బేబీ నాయనకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం రాదారిని ఒకటి పాయింట్ 8కోట్లతో పూర్తి చేశామని మంత్రి తెలిపారు ఈ గ్రామానికి రహదారి నిర్మాణం కొన్ని దశాబ్దాల కళ అని ఈరోజుతో ఈ కల నెరవేరడంతో గ్రామంలో సుదీర్ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు సెలవు పెట్టి మరి ఈరోజు ఇక్కడికి రావడం చాలా ఆనందంగ ఉందని మంత్రి పేర్కొన్నారు మీ గ్రామస్తుల ఎన్నికల టైం లో రాత్రి 1:00 వరకు క్యూలో ఉండి ఓట్లు వేసి నన్ను గెలిపించిన విషయం తనకి ఎప్పటికీ గుర్తుందన్నారు తనకు ఓటు వేసి గెలిపించినందుకు మీ రుణం తీర్చుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. పోలీస్ సభ్యురాలు గంటల శ్రీదేవి మాట్లాడుతూ నాయకుల్లో ఎక్కువమంది ధనార్ధన కోసమే రాజకీయాల్లోకి వస్తారని మంత్రి కొండపల్లి మాత్రం నిరంతరం ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి వి గోపాలరాజు మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ పిఏసిఎస్ చైర్మన్ వంగపం ఎలివేణి సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి రామ మిత్తిరెడ్డి ఈశ్వరరావు సింహాచలం సత్తిబాబు ముకుందరావు, సత్తిబాబుకు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## డ్రోన్ ద్వారా సర్వైలెన్స్‌లో నిరంతర నిఘా : టౌన్ సీఐ



సాలూరు, మే15 ప్రభాతవార్త : సాలూరు పట్టణ నిర్జీవ అనుమానస్పద ప్రాంతల్లో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు గగనతల డ్రోన్ సర్వే చేపట్టామని టౌన్ సీఐ అప్పలనాయుడు ప్రెస్ నోట్ విడుదల చేసారు.శుక్రవారం ఆయన తెలిజేసిన వివరాల ప్రకారం టౌన్ లో ఉన్న బ్లాక్ స్పాట్లు,రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు,వేగవతి నది పరివాహక ప్రాంతం అలాగే బంటి స్టేడియం ఇంకా ఇతర ముఖ్య ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా నిఘా పెట్టడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా దీని ముఖ్య ఉద్దేశం అక్రమ కార్యకలాపాలు,మత్తు పదార్థాల వినియోగం రవాణా, అనుమానాస్పద వ్యక్తుల సంచారం,జూదం,ఆన్‌లైన్ బెట్టింగ్,అక్రమ మద్యం విక్రయాలు వంటి చట్టవిరుద్ధ చర్యలను గుర్తిస్తామని సీఐ పేర్కొన్నారు.

## కలగాడ నీటి సంఘం ఎన్నికలు అప్రజాస్వామికం



లక్కవరపు కోట/జామి, మే 15 ప్రభాతవార్త : జామి మండలంలోని సాంబయ్య పాలెం గెడ్డ సిస్టం కలగాడ కి చెందిన నీటి సంఘం ఎన్నికలు శుక్రవారం ఈ గెడ్డ సిస్టం కింద వున్నా అర్హులు అయిన ఓటు హక్కు వున్నా రైతులకు ఎవరికి చెప్పకుండా ఏ రూపంలోనూ సమాచారం తెలియజేయకుండా కనీసం సంబంధిత గ్రామాలలో దండోరా కూడా వేయకుండా అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో రహస్యంగా ఎన్నికలు అధికారులు నిర్వహించడం పట్ల ఆయకట్టుకి సంబందించిన మాజీ ప్రెసిడెంట్ అలాగే మిగిలిన డైరెక్టర్‌లు రైతులు అభ్యన్తరం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇలాగే వారు చెప్పినట్టు వినే కొందరు ఓటు కలిగిన రైతులకు పిలిచి మిగిలిన వారికి సమాచారం లేకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగింది అని దీనిని హై కోర్ట్ లో సవాలు చేయగా కోర్టు 3 నెలల్లో మళ్ళీ ఎన్నికలు సక్రమంగా పెట్టండి అని ఆదేశించినా మళ్ళీ అదే తీరు లో ఇరిగేషన్ అధికారులు ఎన్నికలు నిర్వహించడం ఏమిటి అని మాజీ ప్రెసిడెంట్ రాయవరపు కృష్ణ ఇతర మాజీ డైరెక్టర్ లు అధికారుల చర్యను తప్పు బడుతూ నిరసన తెలుపుతూ జిల్లా కలెక్టర్ కి ఏపీ ప్రభుత్వ గ్రీవెన్స్ కి పిర్యాదు చేసినట్లు విలేకరులకు తెలిపారు గెలిచే అవకాశం ఉంటే ఈ దొంగ చాటు ఎన్నికలు దేనికి అని సజావుగా అని గ్రామాల రైతులకు చెప్పి ఓటింగ్ పెట్టాలి అని గెలవడం కష్టం అని ఇలా ఎమ్మెల్యే అండతో కొందరు వారికి అండగా అధికారులు ఉండి ఇలా అప్రజాస్వామ్యంగా ఎన్నికలు నిర్వహించడం సిగ్గు చేటు అని ఇవి నామి నేటెడ్ ఎన్నికలు కాదు అని రైతులు ఓట్లు వేసి గెలిపించ వలసిన ఎన్నికలు అని గేలవ లేక ఇలా దొడ్డి దారి వేడుకుంటున్నారని వారు ఎద్దేవా చేశారు ఈ ఎన్నికలు రద్దు చేసి సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలి అని వారు కలెక్టర్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## విద్యుత్ ఘాతంతో వ్యక్తి మృతి




మక్కువ మే 15 ప్రభాతవార్త: మండలంలోని ఎర్ర సామంతవలస లో గ్రామ సమీ పంలో 11 కె.వి విద్యు త్ లైన్ తగిలి అదే గ్రామానికి చెందిన పీడిక నవీన్ విద్యుత్ షాక్ తగిలి శుక్రవారం మృతి చెందాడు. విద్యుత్ శాఖ పనిలో భాగంగా నవీన్ విద్యుత్ లైన్ కు తగిలిన చెట్టుకొమ్మలు తొలగించడానికి కూలీగా వెళ్ళాడు. చెట్టుకొమ్మలు తొలగింపు ప్రక్రియలో భాగంగా ఎర్ర సామంత వలస గుడి సమీపంలోని ఆయిల్ పామ్ తోటలో కొమ్మలు తొలగిస్తుండగా పక్కనే ఉన్న 33 కెవి విద్యుత్తు లైనుపై ఆయిల్ పామ్ ఆకుల కోసే పైపు పడడంతో నవీన్ విద్యుత్ షాక్కు గురయ్యాడు. క్షత గాత్రుడను మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించగా, నవీన్ ను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. విద్యుత్ ఉండగా 11 కె.వి సమీపంలో ఉన్న 33 కె.వి విద్యుత్తు లైను చేపట్టడం వలన ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే చెట్లు తొలగింపు ప్రక్రియలో ముందస్తుగా జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరున పత్రికా ప్రకటన ఇదివరకు ఇచ్చేవారు అయితే ఈసారి మాత్రం సోషల్ మీడియా లో మాత్రమే తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

16-05pg10.qxd:16-05pg10.qxd 1/1/02 7:04 AM Page 1



## సింధూ, లక్ష్యసేన్ ఓటమి; సింగిల్స్‌లో ముగిసిన భారత్ సవాల్

# డబుల్స్ సెమీస్‌లో సాత్విక్,చిరాగ్ జోడీ





**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్‌లో భారత్ షట్లర్ల పోరు ముగిసింది. స్టార్ ప్లేయర్లు పీవీ సింధూ, లక్ష్యసేన్ ఇద్దరూ కూడా క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ సింధూ పోరాడి ఓడింది. మూడు సెట్లపాటు హోరాహోరీగా గంటకు పైగా కొనసాగిన పోరులో సింధూపై టాప్ సీడ్, జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచి గెలుపొందింది. తొలి సెట్‌ను 21-19తో నెగ్గి జోరు చూపిన సింధూ.. అదే ధాటి తరువాతి సెట్లలో కొనసాగించడంలో చతికిలపడింది. పలు ఎర్రర్స్ సింధూ చేయడం యమగుచికి కలిసివచ్చింది. తరువాతి రెండు సెట్లను 21-18, 21-15తో నెగ్గి సెమీఫైనల్లో ప్రవేశించింది.

**అదే దారిలో లక్ష్యసేన్**

ఇక 2021 ప్రపంచ ఛాంపియన్ షిప్ బ్రాంజ్ మెడలిస్ట్, ఏడో సీడ్ లక్ష్యసేన్ కూడా సింధూ బాటలోనే పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు.రెండో సీడ్ కున్లావుత్ విటిద్‌సర్న్ 21-19, 21-16తో 53 నిమిషాల్లో లక్ష్యసేన్ పై గెలుపొందాడు. తొలి సెట్‌ను గట్టి పోటీ ఇచ్చిన లక్ష్యసేన్... రెండో సెట్‌లో పుంజుకోలేక చతికిల పడ్డాడు. సింధూ, లక్ష్యసేన్ ఓటమితో సింగిల్స్‌లో భారత్ సవాల్ ముగిసింది.

**సెమీస్‌లో భారత్ జోడీ**

ఇక టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్‌షెట్టి జోడీ పురుషుల డబుల్స్‌లో భారత్ సవాల్‌ను కొనసాగిస్తున్నారు. క్వార్టర్స్‌లో ఈ జోడీ అలవోకగా 21-12, 21-13తో వరుస సెట్లలో జపాన్ జోడీ తకుమి నోమురా- యుయిచి షిమోగామిపై గెలుపొంది సెమీస్‌లోకి దూసుకెళ్లారు. 41 నిమిషాల్లోనే భారత్ జోడీ క్వార్టర్‌ఫైనల్ ముగించింది. మరో టైటిల్ దిశగా దూసుకెళుతోంది.

## చెలరేగిన ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్

# చెన్నైపై లక్నో సూపర్ విన్




**లక్నో:** చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్ ఆశలకు లక్నో సూపర్ జెయింట్ ఝలక్ ఇచ్చింది. దాని వరుస విజయాలకు చెక్ పెట్టింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ చెలరేగి ఆడడంతో సీఎస్‌కేను తమ సొంతగడ్డపై 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఇప్పటికే ప్లే ఆఫ్‌కు దూరమైన లక్నోకు ఇది ఊరటనిచ్చే విజయం. కాగా చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్ అవకాశాలు క్లిష్టమయ్యాయి. చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవడంతో పాటు మిగతా జట్ల సమీకరణలపై ఆధారపడాల్సిన పరిస్థితి.

188 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు ఓపెనర్లు మిచెల్ మార్ష్(38 బంతుల్లో 90; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు)... జోష్ ఇంగ్లిస్(32 బంతుల్లో 36) జతగా ఫ్లయింట్ స్టార్ట్ ఇచ్చాడు. చెన్నై బౌలర్లపై ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడుతూ తొలి వికెట్‌కు 12 ఓవర్లలోనే 135 రన్స్ అందించాడు. ఈ క్రమంలో 21 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేసిన మార్ష్.. ఈ సీజన్‌లో రెండో సెంచరీ సాధించే ఊపులో కనిపించాడు. అయితే అతన్ని ముకుల్ చౌదరి రనౌట్ చేశాడు. ఆ తర్వాత ఒకటి రెండు వికెట్లు వేగంగా కోల్పోయినా, నికోలస్ పూరన్(17బంతుల్లో 32నాటౌట్),ముకుల్ చౌదరి(13 నాటౌట్) ధాటిగా ఆడారు. దీంతో 16.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్నో విజయాన్ని అందుకుంది.

అంతకుముందు చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. సంజూ శాంసన్(20) మరోసారి నిరాశపరచగా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(13), ఉర్విల్ పటేల్(6) కూడా తక్కువ పరురుగులకే పెవిలియన్ చేరారు. ఈ దశలో కార్తీక్ శర్మ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. లక్నో బౌలర్లపై విరుచుకుపడుతూ 42 బంతుల్లోనే 6 ఫోర్లు, ఒ సిక్స్‌లతో 71 పరుగులు సాధించాడు. మరోవైపు డీవాల్డ్ బ్రెవిస్(25), శివమ్ దూబే(16 బంతుల్లో 32) స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడడంతో స్కోరు చెన్నై సూపర్ కింగ్స్ స్కోఉ 180 దాటింది. లక్నో బౌలర్లలో ఆకాష్ సింగ్ మూడు వికెట్లు.. షమీ, షాబాజ్ చెరో వికెట్ పడగొట్టారు.



# ఉప్పల్ మ్యాచ్ టికెట్ ధరలు డబుల్

**హైదరాబాద్, మే 15(వార్త క్రీడా ప్రతినిధి)**

ఐపీఎల్ 2026 సీజన్ చివరి అంకానికి చేరుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ముందు రెండు మ్యాచ్‌లే మిగిలాయి. 18న సీఎస్‌కేతో చెన్నైలో, 22న ఆర్సీబీతో ఉప్పల్ స్టేడియంలో తలపడనుంది. 22న జరిగే మ్యాచ్‌కు ఎక్కడా లేని హైఫ్ వచ్చింది. కారణం ఈ సీజన్ లో హైదరాబాద్ లో ఇదే లాస్ట్ మ్యాచ్ కావడం.. మరోవైపు కోహ్లీ ఆడనుండటం. అందునా కోహ్లీ సూపర్ ఫామ్‌లో ఉండటం. బిగ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న కోహ్లీ ఆటను ప్రత్యక్షంగా చేసేందుకు క్రికెట్ ప్రియులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ మ్యాచ్ టికెట్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ మ్యాచ్ టికెట్ ధరలను సన్‌రైజర్స్ యాజమాన్యం భారీగా పెంచింది. టికెట్ రేట్లను ఒక్కసారిగా డబుల్ చేసింది. ఈ మ్యాచ్‌కు టికెట్ బుకింగ్స్ శుక్రవారం డిస్ట్రిక్ యాప్‌లో ప్రారంభమయ్యాయి. బుకింగ్స్ అలా ఓపెన్ అయిన నిమిషాల్లోనే టికెట్ల కోసం అభిమానులు పోటీ పడ్డారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో లక్షల మంది ఫ్యాన్స్ ఉన్నారు. టికెట్ ధరలు ఈ స్థాయిలో పెంచడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోహ్లీ అభిమానాన్ని క్యాష్ చేసుకోవడం ఏంటని మండిపడుతున్నారు. కాసేపట్లోనే సోల్డ్ ఔట్ అని పెట్టి.. టికెట్లను బ్లాక్ మార్కెట్ లోకి మళ్లిస్తున్నారని క్రికెట్ అభిమానులు ఆరోపిస్తున్నారు. బ్లాక్ టికెట్ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టికెట్ ధరలు భారీగా పెంచడమే కాకుండా అసలు టికెట్లు అందుబాటులో లేకుండా చేయడమేంటని ముఖ్యంగా కోహ్లీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

**పెరిగిన ధరలు**

950 రూపాయల టికెట్ 2000కు, 1500 ఉన్న టికెట్ 3వేలకు, 1910 ఉన్న టికెట్ 3వేల 500కు, 2వేల 500 ఉన్న టికెట్ 4వేల 500కు, 4వేల 500 ఉన్న టికెట్ 6వేలకు, 7 వేలు ఉన్న టికెట్ ధర 10 వేల రూపాయలకు 23 వేలు ఉన్న బాక్స్ టికెట్ ధర 30 వేల రూపాయలకు, 30వేలు ఉన్న కార్పోరేట్ బాక్స్ టికెట్ ధర 45వేలకు పెంచి ఆన్‌లైన్‌లో సన్‌రైజర్స్ యాజమాన్యం టికెట్లను అమ్ముతోంది.

## ఇటాలియన్ ఓపెన్ సెమీస్‌లో సినర్

# జోకోవిచ్ రికార్డు బ్రేక్

**రోమ్:** ఇటలీయన్ ఓపెన్ సెమీఫైనల్ చేరడం ద్వారా ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సినర్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నోవాక్ జోకోవిచ్‌ను వెనకినక నెట్టి మాస్టర్స్ సిరిస్ టోర్నీలో అత్యధిక వరుస విజయాలు సాధించిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఈ ఏడాదిలో ఇటలీ స్టార్ సినర్‌కు ఇది వరుసగా 32వ విజయం. సెర్బియా దిగ్గజం నోవాక్ జోకోవిచ్ 2011లో వరుసగా 31 విజయాల రికార్డు దీంతో బ్రేక్ అయింది. అలాగే వరుసగా అయిదు మాస్టర్స్ ఓపెన్‌లలో సెమీఫైనల్ చేరిన నాదల్ రికార్డును సినర్ సమం చేశాడు.

ఈ ఏడాది అద్భుత ఫామ్ చాటుతున్న యానిక్ సినర్... సొంతగడ్డ ఇటలీయన్ ఓపెన్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 6-2, 6-4తో వరుస సెట్లలో 12వ సీడ్ ఆండ్రీ రుబ్లోవ్‌ను ఓడించాడు. తొలి సెట్‌ను అలవోకగా 6-2తో నెగ్గిన సినర్‌కు రెండో సెట్‌లో రుబ్లోవ్ నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. అయినా సినర్ సెమీస్ చేరకుండా నిలవరించలేకపోయాడు. సెమీఫైనల్లో మెద్వదేవ్ (రష్యా)తో తలపడనున్నాడు. ఇప్పటివరకు వరుసగా అయిదు మాస్టర్స్ టైటిల్స్ సాధించిన సినర్.. ఆరో టైటిల్‌పై ఫోకస్ పెట్టాడు.

ఈ ఇటాలియన్ ఆటగాడు అన్ని పోటీలలో కలిపి గత 47 మ్యాచ్‌ల్లో కేవలం రెండుసార్లు మాత్రమే పరాజయం పొందాడు. షాంఘైలో మూడవ రౌండ్‌లో ఓడిన తర్వాత సినర్... వరుసగా పారిస్, ఇండియన్ వెల్స్, మయామి, మాంటెకార్లో, మాడ్రిడ్‌లలో మాస్టర్స్ 1000 టైటిళ్లను కైవసం చేసుకున్నాడు.

**ఫైనల్లో కొకొ గాఫ్, ఎలీనా స్విటోలినా**

మహిళల సింగిల్స్ ఫైనల్లో అమెరికాకు చెందిన మూడో సీడ్ కొకొ గాఫ్..ఏడోసీడ్ ఎలీనా స్విటోలినా(ఉక్రెయిన్)తో తలపడనుంది. సెమీఫైనల్లో కొకొ గాఫ్ 6-4, 6-3తో వరుస సెట్లలో రొమేనియా క్రీడాకారిణి క్రిస్టియాపై గెలుపొందగా... స్విటోలినా మూడు సెట్ల హోరాహోరీ పోరులో 6-4, 2-6, 6-2తో నాలుగో సీడ్‌ఇగా స్విటెక్(పోలాండ్)ను కంగుతినిపించింది.



# 28.4 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్యలోటు



**న్యూఢిల్లీ, మే 15:** భారత్‌నుంచి ప్రపంచ దేశాలకు జరిగే ఎగుమతులు ఏప్రిల్‌లో 13.6 శాతం పెరిగి 80.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు చెలరేగినప్పటికీ ఎగుమతుల్లో ఎక్కడా ప్రతికూలత ఎదురుకాలేదన్నారు. వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ ఎగుమతులు ప్రాంతీయ సవాళ్లు ఎదురైనా పెరుగుతూనే ఉన్నాయని కొత్త విదేశీ మార్కెట్లకు కొత్త ఉత్పత్తుల మార్కెట్లను అన్వేషించడంతో ఎగుమతులు పెరిగినట్లు తెలిపారు. ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్‌లో 38.28 బిలియన్ డాలర్లనుంచి 43.56 బిలియన్ డాలర్ల వరకూ ఉన్నాయి. సేవల రంగ ఎగుమతులు 32.8 బిలియన్ డాలర్లనుంచి 37.2 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక భారత్ మొత్తం దిగుమతులు కూడా ఏప్రిల్‌లో 82.3 బిలియన్ డాలర్ల నుంచి 88.6 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దీనితో వాణిజ్యలోటు 27.1 బిలియన్ డాలర్ల నుంచి 28.4 బిలియన్ డాలర్లకు పెరిగింది. చైనానుంచి భారత్ ఎక్కువ దిగుమతులు చేసుకుంటుంటే అమెరికాకు భారత్ ఎక్కువ ఎగుమతులు చేస్తోంది. కొత్తగా 1821 కొత్త ఉత్పత్తి మార్కెటింగ్ దేశాలను కూడా గుర్తించింది. విభిన్న దేశాలకు ఎక్కువ ఎగుమతులుచేసే లక్ష్యంతో ఉంది. అలాగే అత్యధిక విలువలున్న ఉత్పత్తి కేటగిరీలకు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో స్థానం ఎక్కువ ఉంది. ఎగుమతుల్లో నౌకలు, పడవలు, జలవనరుల వస్తువులు 19 కొత్త మార్కెట్లలో 57 మిలియన్ డాలర్లు రాబడులు తెచ్చాయి. ఇక న్యూక్లియర్ రియాక్టర్, బాయిలర్ విడిభాగాలు 13 కొత్త మార్కెట్లకు ఎగుమతులతో 14.3 మిలియన్ డాలర్లు సమకూరినట్లు రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఇక ఏప్రిల్‌నెల దిగుమతుల్లో బంగారం దిగుమతులు 5.63 బిలియన్ డాలర్లకు పెరిగాయి. విలువలు భారీగా పెరగడమే కారణం.పరిమాణం తగ్గినప్పటికీ విలువలు పెరిగాయి. దిగుమతుల కట్టడికే ప్రభుత్వం 6 శాతం ఉన్న సుంకాలను 15శాతానికి పెంచింది.

# పసిడి ధరల జోరుకు బ్రేక్



**ముంబయి, మే 15:** దేశీయ మార్కెట్లలో కొద్దినెలలుగా పరుగులు పెడుతున్న బంగారం ధరల జోరుకు బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాలను పెంచడం వంటి కారణాలతో శుక్రవారం దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండిధరలు భారీగా పతనమయ్యాయి. కొనుగోలుదారులకు ఇది కాస్త ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి. శుక్రవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,240 తగ్గి రూ.1,60,090 వద్దకు చేరింది. ఇక, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా2,050 తగ్గి రూ.1,46,750 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.10,000 కోత పడటంతో ప్రస్తుతం రూ.3.05 లక్షల వద్ద కొనసాగుతోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,60,090గా ఉండగా, ఢిల్లీలో రూ.1,60,240గా ఉంది. చెన్నైలో మాత్రం కాస్త ఎక్కువగా రూ.1,63,390 వద్ద ట్రేడవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ కిలో వెండిధర రూ.3.05 లక్షల వద్దనే కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే దేశవ్యాప్తంగా పసిడి, వెండి ధరల్లో భారీ తగ్గుదల నమోదైంది.

# స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, మే 15:** దేశీయ ఈక్విటీ సూచీలు వారాంతంలో స్వల్పనష్టాలతో ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 160.73 పాయింట్లు క్షీణించి 75,237.99 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 46.10 పాయింట్లు క్షీణించి 23,643.50 పాయింట్లవద్ద నిలిచింది. గడచిన రెండు సెషన్లలో ఎన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 50 సూచీ 1.33వాతం పెరిగాయి. శుక్రవారం మార్కెట్లలో హిందాల్కో 3.47శాతంపెరిగితే రిలయన్స్ 1.67 శాతం, ఎస్‌బిఐ 0.10శాతం క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.48 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.37శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లలో ఎన్ఎస్ఇలో 1215 షేర్లుపెరిగితే 2027 షేర్లు క్షీణించాయి. 124 షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు ట్రేడింగ్ ముగిసే నాటికి 95.86గా జరిగిందని తెలుస్తోంది. ముందురోజు 95.64 కంటే గణనీయంగా క్షీణించింది. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 7.076శాతంగా కూపన్‌రేటు కొనసాగుతోంది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్ సెటిల్‌మెంట్లు రూ.1,59,154గా ఉన్నాయి. పదేళ్ల అమెరికా బాండ్లు 1.88శాతం పెరిగి 4.541గా కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలోబ్రెంట్ ముడిచమురు జులై సెటిల్‌మెంట్లు 2.92 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 108.64డాలర్లుగా కొనసాగింది. దేశీయంగా నజారా టెక్నాలజీస్ 12.69శాతం, యునైటెడ్ స్పిరిట్స్ 3.34శాతం, పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 9.89శాతం, షీలా ఫోమ్ 11.90 శాతం చొప్పున పెరిగాయి. హిందూస్థాన్ జింక్ 4.97శాతం, అపోలో టైర్స్ 1.75శాతం, దిలీప్ బిల్డ్‌కాన్ 6.44శాతం క్షీణించాయి. కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ 2.55శాతం, సలారా యాక్టివ్‌ఫార్మా సైన్సెస్ 13.66శాతం పెరిగితే ఇండియన్ హ్యూమ్‌పైప్ కంపెనీ 4.83శాతం, ఆల్‌కార్గో లాజిస్టిక్స్ 2.54శాతం చొప్పున క్షీణించాయి. కార్పొరేట్ ఆర్థిక ఫలితాల్లో ఒత్తిడివల్లనే ఈకంపెనీలు క్షీణించినట్లు తెలుస్తోంది.

# 150 ఎన్‌బిఎఫ్‌సిల రిజిస్ట్రేషన్ రద్దుచేసిన ఆర్బీఐ



**ముంబై, మే 15:** రిజర్వుబ్యాంకు నిర్దేశించిన నిబంధనలు పాటించడం లేదన్న అభియోగాలపై ఆర్బీఐ ఏకంగా 150 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు కేంద్ర బ్యాంక్ తెలిపింది. లైసెన్సులు రద్దయిన ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల్లో అత్యధికంగా పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోనే ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా కోల్‌కత్తా ప్రాంతంలో అత్యధికంగా ఉన్నాయని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1934లోని సెక్షన్ 45 ఐఎ (6) కింద దఖలు పడిన అధికారాలను ఉపయోగించి కేంద్ర బ్యాంకులు పలు కంపెనీల సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసిందని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. లైసెన్సులు రద్దయిన కంపెనీల్లో కొన్ని స్మాల్ అండ్ మీడియం సైజ్ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలున్నాయి. ఈ సంస్థలు రుణాలు ఇవ్వడం, లీజింగ్, పెట్టుబడుల వంటి ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. ఈ జాబితాలో తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, హరియాణా రాష్ట్రాల్లోని కంపెనీలు సైతం ఉన్నాయని వెల్లడించింది. లైసెన్స్ రద్దయిన కంపెనీలు ఆర్‌బీఐ చట్టం 1934లోని సెక్షన్ 45లోని క్లాజ్ (ఎ)లో నిర్వచించిన విధంగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ వ్యాపారాన్ని నిర్వహించకూడదని స్పష్టం చేసింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అంటే ఇవి ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు. ఇవి రుణాలు ఇవ్వడం, పెట్టుబడులు పెట్టడం సహా బ్యాంకుల మాదిరిగా ఇతర ఫైనాన్షియల్ సర్వీసులను అందిస్తుంటాయి. వాటికి బ్యాంకింగ్ లైసెన్స్ ఉండదు.

అయినప్పటికీ ఆర్‌బీఐ చట్టం ద్వారా రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి. సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ రద్దు అంటే ఆయా కంపెనీలు ఇకపై ఎన్‌బీఎఫ్‌సీలుగా కార్యకలాపాలు నిర్వహించడం కుదరదు. సెంట్రల్ బ్యాంక్ నియంత్రణలో ఉండే ఎలాంటి ఫైనాన్షియల్ బిజినెస్ పనులు చేయకూడదు. రుణాలజారీ, పెట్టుబడుల సమీకరణ వంటివి చేయడానికి వీలులేదు. ఎన్‌బీఎఫ్‌సీలు నిర్వహించే ఏ ఆర్థిక పరమైన వ్యాపార కార్యకలాపాలను నిర్వహించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# 95.86కు పడిపోయిన దేశీయ కరెన్సీ



**ముంబయి,మే 15:** డాలరుతో రూపాయి చెలామణి రికార్డు స్థాయికి పడిపోయింది. వారాంతంలో అంటే శుక్రవారం సాయంత్రానికి 96 రూపాయలకు చేరింది. ముడిచమురుధరలు పెరగడం, ద్రవ్యోల్బణ ఆందోళనలు వంటివి రూపాయిని మరింత క్షీణింపచేసాయి. 95.86వద్ద ట్రేడింగ్ ముగిసింది. ఈ ఏడాది ఇప్పటివరకూ ఆరుశాతం నష్టపోయింది. గడచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సుమారు రెండుశాతంగా క్షీణించింది. పశ్చిమాసియా యుద్ధం ఉద్రిక్తతలు మరింతగా క్షీణింపచేసాయి. డాలర్ సూచీ పైపైకి ఎగబాగడం, అమెరికా రిటైల్ సేల్స్‌పటిష్టం కావడం, కార్మిక మార్కెట్ గణాంకాలు స్థిరంగా కొనసాగడం, ఫెడ్ రిజర్వు రేట్‌కట్స్ కూడా తగ్గిస్తుందన్న అంచనాలతో డాలర్ సూచీ పైపైకి ఎగబాకింది. ఫోరెక్స్ ట్రేడర్ల కథనం ప్రకారం భౌగోళిక అనిశ్చితి పరిస్థితులు, ఎఐ ఆధారిత పెట్టుబడుల అవకాశాలు వంటివి మూలధన నిధుల రాకపై భారం పెంచాయి. దీనికితోడు ఎఫ్‌డిఐలు దేశీయ మార్కెట్లలోకి రావడం కూడా తగ్గింది.అదే సమయంలో ముడిచమురుదరలు భారీగాపెరిగాయి. దీనివల్ల డాలర్ చెల్లింపులు పెరగడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది.

ఇంటర్‌బ్యాంక్ ఫోరెక్స్ కౌంటర్‌లో రూపాయి 95.86వద్ద ప్రారంభం అయి రికారు కనిష్టం అంటే 96.14కి సైతం చేరింది. అంతకుముందు రోజుకంటే 50 పైసలు క్షీణించి చివరకు 95.86 పైసలవద్ద ముగిసింది. ముందురోజుకంటే 22 పైసలు క్షీణించింది. ఆర్బీఐ జోక్యంచేసుకుని డాలర్ల విక్రయాల కౌంటర్లు ప్రారంభించడంతో కొంతమేర కట్టడి అయింది. బ్రెంట్‌ముడిచమురు 3.14శాతంపెరిగి బ్యారెల్‌కు 109.04 డాలర్లుగా కొనసాగింది.విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో 187.46 కోట్లు పెట్టుబడులుపెట్టారు.



# అందుబాటులోకి ఐటి రిటర్న్ ఫారాలు

**న్యూఢిల్లీ, మే 15:** పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025-26 ఆర్థిక సంవత్సరం) సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు ఐటీఆర్1 (సహజ్), ఐటీఆర్4 (సుగం) ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీలను ఈఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చింది. పన్ను చెల్లింపుదారులు ఇప్పుడు ఈ రెండు ఫారాలను ఆన్‌లైన్‌లో నేరుగా ఫైల్ చేయవచ్చని లేదా ఎక్సెల్ యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో కూడా నింపవచ్చని స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్‌లో ఫారమ్ నింపిన వారు, ఆ తర్వాత ఫైల్‌ను ఈ ఫైలింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను దాఖలు చేయడానికి సాధారణంగా జులై 31 చివరి తేదీగా ఉంటుంది. ఐటీఆర్1 సహజ్ ఫారాన్ని రూ.50 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న నివాస భారతీయులు ఉపయోగించవచ్చు. ఐటీఆర్4 సుగం ఫారాన్ని రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, ఎల్ఎల్‌పీలు మినహా ఇతర సంస్థలు దాఖలు చేయవచ్చు. ఈ అసెస్‌మెంట్ సంవత్సరానికిగాను కేంద్ర ప్రత్యక్ష పన్నులబోర్డు సిబిడిటి ఇప్పటికే కొత్త నిబంధనలతో కూడిన ఐటీఆర్ ఫారాలను నోటిఫై చేసింది. దీని ప్రకారం లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్, షేర్ల బైబ్యాక్ లావాదేవీల వల్ల కలిగిన నష్టాలు వంటి అదనపు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12 వృద్ధితో రూ.23.40 లక్షల కోట్లకు చేరినట్లు సీబీడీటీ డేటా చెపుతోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.